fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 63 | విజయవాడ, సోమవారం 5 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



మన్యం బంద్ జయప్రదం

- బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు
- విభజన చట్టం హామీలను అమలు చేయాలి : గిరిజనుల డిమాండ్
- స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసిన వ్యాపారులు
- శ్రీకాకుళం, విశాఖల్లో అరెస్టులు

9



రెండో విడత పార్లమెంట్ సమావేశాలు

నేటి నుండి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



విశాఖలోని ఆర్‌కె బీచ్ వద్ద ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కాగడాలు ప్రదర్శిస్తూ నిర్వహించిన భారీ ర్యాలీ (వార్త 2లో)

ప్రతిష్టంభన తప్పదా?

- బిల్లుల ఆమోదం కోసం ప్రభుత్వం
- నీరవ్‌మోడీ, రఫేల్ అస్త్రాలతో కాంగ్రెస్
- నిరుద్యోగం, దళితులపై దాడులు, రైతాంగ సంక్షోభం వామపక్షాల అజెండా
- ప్రత్యేక హోదా కోసం గళం విప్పనున్న ఎపి ఎంపీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నేటి(సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు జగరనున్న రెండో విడత సమావేశాల్లోనూ ప్రతిష్టంభన తప్పనిస్థితి నెలకొంది. ఈ సమావేశాల్లో మొత్తం 38 బిల్లులను ప్రవేశపెట్టి, ఆమోదించుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అజెండాను మిగతా 8లో

సీను మారేనా ?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేటి నుండి ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సీను మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉదయం 9 గంటలకు సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం సమావేశాల్ని వాయిదా వేయనున్నారు. తెలుగుదేశం ప్రభుత్వానికి ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో సమావేశాల తీరుపై ఆసక్తి నెలకొంది. గత అసెంబ్లీ సమావేశాల్ని ప్రధాన ప్రతిపక్షం వైసిపి బహిష్కరించింది. దీంతో మిత్రపక్షంగా ఉన్న బిజెపితో కలిసి సమావేశాల్ని నిర్వహించారు. ఫిబ్రవరి ఒకటోతేదీన కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుండి ఇప్పటి వరకూ బిజెపి, తెలుగుదేశం మధ్య ఉప్పునిప్పులా తయారైన వాతావరణం కనిపిస్తోంది. ఈ సమావేశాల్లో టిడిపి అక్రమాల్ని బయటపెడతామని బిజెపి నాయకులు ఇప్పటికే ప్రకటించారు. ఆ పార్టీ అసెంబ్లీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు కూడా టిడిపి తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యకం చేశారు. కేంద్రం నుండి ఎన్నో చేస్తున్నా బిజెపిని ఇబ్బంది పెట్టే విధంగా వ్యవహరిస్తోందని, టిడిపి వ్యవహారాన్ని తాము అసెంబ్లీ సమావేశాల్లో బయటపెడతామని చెబుతున్నారు. దీంతో అసెంబ్లీ సమావేశాల తీరు సర్వత్రా చర్చనీయాంశం అయింది. ఈ సమావేశాల్లో బయటచెప్పిన విధంగా వ్యవహరిస్తారా ? లేక బయట శతృత్వం, లోపల మితృత్వం అనే విధంగా వ్యవహరిస్తారా మిగతా 9లో

హస్తినలో హోదా హోరు

- నేటినుండి ఆందోళనలు
- ఇప్పటికే చేరుకున్న వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు
- హాజరుకానున్న ఇతర పార్టీల నాయకులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీ వేదికగా రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన పోరు నేటి నుండి ఉధృతం కానుంది. పార్లమెంటులో ఒకవైపు ఎంపిలు గళం విప్పనుండగా, అదే సమయంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ వీధుల్లో ఆందోళనలకు, ప్రదర్శనలకు రంగం సిద్ధమయ్యింది. వైసిపి నేతృత్వంలో ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు సోమవారం నాడు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. మంగళ, బుధవారాల్లో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నేతృత్వంలో సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు, ప్రజా సంఘాలు గళం విప్పనున్నాయి. గురు, శుక్ర వారాల్లో ఆందోళన నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమాలకు దేశంలోని ఇతర పార్టీల ఎంపీలు, పార్లమెంటరీ నేతలు కూడా హాజరుకానున్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఇప్పటికే వివిధ పార్టీల నేతలకు ఆహ్వానం పంపింది. ఆందోళనల్లో పాల్గొనడానికి మిగతా 9లో





దళిత ఆత్మ గౌరవ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, వేదిక పై వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు , పక్కన సభకు హాజరైన వారిలో ఒక భాగం (వార్త 2లో)

గొట్టిపాడు ఘటనపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం

2

- చలో గుంటూరు తరహాలో పలు జిల్లాల్లోనూ....
- న్యాయం జరిగే వరకూ వదిలే ప్రసక్తేలేదు
- అప్పటికీ న్యాయం జరగకపోతే చలో అసెంబ్లీ
- 'ఛలో గుంటూరు' లో వక్తలు

ఐక్య వేదిక నేతల నిరవధిక నిరాహార దీక్షలు

- ప్రజల చేతుల్లోకి విద్యుత్ కార్మికుల ఉద్యమం
- 7న 'చలో విద్యుత్ సౌధ'కు భారీగా తరలిరండి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్
- మద్దతు తెలిపిన పలు సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం, యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా విద్యుత్ కార్మికుల ఉద్యమాన్ని ఉధృతం చేసే క్రమంలో విజయవాడలోని ధర్నా చౌక్‌లో విద్యుత్ కార్మికుల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ నేతలు పి.కాశీమధుబాబు, ఎం.బాలకాశీ, నాగరాజు, రమణ, జి.హరిత, సిహెచ్.సరోజలు ఆదివారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరానికి పలువురు కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకులు హాజరై మద్దతు తెలిపారు. ఐక్య వేదిక దీక్షకు మద్దతు తెలిపిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్ మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల ఉద్యమం ప్రజల చేతుల్లోకి వెళ్లే పరిస్థితి కనిపిస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల్ని పరిష్కరించాలన్నారు. ఈ నెల 7న జరిగే 'చలో విద్యుత్ సౌధ' కార్యక్రమానికి విద్యుత్ కార్మికుల తోపాటు ఇతర అన్ని రంగాల్లోని కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతుగా సిఐటియు, ఎఐటియుసి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు సోమవారం నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని క్షేత్ర స్థాయిలో కార్మికులపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నా, పట్టు వీడకుండా కార్మికులు 13 రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. ట్రాన్స్‌కో సిఎండి మిగతా 9లో



త్రిపుర గవర్నర్‌కు రాజీనామా పత్రం అందజేసి వస్తున్న మాణిక్ సర్కార్

మాణిక్ సర్కార్ రాజీనామా

- త్రిపురలో 7న కొత్త ప్రభుత్వ ఏర్పాటు
- మేఘాలయ సిఎంగా సంగ్మా?
- నాగాలాండ్‌లో రియోకు గవర్నర్ ఆహ్వానం

అగర్తలా/షిల్లాంగ్/కోహిమా : త్రిపుర ముఖ్యమంత్రి పదవికి మాణిక్ సర్కార్ ఆదివారం రాజీనామా చేశారు. రాష్ట్ర గవర్నర్ తథాగత రాయ్‌కి రాజీనామా పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే వరకు మాణిక్ సర్కార్ అపధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో మాణిక్ సర్కార్ ధనపూర్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. బిజెపి రాష్ట్రానికి చెందిన ఇండిజినియర్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి)తో పొత్తు పెట్టుకుంది. రాష్ట్రంలో ఈ నెల 7న కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయనున్నదని మిగతా 2లో

పులివెందులలో ఉద్రిక్తత

- గాల్లోకి పోలీసు కాల్పులు
- టిడిపి, వైఎస్‌ఆర్‌సిపి నేతల సవాళ్లు
- పరస్పరం రాళ్ల దాడులు
- ఎస్ఐ, మరో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-పులివెందుల

కడప జిల్లా పులివెందుల ప్రాంత అభివృద్ధిపై వైసిపి, టిడిపిలు ఆదివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బహిరంగ సవాళ్ల చర్చా వేదిక కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. చర్చలు వీడి కయ్యానికి కాలు దువ్వుకున్నారు. దీంతో మిగతా 9లో



టెట్ ప్రాథమిక కీ విడుదల

9 వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ప్రాథమిక 'కీ' ఆదివారం విడుదలయ్యింది. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 2 వరకు పది రోజుల పాటు ఈ పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. పేపర్-1ను 8 సెషన్స్‌లో, పేపర్-2ను 8 సెషన్స్‌లో, పేపర్-3ను మూడు సెషన్స్‌లో, పేపర్-1,2 ను కలిపి ఒక సేషన్‌లో నిర్వహించారు. అన్ని సెషన్స్‌లకు సంబంధించిన 'కీ'నిఏంవ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 'కీ'పై అభ్యంతరాలను ఈనెల 9వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే విద్యాశాఖ స్వీకరించనుంది. అభ్యర్థులు రాసిన ప్రశ్నాపత్రాల్ని కూడా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

వినతి

వైసిపి పార్టీ నుంచి గెలిచి టిడిపిలో చేరిన 23 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని వైసిపి జాతీయ కార్యదర్శి విజయసాయి, శాసనమండలి ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి స్పీకర్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు.



మేం చెప్పిందే జెఎఫ్‌సి చెప్పింది

పిఎసి ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగేళ్లుగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తున్న అంశాలనే జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తేల్చిందని పిఎసి ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక హోదా రాష్ట్ర హక్కు అని జెఎఫ్‌సి చెప్పిందని, మొదటి నుంచి అదే విషయాన్ని వైసిపి డిమాండ్ చేస్తోందని అన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రం కట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం వద్దని తాము కూడా చెబుతున్నామని, అదే విషయాన్ని జెఎఫ్‌సి కూడా చెప్పిందన్నారు. రైల్వే జోన్, దుగ్గరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, విద్యా సంస్థలు రావాలని వైసిపి మొదటి నుంచి డిమాండ్ చేస్తోందన్నారు. ఎన్డీయే, టిడిపి ప్రభుత్వాల్లో పవన్ కల్యాణ్ భాగస్వామి అని, నాలుగేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల్లో ఆయనకీ భాగస్వామ్యం ఉందన్నారు. టిడిపి, బిజేపి భాగస్వామ్యం నుంచి బయట పడేందుకు పవన్ చేస్తున్న ప్రయత్నాలుగానే తాము భావిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుతానిదే తప్పు అన్నట్లుగా పవన్ చూపిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గించి, బాధ్యతల నుంచి బయటపడేసేందుకు చేసిన ప్రయత్నంగా అనిపించిందన్నారు. కేంద్రానికి ఎంత బాధ్యత ఉందో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అంతే బాధ్యత ఉందన్నారు. అవిశ్వాస తీర్మానం అంశం విషయంలోనూ పవన్ తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈనెల 21న అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడితే సమయం సరిపోదనేది వాస్తవం కాదన్నారు.



విదర్భ మీదుగా ద్రోణి

రాష్ట్రంలో ఎండల తీవ్రత

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి విదర్భ మీదుగా ఉత్తర కర్నాటక వరకూ అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉండబోదని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. నాలుగు రోజులు పాటు కోస్తా, రాయలసీమల్లో తీవ్రమైన వేడి పరిస్థితులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. కోస్తాలో పలు చోట్ల 35 నుంచి 39.5, రాయలసీమలో 37 నుంచి 39 డిగ్రీల మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రివేళల్లో చలి ప్రభావం క్రమంగా తగ్గుముఖం పడుతోంది.

ప్రజ్ఞ

1. ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళ ?
2. పంజాబ్‌లో డీఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన భారత మహిళల టీ20 క్రికెట్ జట్టు కెప్టెన్?
3. పూర్తి మహిళా సిబ్బందితో సాగర్ పరిక్రమ సాహసయాత్ర చేస్తున్న తెరచాపతో నడిచే ఐఎన్ఎస్‌వి తరణి ఇప్పుడు ఎక్కడికి చేరుకుంది?
4. ప్రపంచంలో ఉత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో టాప్ -10 విద్యాసంస్థల్లో ఎన్ని అమెరికాకు చెందినవి ఉన్నాయి?
5. విద్యుదుత్పత్తి శాతం (PLF)లో దేశంలోని థర్మల్ కేంద్రాల్లో సింగరేణి ఏ స్థానంలో నిలిచింది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే.. స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

హోదా, రైల్వే జోన్‌కోసం

పిడికిళ్లు బిగించి పోరాడాలి

- బ్రిటిష్ వారిని తరిమికొట్టే అల్లూరే మనకు స్ఫూర్తి
- విశాఖలో 'ఉత్తరాంధ్ర ఆత్మగౌరవ ఘోష' భారీ ర్యాలీ
- సినీ హీరో శివాజి, రఘువీరా, రామకృష్ణ, నర్సింగరావు ఉద్ఘాటన



కాగడాల ప్రదర్శనలో కొణతాల, రఘువీర, శివాజి, నర్సింగరావు తదితరులు

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి


ఆంధ్రప్రదేశ్‌కు హోదా, విశాఖకు రైల్వేజోన్, కడపకు స్టీల్‌ప్లాంట్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కోసం ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం 'ఉత్తరాంధ్ర జనఘోష'తో విశాఖ సముద్ర తీరం హోరెత్తింది. మాజీ మంత్రి, ఎంపీ కొణతాల రామకృష్ణ ఆధ్వర్యాన సినీ హీరో శివాజి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సిహెచ్.నరసింగరావు, జిల్లా, నగర కార్యదర్శులు కె లోకనాథం, డాక్టర్, బి.గంగారావు, లోక్‌సత్తా రాష్ట్ర నేత భీశెట్టిబాబ్జీ తదితరుల నేతృత్వాన అత్యధిక మంది ప్రజానీకం బీచ్‌లోని కాళీమాత టెంపుల్ నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకూ కాగడాలు పట్టుకుని, కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ జరిగిన హోదా సభకు కొణతాల అధ్యక్షత వహిస్తూ తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఆంధ్రా ప్రజల శంఖారావమే ఈ ఉద్యమమని ప్రకటించారు. తెలంగాణా ముఖ్యమంత్రి, టిఆర్ఎస్ నేత కె.చంద్రశేఖరరావు మన ఉద్యమానికి మద్దతు పలికారని చెప్పారు. విభజన హామీలన్నీ కేంద్రం అమలు చేయాలని కోరుతున్నందుకు ఆయన్ను అభినందించారు. సభలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘువీరారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో హోదా అంశం చర్చకొచ్చేలా అందరం కలిసి ఢిల్లీ కెళ్దామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో అసెంబ్లీని వాయిదా వేసి ఢిల్లీకి రావాలని, ప్రతిపక్ష నేత పాదయాత్ర ఆపి రావాలంటూ రఘువీరా పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ నుంచి ఎంపీగా గెలిచిన కంభంపాటి హరిబాబుకు సిగ్గూ, లజ్జా లేదని, హోదా, రైల్వేజోన్ కోసం ఏనాడైనా పార్లమెంట్‌లో అడిగారా? ఆయనకు ఈ ప్రాంత ప్రజలు గట్టిబుద్ధి చెప్పాలన్నారు. సినీహీరో శివాజి మాట్లాడుతూ మనం కోరుకోని విభజన జరిగి మూడున్నరేళ్లు దాటిందని, ఇది విభజన హామీల అమలు ఉద్యమమని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఈ గడ్డపై జనం హోదా కోసం పోరాడాలని కోరారు.

ప్రభుత్వ శాఖల్లో విద్యుత్ వాహనాలు

కాలుష్యరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల న్నీ విద్యుత్ వాహనాల్ని వినియో గించేందుకు, అనం తరం ప్రైవే టు రంగానికి వీటిని విస్త రించేం దుకు ప్రణాళికల్ని రూపొందిం చాలని ముఖ్య మంత్రి చంద్ర బాబు సూచిం చారు. రాష్ట్రాన్ని నూరు శాతం కాలుష్య రహిత, హరిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఇంధన శాఖ అధికారులతో ఆదివారం ఆయన టెలికాన్ఫెరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వాహనాల వల్ల భవిష్యత్తులో 1.05 లక్షల ఉద్యోగాలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ ఈ వాహనాల తయారీ కోసం రూ.10,250 కోట్లు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేసిందన్నారు. ఇందుకు ఈ ఏడాది రూ.2000 కోట్లు పెట్టుబడి పెడుతుందన్నారు. విద్యుత్ వాహనాల నిర్వహణకు కిలో మీటరుకు 89 పైసలు వ్యయం అయితే, సాంప్రదాయ వాహనాలకు రూ.4.40 వ్యయం అవుతుం దన్నారు. ఈ నెల మూడో వారంలో విద్యుత్ వాహనాల తయారీదారులు, బ్యాటరీ తయారీ దారులు, టెక్నాలజీ ప్రొవైడర్లు, ప్రభుత్వ శాఖల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ముఖ్యమంత్రికి వివరించారు. వచ్చే రెండేళ్లలో లక్ష విద్యుత్ వాహనాల్ని అందుబాటులోకి తెచ్చే విషయంపై ఈ భేటీలో చర్చ జరుగుతుందని చెప్పారు.

ఇకనైనా మాయమాటలు మానండి..!

- బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేసి గెలవాలి
- నేటి నుంచి ఢిల్లీలో భారీ ఎత్తున ఆందోళనలు
- చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక లోటును భర్తీ చేసే క్రమంలో 45 నెలలుగా కేంద్రం మోసపూరిత మాటలతో కాలం వెళ్లదీస్తోందని, ఇకనైనా మాయమాటలు మానాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. విజయవాడ దాసరిభవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, పుట్టా హరినాథరెడ్డితో కలిసి ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గురు మాజీ ఐఎఎస్ అధికారులతో ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సీ) కేవలం 14 రోజుల్లో లెక్కలు తేలిస్తే, మూడున్నరేళ్ళుగా లెక్కలు తేలడంలేదని కేంద్రం చెప్పడం ఏపీ ప్రజలను మోసగించడమే అవుతుందన్నా రు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సహ విభజన చట్టంలోని అన్ని హామీలను నెరవేర్చేందుకు ముందుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. హోదాపై కేంద్రం ఇంకా అబద్ధాలు చెబుతూనే ఉందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకూడదని 14వ ఆర్థిక సంఘం ఎక్కడా చెప్పలేదనే విషయాన్ని జెఎఫ్‌సీ స్పష్టం చేసిందన్నారు. మోడీ అధికారంలోకొచ్చాక ఏర్పాటు చేసిన నీతి అయోగ్ పార్లమెంట్, ప్రధానమంత్రి, కేంద్రమంత్రివర్గం కంటే గొప్పదా అని ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రధాని ప్రకటించడమే కాకుండా కేబినెట్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించి దాన్ని ఆర్థిక సంఘానికి పంపించాక కూడా నీతి అయోగ్‌ను అడ్డుపెట్టడం సరైంది కాదన్నారు. దీనిపై పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఢిల్లీ కేంద్రంగా జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాల్ని నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే కాంగ్రెస్, వైసీపీ నేతలు ఢిల్లీకి చేరుకున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే విషయమై తాడోపేడో తేలే వరకూ ఢిల్లీలోనే మకాం వేస్తామన్నారు. బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేసి గెలవాలని సవాల్ విసిరారు. పాలకులు బుకాయింపు మాటలు మాని, పార్లమెంటు సాక్షిగా చెప్పిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండు చేశారు. బిజెపి తీరు చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో తెలియడం లేదన్నారు. అనంతరం ఆయన చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు.

జెఎఫ్‌సి నివేదిక తప్పుల తడక

బిజెవైఎం రమేష్ నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జెఎఫ్‌సి విడుదల చేసిన నివేదిక తప్పులతడకని బిజెవైఎం జాతీయ కార్యవర్గ సభ్యులు రమేష్ నాయుడు విమర్శించారు. జెఎఫ్‌సిలో అవుట్‌డేటెడ్ నేతలు, అప్రకటిత మేథావులున్నారని ఎద్దేవా చేశారు. గతంలో పవన్ ప్రకటించిన కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై పవన్ తన వైఖరిని తెలపాలన్నారు. దక్షిణాదిలో బిజెపి ఎదుగుదలను కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు.కర్ణాటక, ఒడిషాలో ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్నచోట తమను నష్ట పరచాలని చూస్తున్నారన్నారు. ఇందులో తమ మిత్రపక్షమైన టిడిపి కూడా ఉండటం బాధాకరమన్నారు. అనంతపురంలో కియా మోటార్స్‌ను ఏర్పాటుచేస్తున్న ప్రాంతంలో టిడిపి నేతలు పయ్యావుల కేశవ్, పల్లె రఘునాథ్ రెడ్డి రూ.200 కోట్ల విలువైన భూముల్ని రైతుల వద్దనుంచి బలవంతంగా లాక్కున్నారన్నారు. దీనికి సంబంధించి తమ వద్ద ఆధారాలున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టి, భూముల్ని రైతులకు అప్పగించాలన్నారు.

ఏపీకి హోదా విషయంలో మా ఇద్దరిదీ ఒకటే భావజాలం

- కేసీఆర్ ఆధ్వర్యంలో థర్డ్ ఫ్రంట్ రావాలి
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించే విషయంలో తనది, తెలంగాణ సిఎం కేసీఆర్‌ది ఒకటే భావజాలమని, ఒకటే ఆలోచనా విధానమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ప్రత్యేక హోదా కోసం ముందుకెళ్తుతున్న ప్రతి ఒక్కరికీ కొండంత నైతిక బలాన్నిచ్చాయన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో మీడియాతో పవన్ మాట్లాడారు. "ప్రత్యేక హోదా ఇస్తే ఇవ్వండి...లేకపోతే ఇవ్వలేమని తెగేసి చెప్పండి" అని కేసీఆర్ కేంద్రానికి బలంగా చేసిన సూచనలు తన దృష్టికొచ్చాయన్నారు. గందరగోళం సృష్టించి ప్రజలను అయోమయానికి గురిచేయడం సరైంది కాదనేది ఆయన అభిప్రాయమన్నారు. సాటి తెలుగువారికి కెసిఆర్ మద్దతుగా నిలబడటం సంతోషించదగ్గ విషయమన్నారు. తెలుగువారు ఎక్కడున్నా ఒక్కటే...ఒకరికొకరు అండగా నిలబడతారనే అన్న భావం కేసీఆర్ వ్యాఖ్యల ద్వారా బలంగా బయటకొచ్చిందన్నారు.' ప్రత్యేక హోదా గురించి మాట్లాడితే హైకోర్టు గురించి మాట్లాడతాం. వాళ్లు రైల్వే జోన్ గురించి మాట్లాడితే తాము బయ్యారం ఉక్కు కర్మాగారానికి మద్దతిస్తాం' అని చెప్పారు. పరస్పరం సహకరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రత్యేక పరిస్థితుల వల్ల విడిపోయినప్పటికీ, తమ మధ్య మనస్పర్థలు గానీ, గొడవలుగానీ లేవన్నారు. రాష్ట్రం విడిపోయినా కేసీఆర్ సహాయ సహకారాల్ని ఆంధ్రప్రాంత ప్రజలు మర్చిపోరన్నారు. జాతీయ పార్టీలు ప్రజల మనోభావాల్ని పట్టించుకోనప్పుడే ప్రాంతీయ పార్టీలు పుట్టుకొస్తాయని పవన్ కల్యాణ్ అన్నారు. అంజయ్యకు అవమానం జరగకుండా ఉంటే తెలుగుదేశం పార్టీ పుట్టేదే కాదని అన్నారు. ప్రజల ఆంక్షాలకు అనుగుణంగా రెండు ప్రాంతాల్ని సమానంగా చూసి ఉంటే టీఆర్ఎస్ ఆవిర్భవించేది కాదన్నారు. అన్యాయంగా ప్రజలకు సంబంధం లేకుండా రాష్ట్రాన్ని విడగొట్టి, ప్రజల మధ్య విద్వేషాల్ని రెచ్చగొట్టి దేశ సుస్థిరతకు భంగం కలిగించే చర్యల్ని ముందే అడ్డుకుని ఉంటే జనసేన పార్టీ పుట్టుకొచ్చేది కాదన్నారు. జనసేన పార్టీ కూడా ప్రాంతీయ ప్రజల ఆంకాక్ష కోసమే పెట్టాల్సి వచ్చిందన్నారు. జాతీయ పార్టీల విధానాల వల్లే నేడు ప్రజలు రోడ్లపైకి రావాల్సి వచ్చిందన్నారు. మూడో ఫ్రంట్‌పై అన్ని వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయని, రాజకీయాల్లో మూడో ప్రత్యామ్నాయం ఉండి తీరాల్సిందేనన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మూడో ఫ్రంట్‌కు అంకురార్పణ జరిగితే తాను సంపూర్ణ మద్దతు ఇస్తానన్నారు. 2019 ఎన్నికల తరువాత ప్రాంతీయ పార్టీలు లేకుండా ప్రభుత్వాలు ఏర్పడే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ప్రత్యేక హోదా కోసం టీఆర్ఎస్ మద్దతు తీసుకుని టిడిపి, వైసిపి ముందుకెళ్లాలని పవన్ సూచించారు.

మాణిక్ సర్కార్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు విప్లవ్ కుమార్ దేవ్ తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి మంగళవారం ఇక్కడకు వస్తారని, ఆ సందర్భంగా పార్టీ శాసన సభ్యులతో సమావేశమై శాసన సభా పక్ష నేతను ఎన్నుకుంటారన్నారు. శాసన సభా పక్షనేతను ఎన్నుకున్న రెండు రోజుల తరువాత కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేస్తుందని ఆయన చెప్పారు. రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రిగా విప్లవ్ దేవ్‌కుమార్‌ను ఎన్నుకోనేవీలుంది.

మేఘాలయ సిఎంగా సంగ్మా ?

గువహతి : మేఘాలయలో నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడనున్నది. రోజంతా నడిచిన హై డ్రామా అనంతరం ఎన్‌పిపి నేత కొనార్డ్ సంగ్మా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బిజెపి నేతలు ప్రకటించారు. మేఘాలయలోని ప్రాంతీయ రాజకీయ పార్టీలు, బిజెపిలకు చెందిన 34 మంది శాసన సభ్యుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. బిజెపి నేత హిమంత విశ్వ శర్మ, సంగ్మా ఆదివారం సాయంత్రం షిల్లాంగ్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ గంగ ప్రసాద్‌ను కలుసుకున్నారు. తమకు మద్దతిస్తున్న 34 మంది సభ్యుల సంతకాలతో ఉన్న లేఖను సమర్పించారు. అంతకు ముందు మేఘాలయలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తమను ఆహ్వానించాలని కాంగ్రెస్ రాష్ట్ర గవర్నర్ గంగా ప్రసాద్‌ను కోరింది. శనివారం రాత్రి సీనియర్ కాంగ్రెస్ నేతలు అహ్మద్ పటేల్, కమల్‌నాథ్ గవర్నర్‌ను కలుసుకుని ప్రభుత్వం ఏర్పాటుకు తమ పార్టీని ఆహ్వానించాలని కోరారు.

నాగాలాండ్‌లో నీఫియు రియోకు గవర్నర్ ఆహ్వానం

నాగాలాండ్‌లో ఎన్‌డిపిపి పక్షనేత, నీఫియు రియోకు మెజార్టీ వుందని, ఆయనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నాగాలాండ్ గవర్నర్ పిబి ఆచార్య నిర్ణయించారు. మొత్తం 60 సభ్యులున్న అసెంబ్లీలో తనకు 32 మంది సభ్యుల మద్దతు వుందంటూ నీఫియు రియో ఆదివారం నాడు గవర్నర్ ఆచార్యకు వివరించారు. మద్దతునిస్తున్న 32 మంది ఎమ్మెల్యేల సంతకాలతో తనకు సోమవారం లోగా అఫిడవిట్‌ను అందచేయాలని గవర్నర్ ఆయన్ను ఆదేశించారు. ఎన్‌డిపిపి నేత రియోకు మెజార్టీ వుందని నిర్ధారించుకున్న గవర్నర్ ఆయన్ను ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారని ఎన్‌డిపిపి సీనియర్ నేత ఒకరు మీడియాకు వివరించారు. కాగా జెడి(యు)తరపున ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యే జి కైటో యి, ఇండింపెండెంట్ సభ్యుడు తాన్‌పాంగ్ ఓజుకుమ్ తమకు మద్దతు ప్రకటించారని ఎన్‌డిపిపి ప్రధాన కార్యదర్శి అబూ మెహతా చెప్పారు. రియో ఇప్పటి వరకూ మూడు సార్లు నాగాలాండ్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన విషయం తెలిసిందే.

రాజీనామా చేయను : జిలియాంగ్

నాగాలాండ్ ముఖ్యమంత్రి టిఆర్ జిలియాంగ్ తన పదవికి రాజీనామా చేయబోనని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు (ఎన్‌పిఎఫ్) ఆయన నేతృత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్‌పిఎఫ్ తన మిత్ర పక్షాలతో కలిసి 29 స్థానాలు గెలుచుకుంది. బిజెపి అధ్యక్షుడు అమిత్ షాను న్యూఢిల్లీలో కలుసుకుని నాగాలాండ్‌లో ప్రభుత్వం ఏర్పాటుపై చర్చిస్తానని జిలియాంగ్ చెప్పారు. తామింకా మిత్రులమేనని తెలియచేస్తూ అమిత్ షాకు లేఖ రాసినట్లు ఎన్‌పిఎఫ్ ఛైర్మన్ షుర్హోజోలి లీయిజిట్సు తెలిపారు. అంతకుముందు గవర్నర్ పిబి ఆచార్య విలేకరులతో మాట్లాడుతూ జిలియాంగ్ రాజీనామా చేస్తారని తాను భావిస్తున్నట్లు చెప్పారు.

గొట్టిపాడు ఘటనపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

- న్యాయం జరిగే వరకూ వదిలే ప్రసక్తేలేదు
- అప్పటికి న్యాయం జరగకపోతే చలో అసెంబ్లీ
- 'ఛలో గుంటూరు' లో వక్తలు



'చలో గుంటూరు'కు ర్యాలీగా తరలి వెళ్తున్న వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు ఘటనకు బాధ్యులైన వారిపై పదిరోజుల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ప్రధాన నిందితులను అరెస్టు చేయకపోతే రాష్ట్రమంతటా ఉద్యమం ఉధృతమవుతుందని ఆదివారం రాత్రి గుంటూరులో జరిగిన 'చలో గుంటూరు' సభలో మాట్లాడిన వక్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పెదగొట్టిపాడులో జనవరి ఒకటిన దళితులపై పెత్తందారులు జరిపిన దాడికి నిరసనగా ఆదివారం 'స్థానిక ఉల్ఫ్‌హాల్ మైదానంలో ఏర్పాటైన దళితుల ఆత్మగౌరవ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. సభకు పెదగొట్టిపాడు దళిత బాధిత సంఘీభావ కమిటీ అధ్యక్షులు జి.శాంతకుమార్ అధ్యక్షత వహించారు. వామపక్షాలు సహా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, 57 ప్రజా సంఘాల నాయకులు ఈ సభలో పాల్గొన్నారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ దమన నీతిపై పోరాటానికి ఇది అంతం కాదిది ఆరంభమని పేర్కొన్నారు. గొట్టిపాడు ఘటనలో నిందితులను అరెస్టు చేయకపోతే చలో రాజమండ్రి, ఏలూరు, ఒంగోలు, అసెంబ్లీలకు పిలుపునిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, టిడిపి నాయకులను దయ్యాలై పట్టుకుంటామని, న్యాయం జరిగేదాకా వదిలే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. జన్మభూమి కమిటీలు నీరు చెట్టు పేరుతో దళితుల భూములను స్వాహా చేసి వందల ఎకరాలను తవ్వేసి మట్టిని దోచేశాయని మండిపడ్డారు. గరగపర్రు, దేవరాపల్లి, పెదగొట్టిపాడు ఇలా అనేక గ్రామాల్లో దళితులపై దాడులు చేస్తున్నారన్నారు. గుంటూరు జిల్లాలో ఉన్న జన్మభూమి కమిటీలు రాక్షస కమిటీలుగా ప్రవర్తిస్తున్నాయన్నారు. పలు గ్రామాల్లో దళితులు, బలహీన వర్గాల భూములను అక్రమంగా చెరువుల పేరుతో మట్టి తవ్వుకుని కోట్లు గడిస్తున్నారని పేర్కొన్నారు. గత 20ఏళ్లుగా దళితులపై దాడులు జరుగుతున్నాయని, ముఖ్యంగా గత నాలుగేళ్లుగా ఈ దాడులు మరింత పెరిగాయన్నారు. దళిత సోషన్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయన్నారు. గుజరాత్‌లో మీసాలు పెంచారని దాడి చేశారని, తెలంగాణలో అగ్రకుల యువతిని ప్రేమించిన నేరానికి హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదగొట్టిపాడు ఘటనపై పోలీసులు ఇప్పటికైనా సరిగ్గా స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. చట్ట ప్రకారం బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేయాల్సిన అవసరం ఉందని ఇతర అంశాలు కోర్టు చూసుకుంటుందని వివరించారు. దళితులు నిర్వహించుకుంటున్న ఈ సభకు విధించిన ఆంక్షలను అన్ని పార్టీలు, ఇతర సభలకు కూడా వర్తింపచేయగలరా అని ప్రశ్నించారు. విరసం నేత కల్యాణరావు మాట్లాడుతూ దళితులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో ఓర్వలేక పెత్తందారులు దాడులకు తెగబడుతున్నారని చెప్పారు. పలు ఘటనల్లో దళితులనే నిందితులుగా చేరుస్తున్నారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జెల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. పెదగొట్టిపాడులో అసలు నిందితులను వదిలి దళితులను అరెస్టు చేయడం దారుణమన్నారు. డిబిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు మాట్లాడుతూ దళితులపై దాడి జరిగితే ప్రజా ప్రతినిధులు, మంత్రులు, అధికారులు ఒక్కరూ కూడా బాధితులను పరామర్శించకపోవడం దురదృష్టకరమన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రభాకర్ మాట్లాడుతూ దాడి చేసిన వారిని, బాధితులను కలిపి రాజీపేరుతో డ్రామా చేశారని, ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు అగ్రకులాలకు కొమ్ముకాస్తున్నారని చెప్పారు. తమిళనాడు విసికె పార్టీ కార్యదర్శి బాలసింగం మాట్లాడుతూ దళితులు రాజ్యాధికారం కోసం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్, బిజెపి, ఇతర బూర్జువా పార్టీల వారి పంచన చేరుకుండా మన ఓట్లు మనమే వేసుకునే స్థాయి ఎదగాలన్నారు. అసెంబ్లీ ముట్టడి కాదు అసెంబ్లీలోకి ప్రవేశించాలన్నారు. సభలో పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన దళిత బాధితుల పోరాట కమిటి నాయకురాలు జయభాగ్యమ్మ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు ఉసురు పాటి బ్రహ్మయ్య, పిసిసి కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, సిపిఐ ఎంఎల్ నాయకురాలు సింహాద్రి ఝాన్సి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకురాలు ఎంపి రాందేవ్, ఎపిసిఎల్‌సి రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వర రావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి డి.కృష్ణమోహన్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొమరగుంటలో అట్టహాసంగా జల్లికట్టు

యువకులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం

మండలంలోని కొమరగుంట గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు జల్లికట్టును నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ వీధిలో అల్లును ఏర్పాటు చేసి ఎడ్ల పందేలు ప్రారంభించారు. ఎడ్లను నిలువరించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి కూడా జనం తరలివచ్చారు. ఎద్దులపై ఉన్న పట్టీలను చేజిక్కించుకునేందుకు యువత పోటీ పడ్డారు. పట్టీలు చేజిక్కించుకునే సమయంలో ఎద్దుల కింద పడి కొంత మందికి స్వల్పగాయాలయ్యాయి.



గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహిస్తున్న నందినాటకోత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన 'మాతృరూపేణా' నాటికలో సన్నివేశం


ఆకట్టుకుంటున్న నంది నాటక ప్రదర్శనలు

34వ రోజుకు చేరిన ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న నందినాటకోత్సవాలు 34వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం తొలి ప్రదర్శనగా 'గుప్పెడంత గుండెలో' నాటకం ద్వారా అవయవదాన ప్రాధాన్యాన్ని ప్రదర్శించారు. వంద మంది శత్రువులను చంపితే వీరుడంటారు.. ఒక్కరి ప్రాణం కాపాడితే దేవుడంటారు. అవయవదానం అందుకు చక్కని అవకాశం అదే సందేశాన్నిచ్చింది. 'మాతృరూపేణ' నాటకం ద్వారా రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న తన కుటుంబాన్ని పోషించడానికి ఎన్నో బాధలు, అవమానాలు భరించి మహిళ పడే కష్టాలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. 'ఇంటింటి భాగోతం' ద్వారా మహిళత్వాన్ని హృద్యంగా ప్రదర్శించారు. భార్యగా, తల్లిగా, కూతురిగానేగాని ఒక మనిషిగా స్త్రీకి వ్యక్తిత్వం ఉంటుందని ఎవరూ గుర్తించడం లేదని, అనాదిగా బానిసగానే పరిగణింపబడుతోందని స్త్రీ ఇతి బాధలను ప్రదర్శించారు. 'అక్క అలుగుడు-చెల్లి సణుగుడు' నాటిక ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. కొత్తగా పెళ్లయిన అత్తింట్లో చోటుచేసుకునే ఘటనలను ప్రదర్శించారు. 'శిరోమణి' నాటిక ద్వారా కళాకారుల జీవితాన్నే ప్రదర్శించారు. తండ్రి ప్రోత్సాహంతో నాటక రంగ ప్రవేశం చేసిన యువతి మంచి పేరు సంపాదించి అనంతరం కళాకారుణ్ణే పెళ్లి చేసుకోవడం, అతని మరణానంతరం తోటి కళాకారుల ప్రోత్సాహంతోనే కుమారుడ్ని ఉన్నతస్థాయికి చేర్చడం, తన మనువరాలికి పద్యాలు నేర్పడంపై కోడలు గొడవ పెట్టుకోవడం, ఈ క్రమంలో నాటక కళను బతికించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేయడంతో ప్రదర్శన ముగుస్తుంది. 'వద్దే భామ ఇక వద్దు' నాటిక ద్వారా బ్యాంక్ మేనేజర్ భార్యకున్న చీరల పిచ్చి, ఆమెను అడ్డు పెట్టుకుని స్వామీ చేసిన మోసాలను ప్రదర్శించారు.

ఆరేళ్లయినా అందని పరిహారం



పరిశ్రమల కోసం సేకరించిన భూములు

- మడకశిర సెజ్ నిర్వాసితుల గోడు
- పట్టని అధికారులు, పాలకులు
- ఉపాధిలేక వలసలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం దౌర్జన్యంగా భూములను రైతుల పేరు మీద నుంచి తన పేరు మీదకు మార్చేసుకుంది. పరిహారం మాత్రం ఇవ్వలేదు. ఆరేళ్లుగా రైతులు పరిహారం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికీ స్పందించకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు కోల్పోయి ఉపాధి లేక వలసలు పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని బాధితులు కోరుతున్నారు.

అనంతపురం జిల్లా మడకశిర మండలం గౌడనహళ్లి, రాళ్ల అనంతపురం గ్రామాల పరిధిలోని 1648.82 ఎకరాల భూమిని ఇండస్ట్రీయల్ పార్కు పేరున తీసుకుంది. ఇందులో 1548 ఎకరాల అసైన్డు భూమి కాగా, 70 ఎకరాలు పట్టాభూమి, మరో 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ మేరకు ఈ భూములను పరిశ్రమల కోసం తీసుకుంటున్నట్టు 2012 నవంబరు 7న రైతులకు నోటీసులు జారీ చేశారు. రాళ్ల అనంతపురం పరిధిలోని 639 ఎకరాలకు పరిహారం చెల్లించారు. మిగతా భూములకు ఇప్పటికీ పరిహారమివ్వలేదు. ఆర్డీవో కార్యాలయాల ఎదుట పలు దఫాలుగా ఆందోళనలు నిర్వహించినా. ఫలితం లేదు. రైతుల పేరు మీద భూములు లేవన్న పేరుతో రాయితీపై ఇచ్చే విత్తనాలుగానీ, పంటనష్టపోతే వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీగానీ ఏమీ ప్రభుత్వం నుంచి ఉండటం లేదు. దీంతో వ్యవసాయం చేయడమే రైతులు మానేశారు. సాగుతో ఎప్పుడూ కలకలలాడే భూములు బీడువారి పిచ్చిమొక్కలు పెరిగాయి. మరోవైపు గతంలో బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలకు వడ్డీలు పెరిగి మూడింతలు అయ్యాయి. ఆ అప్పులు చెల్లించాలని బ్యాంకులు నోటీసులు జారీ చేశాయి. ప్రభుత్వం భూములు తీసేసుకోవడంతో పనులు తగ్గాయి. ఉపాధిని వెతుక్కుంటూ బెంగళూరుకు వలసలు వెళ్లారు. గౌడన్‌హళ్లి పరిధిలోనే 282 మంది రైతులు భూములు కోల్పోగా.. 150 కుటుంబాల వరకు వలసలు వెళ్లాయి. పరిహారం లేక కొంతమంది మరోవైపు పనిలేక కుటుంబాలు బిక్కుబిక్కు మంటున్నాయి.

కొడుకులు వలస వెళ్లారు



నాకున్న మూడెకరాలు పరిశ్రమల కోసం తీసుకున్నారు. కానీ పరిహారమివ్వలేదు. పనిలేకపోవడంతో ఇద్దరు కొడుకులూ, కోడళ్లు బెంగళూరుకు ఉపాధి కోసం వలస పోయారు. వారి పిల్లలను నేను, నా భార్య చూసుకుంటున్నాం. ఆరేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

- నరసప్ప రైతు గౌడనహళ్లి

బ్యాంకు నోటీసులు వస్తున్నాయి

మా అన్నదమ్ములందరికీ కలిపి 15.50 ఎకరాల భూముంది. మొత్తం పరిశ్రమ కింద 2012లోనే తీసుకున్నారు. ఇప్పటికీ పరిహారమివ్వలేదు. కనీసం వ్యవసాయం చేసుకునేందుకు ఇచ్చే సబ్సిడీ విత్తనాలూ ఇవ్వడం లేదు. పరిహారమివ్వకపోతే పోయారు.. కనీసం మా భూములు మాకు తిరిగివ్వమన్నా ఇవ్వడం లేదు. ఒకవైపు గతంలో బ్యాంకుల్లో మేము చేసిన అప్పులు చెల్లించాలని నోటీసులొస్తున్నాయి. భూముల్లేక పంటలు పండించలేకపోతే అప్పు ఏ విధంగా కట్టేది. అధికారులు ఇప్పటికైనా స్పందించి పరిహారం చెల్లించాలి. లేదా భూములు తిరిగి వెనక్కైనా ఇవ్వాలి.

- నాగరాజు గౌడనహళి

పేదల వైద్యానికి నిధుల కోత

ప్రజారోగ్య వేదిక జాతీయ సెమినార్‌లో ఎఫ్ఎంఆర్ఎఐ జాతీయ నేత డాక్టర్ అమిత్వ గుహ

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో ప్రకటించిన ఆరోగ్య పథకం బీమా కంపెనీలను ప్రోత్సహించేలా ఉందని అఖిల భారత మెడికల్ అండ్ రిప్రజెంటేటివ్ అసోసియేషన్ సమాఖ్య (ఎఫ్ఎంఆర్ఎఐ) జాతీయ నేత డాక్టర్ అమిత్వ గుహ విమర్శించారు. ఈ స్కీమ్ ద్వారా దేశంలోని 10 కోట్ల కుటుంబాల్లోని 50 కోట్ల మంది రూ. 30 వేల నుంచి గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులను పొందవచ్చన్న ప్రకటన ఆచరణ సాధ్యం కాదని గతానుభవాలు చెబుతున్నాయన్నారు. 2014 నాటి జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం ఈ తరహా పథకాల వల్ల 1.2 శాతం గ్రామీణ ప్రజలు, 6.2 శాతం పట్టణ ప్రజలు పాక్షికంగా మాత్రమే వైద్య ఖర్చులను పొందగలిగినట్లు తేలిందన్నారు. ఆదివారం విశాఖలోని ఎయు టిఎల్ఎన్ సభా హాలులో జరిగిన 'అందరికీ ఆరోగ్యం- ప్రభుత్వ పాత్ర' అనే అంశంపై జాతీయ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ అనుభవాల ప్రకారం ప్రభుత్వ వైద్యరంగం ద్వారా ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించగలమని రుజువైన సంగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 2007 నుంచి 2013 వరకు ఖర్చు చేసిన రూ.47.23 బిలియన్లలో రూ.36.52 బిలియన్లు ప్రయివేటు రంగానికే పోయాయన్నారు. ప్రయివేటు రంగంలో వైద్య ఖర్చులను పెంచడం వల్ల వారు తిరిగి ఆ పెట్టుబడితో పాటు లాభాలను దండుకోవాలని చూస్తారని రుజువైందన్నారు. అయినా ప్రభుత్వాలు ఆరోగ్య రంగంపై చేసే ఖర్చును 3 నుంచి 0.9 శాతానికి తగ్గించుకున్నాయన్నారు. ఈ ఏడాది భారత ప్రభుత్వం పట్టణ, గ్రామీణ హెల్త్ మిషన్‌కు నిధులు కుదించినట్లు తెలిపారు. 2017-18లో 30,801 కోట్లు కేటాయించగా, 2018-19 లో హెల్త్ స్కీమ్‌కు రూ. 30,129 కోట్లుకు తగ్గించారన్నారు. దీంతో ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషించే జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌కు 5 శాతం మేర నిధులకు కోత పడిందన్నారు. గతేడాది రూ.25,458 కోట్లు కాగా ఈ ఏడాది 24,279 కోట్లకు పరిమితం చేశారన్నారు. మహిళల ఆరోగ్యం-ప్రభుత్వాల పాత్ర అనే అంశంపై ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పి.ప్రతిభ, 'మందులు సరఫరా-ప్రభుత్వాల పాత్ర' అనే అంశంపై జరిగిన చర్చలో డాక్టర్ అమిత్వ గుహ ప్రసంగించారు. అందరికీ ఆరోగ్యం- ప్రభుత్వాల పాత్రపై సదస్సును ఎయు ఉపకులపతి జి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎస్ సురేష్ అధ్యక్షత వహించగా, ఎయు రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా వేదికపై ఆంధ్రా మెడికల్ కాలేజి కార్డియాలజీ పూర్వ ఆచార్యులు డాక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డిని ఘనంగా సన్మానించారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎఫ్ఎంఆర్ఎఐ జాతీయ నేత డాక్టర్ అమిత్వ గుహ

సైకో బాధితులకు నన్నపనేని పరామర్శ

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

కోవూరులో సైకో దాడిలో గాయాలపాలై స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం ఎపి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పరామర్శించారు. నెల్లూరు జిల్లా కోవూరులో సైకో మహిళలపై దాడి చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న నన్నపనేని రాజకుమారి బాధిత మహిళలను పరామర్శించేందుకు నెల్లూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహిళలపై ఇలాంటి దాడులు జరగడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను కఠినతరం చేసినా మహిళలపై ఉన్మాదుల దాడులు తగ్గడం లేదని ఆవేదన చెందారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలోనూ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్‌పిని కోరారు. సైకోను త్వరగా పట్టుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కోవూరులో ఒకే రాత్రి ఐదుగురు మహిళలపై వేర్వేరు ప్రాంతాలలో దాడులు జరగడం దారుణమన్నారు. ఎస్‌పి రామకృష్ణ మాట్లాడుతూ సైకోను పట్టుకోవడానికి నిఘా పెట్టామన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే సంబంధిత అధికారులకు తెలపాలని కోరారు. ప్రజలు భయభ్రాంతులకు గురి కావొద్దనీ, సైకోను వెంటనే పట్టుకుంటామన్నారు.

సమాజ రుణం తీర్చుకోవాలి

మహారాష్ట్ర అడిషనల్ డిజిపి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, అదే సమయంలో సమాజ రుణమూ తీర్చుకోవాల్సిన బాధ్యతా ఉందని మహారాష్ట్ర అడిషనల్ డిజిపి వివి లక్ష్మీనారాయణ అన్నారు. కృష్ణదేవరాయ పేద, బలహీనవర్గాల సహాయనిధి ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అబ్దుల్ కలాం, బిఆర్ అంబేద్కర్, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి మహోన్నతులు పేదరికంలో పుట్టినా తమ వ్యక్తిత్వం ద్వారా ఉన్నత పదవులను అలంకరించి, ఆ పదవులకే వన్నె తెచ్చారని గుర్తు చేశారు. వారి ఆదర్శంతో ప్రతి విద్యార్థీ వినయం, శీలం అలవర్చుకోవాలని, వీటికి విద్య తోడైతే మరింతగా శోభిస్తారన్నాని చెప్పారు. సామాజిక వేత్తలు, దేశభక్తుల చరిత్రలను చదవాలని అప్పుడే సామాజిక స్పృహ అలవడి జీవితానికి ఒక దశ, దిశ ఏర్పడతాయని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కృష్ణదేవరాయ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, తులసి గ్రూప్ అధినేత తులసీ రామచంద్రప్రభు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా 38 నగరాల్లో పేద విద్యార్థులకు 23 ఏళ్లుగా స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 215 మందికి ఉపకారవేతనాలను వివి లక్ష్మీనారాయణ ద్వారా అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మృతి

8 మందికి తీవ్రగాయాలు- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ఎటపాక (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా ఎటపాక మండలం బండిరేవు గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. చింతూరు మండలం కొత్తూరుకు చెందిన గిరిజనులు మిరపకోతలకు ఎటపాక మండలం తోటపల్లి వస్తుంటారు. రోజుమాదిరిగానే ఆదివారం ఉదయం ఏడుగురాళ్లపల్లికి చెందిన టాటా మ్యాజిక్ వాహనంలో 35 మంది వ్యవసాయ గిరిజన కూలీలు తోటపల్లి మిర్చికోతలకు వెళ్తున్నారు.



ప్రమీల మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి నాంచారి

ఈ నేపథ్యంలో భద్రాచలం నుంచి చింతూరు వైపు పొక్లెయినర్‌ను తీసుకొస్తున్న లారీ బండిరేవు సమీపంలో అదుపు తప్పింది. లారీలోని పొక్లెయినర్ కూలీలతో వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనంపై పడింది. దీంతో ఊకే ప్రమీల (17), ముర్రం నాగమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందారు. రత్తమ్మ, నాగరాజు, తిరుపతమ్మ, కన్నమ్మ, లచ్చమ్మ, అనిత, రవ్వా ముత్తమ్మ, వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కన్నమ్మ పరిస్థితి విషమంగా ఉంది. ఈనేపథ్యంలో అటుగా వెళ్తున్న సిపిఎం మండల కార్యదర్శి మర్లపాటి నాగేశ్వరరావు అంబులెన్సుకు, డిప్యూటీ డిఎండ్‌హెచ్ఒ డాక్టర్ పుల్లయ్యకు సమాచారం అందించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలు ప్రమీల తల్లి నాంచారి కూడా ప్రమాదం జరిగిన ఆటోలోనే ఉంది.కళ్లముందే కుమార్తె మృతి చెందడంతో భోరున విలపిస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఎన్‌టిఆర్ నగర్ గృహాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ

సాంకేతిక పరిజ్ఞానంతో 'ఎన్‌టిఆర్ నగర్'

ప్రజాశక్తి-నర్సీపట్నం (విశాఖపట్నం)

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నర్సీపట్నంలో ఎన్‌టిఆర్ నగర్ నిర్మాణం చేపడతామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. విశాఖ జిల్లా నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి బయ్యపురెడ్డిపాలెంలో ఎన్‌టిఆర్ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి అయ్యన్నపాత్రుడుతో కలిసి నారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నూతన టెక్నాలజీతో రూ.5లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. హైక్వాలిటీతో నిర్మిస్తున్న గృహాలకు సోషల్ ఇన్‌ప్రాక్టర్చర్, అదనపు ఇన్‌ప్రాక్టర్చర్‌లతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 24న 35 మున్సిపాలిటీల్లో 15వేల గృహాల ప్రవేశం ముఖ్యమంత్రి సమక్షంలో జరుగుతుందని తెలిపారు. 2019 మార్చి నాటికి 5లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మూడు దశల్లో ఎన్‌టిఆర్ జిప్లస్3 గృహ నిర్మాణాలను చేపడుతున్నట్లు చెప్పారు.

తిరునాళ్లలో అపశృతి

పెనుగంచిప్రోలులో అగ్నిప్రమాదం

రూ.కోటి నష్టం - తప్పిన ప్రాణముప్పు

ప్రజాశక్తి- పెనుగంచిప్రోలు

కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు అగ్నిప్రమాదం సంభవించింది. తిరుపతమ్మ తిరునాళ్లలో భాగంగా మునేరులో పెద్దసంఖ్యలో వ్యాపారులు పూరిపాకలు ఏర్పాటు చేసుకున్నారు. పొంగళ్లు ఏర్పాటు చేసుకునే క్రమంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. క్షణాల్లో ఇతర పాకలకు అంటుకోవడంతో సుమారు 50 పాకలు నిమిషాల వ్యవధిలో తగలబడ్డాయి. సుమారు రూ.కోటి వరకు నష్టం జరిగినట్లు అంచనా. ప్రాణనష్టం జరగకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మంటలు వ్యాపిస్తుండడాన్ని గమనించిన స్థానిక యాత్రికులు ప్రాణభయంతో పరుగులు పెట్టారు. దీంతో కొద్దిసేపు గందరగోళ వాతావరణం నెలకొంది.

ప్రత్యేకం

ప్రజారోగ్యంపై ఐక్య ఉద్యమం

'ప్రజాశక్తి' చర్చావేదికలో వక్తలు

ప్రజాశక్తి-ఎ.కొండూరు

కృష్ణాజిల్లా ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో కృషిచేయాలని పలువురు పిలుపునిచ్చారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా ఎ.కొండూరు మండల కేంద్రంలోని మామిడి మార్కెట్ ప్రాంగణంలో 'ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధులు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై కృష్ణాప్రతినిధి ఎం.వి.ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం జరిగిన చర్చావేదికలో వారు మాట్లాడారు. ఐక్య ఉద్యమం నిర్వహించటం ద్వారా కిడ్నీ వ్యాధుల సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. సిపిఎం పశ్చిమకృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలో 19, గంపలగూడెం మండలంలోని రెండు గ్రామాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వ్యాధుల నియంత్రణకు అవసరమైన వైద్యసదుపాయాలు ఎ.కొండూరులోనే ఏర్పాటుచేయాలని కోరారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ జి.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ కృష్ణానది రక్షిత జలాలను తక్షణమే తండాల్లో సరఫరా చేయాలని కోరారు. ప్రొఫెసర్ జ్యోతిలాల్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల్లో ఉన్నత విద్యనభ్యసించే వారిలో ఒక్క శాతం మాత్రమే ఉన్నారన్నారు. ఎ.కొండూరు ఎంపిపి వాసం మునియ్య మాట్లాడుతూ తిరువూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నారు. ప్రజాశక్తి కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ వై.శ్రీనివాసరావు సమన్వయ కర్తగా వ్యవహరించారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, గిరిజన ఉద్యోగ సంఘం, ప్రజాసంఘాల నాయకులు, కిడ్నీ బాధితులు పాల్గొన్నారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న డి.వి.కృష్ణ

సంక్షిప్తం

గిన్నిస్ బుక్ అర్హతకు నంది నాటకోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదుకు అర్హత సాధించినట్లు కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు దిలీప్‌రాజా తెలిపారు. దేశంలో ఎక్కడా 82 రోజుల పాటు 360 నాటక ప్రదర్శనలు నిర్వహించలేదని, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేయగా ప్రపంచంలోనే ఈ తరహా నాటక పోటీలు నిర్వహించిన దాఖలాలు లేవని తెలిసినట్లు చెప్పారు. నంది నాటకోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నుంచి గిన్నీస్ బుక్ వారికి పంపాల్సి ఉందన్నారు.

తిరుపతిలో సెటాప్ బాక్సుల తయారీ కేంద్రం

ప్రజాశక్తి-కార్వేటినగరం

ఎపి ఫైబర్ గ్రిడ్ ద్వారా డిజిటల్ సేవలను అతి తక్కువ ధరలకే ప్రభుత్వం మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులోకి తేనుంది. తిరుపతిలోని ప్రహరీ డిజిటల్స్ సంస్థ ఆధ్వర్యంలో సెటాప్ బాక్సుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. జపాన్‌కు చెందిన దాసన్ కంపెనీ వీటిని తయారు చేసి ప్రహరీ డిజిటల్స్‌కు అందిస్తున్నారు. ఇందులో ట్రిబుల్ సర్వీసెస్ ఒకే బాక్సులో టెలిఫోన్, టీవీఛానల్స్, డేటా ఇంటర్నెట్ వైఫై సేవలను అందించనున్నారు. అనేక విలువల ఆధారిత సేవలను, 450 సినిమాలు, వీడియో కాన్ఫెరెన్స్, ఈ-కామర్స్, ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకూ సిలబస్, వ్యవసాయ నిపుణుల సూచనలు, సలహాలు, ప్రోగ్రామ్స్ రికార్డింగ్స్, ఆన్‌లైన్ బిల్ పేమెంట్లు, విద్యకు సంబంధించిన సమాచారం, ఆరోగ్యానికి సంబంధించిన సేవలు, తదితర సమచారాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సెటాప్ బాక్సుల సేవలు రూ.149, రూ.399, రూ.599లకు హైస్పీడ్ డేటాతో అందరికీ చేరువ కానున్నాయి. ఈ సెటాఫ్ బాక్సు రూ.4 వేలు ధర పలుకగా, ఇఎంఐ ద్వారా నెలనెలా రూ.50లకు మధ్యతరగతి ప్రజలకు చేరువ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోంది.



స్త్రీకి శరీరం ఉంది. దానికి వ్యాయామం కావాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం కావాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి.

– చలం



గెలవాలంటే యుద్ధం చేయాలి

చంద్రుణ్ణి
నీ ప్రతిబింబంగా పోల్చి
అందానికే నిన్ను పరిమితం చేసి
నీ ఊహలకు గులాబీ రంగు పూసింది
ఈ సమాజమే కదా

నీ కళ్ళ వెనకున్న అశ్రు సముద్రాన్ని
ఎవరూ ఊహించలేరు కదా

అర్థ, మోక్ష, కామ నాతి చరామీలను అంటగట్టి
స్వేచ్ఛను నీ దరి చేరినివ్వలేదు కదా
నీ గులాబీ ప్రపంచంలోకి కూడా
పురుషాహంకారపు గాలి సోకి
కలుషితం చేసింది
ఇప్పుడు అక్కడ కూడా నువ్వు శూన్యమే కదా... ?

స్వేచ్ఛ లేనందుకే కదా నీకంటూ ప్రత్యేకంగా
ఒక రోజు జరుపుకుంటుందీ
నీకిప్పుడు కావాల్సింది నీ కాళ్లపై నువ్వు నిలబడే స్వేచ్ఛ
అంతరాల దొంతరపై,
ఆధిపత్యాల సవాళ్లపై గొంతెత్తే స్వేచ్ఛ!

ఇప్పుడు నీ శరీరం నీది కాదు కదా
ఏడడుగులు వేయించుకున్న నీ యజమానిదే కదా
నువ్వు కేవలం అందానివే కదా
దానికి ఏ ప్రతీక ఉన్నా నీకే ఆపాదిస్తారు కదా
నీ ఎంప్టీనెస్‌తో ఈ లోకం
రంగుల హరివిల్లవుతుందని ఎలా అనుకున్నావూ....

ఆర్థిక దన్ను ఆధారంపై నిలబడ్డప్పుడే
ఏ దిగంతాలకైనా ఎదగగలవు ఎగరగలవు!
చిగురిస్తున్న మొక్కవైపు చూడు
ఉదయిస్తున్న దినకరున్ని వెంటాడు
ప్రకృతిలో పాఠమొకటి నీకోసం ఎప్పుడూ సిద్ధమే!
గెలవాలంటే యుద్ధం చేయాలి
సమస్త అస్తవ్యస్తాలపైనా సమరశంఖం పూరించాలి!

– బ్రౌన్
8985759460

కవుల బాధ్యత ఇప్పుడు మరింత ఎక్కువ

కవిత్వం

చుట్టుపక్కల ఏదో ఒక అలజడి చోటుచేసుకుంటుంది. ఏదో అంతరం కళ్లకు కనబడుతూ ఉంటుంది. ఎలా జరగాలో అలా జరగదు. ఎలా జరక్కూడదో అలా జరుగుతూ ఉంటుంది. అదే అక్రమం.. అదే అన్యాయం.. సమాజంలో ఇలాంటి వాటిని రోజూ చాలామంది చూస్తారు. వెళతారు. చూసీచూసి అలవాటైపోతుంది. సమాజం అన్నాక ఇలాగే ఉంటుందిలే అన్న నిర్లిప్తత, నీరసం, ఉదాసీనత సూత్రం పుట్టుకొస్తాయి. కానీ, ఒక్కడు మాత్రం అందరిలాగా చూసీ చూడనట్టు పోలేడు. వినీవిననట్టు ఉండలేడు. అతడే కవి. కవి తన చుట్టూ జరిగే అన్యాయం పట్ల ఆవేదన చెందుతాడు. ఆందోళన పడతాడు. ఆగ్రహం వ్యక్తం చేస్తాడు. దుఃఖిస్తాడు. దునుమాడతాడు. మనసు నిండా అల్లకల్లోలం నింపుకొని.. ఘర్షించి, ఘర్షించి – సంఘర్షించి సంఘర్షించి.. లోకమంతా సుఖంగా పడుకున్న ఏ అర్ధరాత్రి వేళో.. అతడు ఓ తెల్ల కాగితం మీద అక్షరాలను వర్షిస్తాడు.

ఇంటా బయటా, సమాజం లోపలా వెలుపలా– ఎక్కడేం జరిగినా మనసులోకి తీసుకుంటాడు కవి. కవి ప్రాథమికంగా మానవత్వం ఉన్న వాడు. స్పందన ఉన్నవాడు. పక్కవాడి గురించి ఆలోచించే మనిషి. స్పందించే స్వభావాన్ని సహజంగానే కలిగి ఉన్నవాడు. లోకపు దుఃఖాన్ని తన దుఃఖంగా చేసుకొని మనసారా దుఃఖిస్తాడు.

దుఃఖించడమంటే మామూలు దుఃఖం కాదు. మస్తిష్కాలను కదిలించే దుఃఖం. నిస్సారమైన మనుషుల్లో, నిస్తేజమైన మనసుల్లోంచి ఆవేదన కలిగించి, ఆగ్రహజ్వాలలు రగిలించే దుఃఖం. అలాంటి భావోద్వేగపూరితమైన ఒక సామాజిక సామూహిక కర్తవ్యాన్ని ఎవరూ చెప్పకుండానే, ఎవరూ ఆదేశించకుండానే, ఇంకెవ్వరూ ఆశించకుండానే తనకు తానుగానే తలకెత్తుకుంటాడు.

అలాంటి సామాజిక చింతనపరుడికి కూడా కొంతవరకే దృష్టిని ప్రసరించే పరిధి ఉంటుంది. కొంతమేరకే సానుభూతిని, సహానుభూతిని ప్రదర్శించే శక్తి ఉంటుంది. ఆ చూపును బట్టి కవితా వస్తువు లభ్యమవుతుంది. సమస్య లోతుపాతులపై ఉన్న పట్టును బట్టి కవిత్వం స్ఫురిస్తుంది. ఇలాంటి విశాల జనబాహుళ్యం బాధలను, గాథలను పైపైన చూసి స్పందించటంగా కాక లోలోతులకు వెళ్లి పరిశీలించటం, కారణాకారణాలను అన్వేషించటం చాలా



అవసరం.

వాస్తవానికి నేడు కవులది చాలా క్లిష్టమైన పరిస్థితి. సామాజిక స్పృహ అనే పరిమితమైన చూపు, స్పందన ఉంటే– 40, 50 ఏళ్ల కిందట వరకూ సరిపోతుంది. ఎవరి గురించి రాస్తే ప్రజా కవిత్వమో, ఎటువైపు నిలబడితే ప్రయోజన కవిత్వమో దృశ్యం చాలా స్పష్టంగా కనపడేది. ఒక దుర్మార్గపు భూస్వామి వేధింపులకు గురిచేయటం, వెట్టి చాకిరీ చేయించుకొని శ్రమ దోపిడీ చేయటం చాలా స్పష్టంగానే కనిపిస్తుంది. అప్పటి సంప్రదాయక పారిశ్రామికవేత్త దారుణంగా అధిక పనిగంటలు చేయిస్తూ కార్మికుల శ్రమ దోపిడీ చేయటం కూడా అద్దంలో చూసినంత స్పష్టంగా అర్థమైపోతూ ఉండేది. బాధితుడి స్వరం బాధపడుతున్నట్టుగానే మోగేది. బాధించేవాడి స్వభావమూ, స్వరూపమూ బాహాటంగానే కనబడేది.

కానీ, ఇప్పటి పరిస్థితి వేరు. పాత్రలకు, పరిణామాల అన్నింటికీ అందమైన ముసుగులు ఉంటాయి. ప్రతి విధ్వంసమూ అభివృద్ధి పేరుతోనే జరుగుతుంది. ఈ నమూనాలతో ఎవరైతే బాధితుడు అవుతాడో వారికే ఇవి గొప్ప నజరానాలుగా గొప్పలు డప్పులై మోగుతాయి. పత్రికలు, న్యూస్ ఛానెళ్లూ అభివృద్ధికి బాకాలూదుతాయి. అందరూ పెద్దపెద్ద గొంతులతో అభివృద్ధి గురించే చెబుతారు. ఎవరు బాధితులు అవుతారో వారికి అంతా అయోమయంగా ఉంటుంది. అందరూ అంత బాగా చెబుతున్నప్పుడు తమకెందుకు వేరేలా, వాళ్లు చెప్పేదానికి భిన్నంగా అనిపిస్తుందో ఒక పట్టాన అర్థం కాదు. నించున్న నేల కదిలిపోతున్నట్టు, ఆధారం తెగిపోతున్నట్టూ అనిపిస్తుంది. ఈ లోలోపలి దృశ్యాన్ని పైపైన చూస్తే పట్టుకోలేం. కాగితం మీద లెక్కలూ, వేదిక మీది ప్రసంగాలతో ప్రభావితమైతే అసలు సంగతిని అర్థం చూసుకోలేం. అందుకే కవి నేరుగా క్షేత్రానికి వెళ్లాలి. పత్రికలకు ఎక్కని గొంతులు వినాలి. కెమెరాలు పట్టించుకోని కళ్లను, కన్నీళ్లను దర్శించాలి. కళ్ల నిండా పరచుకొని ఉన్న వాస్తవ దృశ్యాలను చూడాలి. అక్కడి జనం ఘోష ఏమిటో, ఆశ ఏమిటో అర్థం చేసుకోవాలి. గుండెల్లో ధ్వనిస్తున్న భయాన్ని, ఆందోళననీ, ధర్మాగ్రహాన్ని, అసహాయతనీ, భద్రంగా పట్టుకొని – నిజానిజాలు ఏమిటో పోల్చి చూడాలి. కవి కూడా యుద్ధం చేస్తాడు. అతడి ఆయుధం అక్షరం. దానికి అవసరమైన బలమూ, బలగమూ సజీవక్షేత్రం నుంచే అందాలి. అప్పుడు అక్షరం వాస్తవ స్వరంలోంచి ప్రభంజనాస్త్రంలా మోగుతుంది.

తూర్పు గోదావరి సముద్రతీరంలో దివీస్ పట్ల అక్కడి సామాన్య రైతుల వ్యతిరేకత ఎందుకు? ఏమి కోల్పోతారని బాధ? బతుకు పట్ల ఎందుకంత భయం? ఎందుకని లాఠీలను తూటాలను, నిర్బంధాలను జైళ్లనూ లెక్క చేయకుండా జనం ఉద్యమిస్తున్నారు? తెలుసుకోవాలి. అభివృద్ధి, బోలెడు ఉపాధి అని ప్రచారం చేస్తున్న గోదావరి ఆక్వా ఫుడ్ ప్రాజెక్టు పట్ల ఎందుకంత నిరసన? నెలల తరబడి జైళ్లలో నిర్బంధించినా, దారుణంగా పోలీసులు మహిళలను అవమానిస్తున్నా, అరెస్టులు చేస్తున్నా ఎందుకని ఆడవాళ్లు పిడికిళ్లను బిగిస్తున్నారు? ఎందుకని ఏకకంఠంతో ధ్వనిస్తున్నారు? నేరుగా వెళ్లే నేరుగా ఆ బాధితుల గొంతునే వినాలి. వారేం చెబుతున్నారో విని, ఏ దృశ్యం అదృశ్యం అయిపోతుందని ఆవేదన చెందుతున్నారో దానిని సందర్శించాలి. టీవీని కట్టేసి, అభివృద్ధి వార్తల పత్రికలను కాసేపు మూసేసి, మళ్లీ మళ్లీ ఆడబిడ్డల ముఖాలను దృశ్యమానం చేసుకోవాలి. వారి గొంతుల్లో ధ్వనించిన నిరసన, ఆవేదన, ఆందోళన మనసులోకి ఇంకేదాకా మననం చేసుకోవాలి. దానికి వెనకముందుల్లో గల కారణాలను స్పర్శించి, విశ్లేషించి, మనసులోంచి ఉప్పిల్లే అక్షరాలతో అప్పుడు కవిత్వం అల్లాలి. కథలు రాయాలి. బహుశా అప్పుడది ప్రజాపక్ష కవిత్వం అవుతుంది. జనహృదయాలను తట్టిలేపే కథ అవుతుంది. ఆధిపత్య కులాహంకారాల దౌర్జన్యాల పట్ల, పాలకపక్షాల బాధ్యతారాహిత్య వ్యవహారాల పట్లా ఇలాంటి చూపే ఉండాలి. కవి అంటే కష్టజీవికి అటూ ఇటూ నిలబడేవాడు అన్నాడు శ్రీశ్రీ. ఆ అవసరం ఎప్పుడూ ఉంటుంది. అసలు ఎప్పటికన్నా ఇప్పుడు మరింత ఎక్కువగా ఉంది.


– శాంతిమిత్ర

పోరుహోరులో దక్షిణాఫ్రికా కవిత్వం

ప్రపంచం

దక్షిణాఫ్రికాలో ప్రభుత్వం మారింది. ప్రజాస్వామిక శక్తులు, అలవిమాలిన ప్రైవేటీకరణ పేరిట అక్కడి అధ్యక్షుడు జాకబ్ జుమా, భారతీయ సంతతికి చెంది, 1993 నుంచీ ఆ దేశ పౌరసత్వం గల గుప్తా సోదరత్రయంతో కలిసి చేసిన ఆర్థిక అక్రమాల చిట్టా పెరిగిపోతూ ఉండడంతో, సమాజ బాధ్యత గల మేధావులు, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న పబ్లిక్ ప్రొటెక్టర్, ఒక మహిళ తులి మెదన్ సేలా, అలాగే ఈ అవినీతి ప్రభుత్వంపై వందలాది కార్టూన్లు వేసిన ఆ దేశ కార్టూనిస్ట్‌గా అంతర్జాతీయ ఖ్యాతి గల జాపిరో, వీరి ప్రయాస మేరకు, దేశంలో ప్రకంపనలు మొదలై, చివరికి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ కలగచేసుకుని ఆయ్యగారిని పదవి నించి కిందకి దింపింది .

మన దేశపు బాంక్ బాంక్ ఆఫ్ బరోడా జోహాన్నెస్బర్గ్ శాఖ అనుమానాస్పద పాత్ర పోషించిన ఈ పీడకల, అవధుల్లేని కాపిటలిజపు వెర్రి పోకడలకు, ప్రజలచ్చే తీర్పు మారింది. అయితే, మేధావులు, పత్రికల జగవద్గీతలైన కార్టూన్ల ద్వారా ప్రకంపనలు పుట్టించే సమాజంగా ఇంకా దక్షిణాఫ్రికా సమాజం పచ్చిగా, వెచ్చగా ఉంది. మన దేశంలో కూడా ఇటువంటి అన్యాయాలే జరుగుతున్నాయి. దేశ మేధావి వర్గం తగు స్పందనలు ఈ దేశంలో బాకీ పడుతున్నారు. అప్పుడు ఈ మహిళా అధికారి, ఆ కార్టూనిస్ట్ వంటి వారి సామాజిక పాత్ర మన దేశంలోనూ ఇంకా ఎంతలా పెరగాలా అన్న ప్రశ్నతో. ఇటీవలి ఆ దేశ దురవస్థలో కూడా ఆశ చూసిన ప్రజాస్వరాలు రెండు కింద పొందుపరుస్తున్నాను. ఇవి పెన్ ఆఫ్రికా సంస్థ అడిగి మరీ ఎంపిక చేసిన కవితలు. పెన్ ఆఫ్రికా మోటో 'రాయి ఆఫ్రికా రాయి'.



అతోల్ విలియమ్స్

మనమూ అంటున్నాము మన దేశంలో స్మార్ట్ ఫోన్ కంపెనీల ఊపిరి సలపనివ్వని పకటనల్లో 'మాట్లాడు ఇండియా మాట్లాడు' అని! సరైన మాటలు తిండి, బట్టా, గూడూ వీటి కోసం తప్ప అన్నీ మాట్లాడుతున్న మన దేశంలో, ఒకప్పటి గాంధీ మెట్టిన దేశంలో వచ్చిన పౌర ప్రతిఘటన వల్ల రెండు వారాల కిందట జాకబ్ జుమా పదవి దిగిపోయాడు. గుప్తాల వ్యాపారం పలు ప్రశ్నలను ఎదుర్కొంటోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా జోహాన్నెస్బర్గ్ శాఖ మూసి వేశారు. ఇద్దరు గుప్తా సోదరులు, జుమా కొడుకు, ప్రస్తుతం ఆర్థిక నేరస్తులుగా పరారీలో ఉన్నారు. ఈ కథ పది లక్షల కోట్లు నిరర్థక అప్పులు సంపన్న వర్గాలకు ఇచ్చి ఏం చేయాలో తెలీని దశలో ఉన్న మన బ్యాంకులు, ప్రభుత్వాలు వీటికి కూడా వర్తిస్తుందేమో ఆలోచిద్దామా– ఆ ఆలోచనకి దారి తీసేవే ఈ రెండు కవితలు.

ఆశ ఒక ప్రార్థన

బరువుగా నింగిలో నల్లబారిన సూరీడు
రోదిస్తున్నాడు విషాద కిరణాలతో రెక్కలు విరిగిన పక్షి
ఎగిరే ప్రయాసలో యాతన గమనిస్తూ
ఒక దాని తర్వాత ఒకటిగా సత్యాలు రంగు వెలిసిపోతున్నాయి
వాగ్దాన స్వర్గాలన్నీ పవిత్ర పుటల నించి రాలిపోతున్నాయి
మన జాతీయ సంకల్పాలన్నీ
ప్రోటీ తేనె పూల పొదల మంచులో విదళిస్తూ, గోధుమ కంకుల్లా
పురుగుపట్టి నష్టపోతూ
విషపు గాలుల్లో ఉక్కిరి బిక్కిరవుతున్నది
ఆలోచనల ఘన స్వరాలను మనం అనుసరిస్తున్నాము కానీ
ఏనుగు దంతాల వంటి మన వారసత్వ ఘనత వేటాడబడుతున్నది
ఐక్యత వంకరలు పోయిన బంగారు కవచంలా మిగిలింది
స్వేచ్ఛా విహంగం రెక్కలు ఈకలు రాలిపోతూ ఉన్మాదాలకు గురవుతోంది
అయినా ఆశా దేవతలను మనం ప్రార్థిస్తూనే ఉన్నాము
'ఇవాళ మేం కోల్పోయిన ఆశలను రేపు మాకు ప్రసాదించు."

జోరుగా సైకిల్ ....

ఒక రంగు వెలిసిన నడకలో ఉన్నట్టుండి ఆగి పోయాను
మంచు రేకులు కట్టెదుట ఉన్నదాన్ని కమ్మేస్తూంటే
ఎదుట ఉందొక డొక్కు సైకిల్, నెత్తురోడుతూ
నల్లని దీప స్తంభానికి గొలుసుతో కట్టబడి
దాని ఎముకల్లాంటి పార్టులింకా తుప్పు పట్టలేదు
కానీ అది త్వరలోనే జరుగుతుంది
దాని భారీ శరీరం ఏ తొడుగులూ లేక దిశమొలగా ఉంది
రాబందులు పీక్కు తిన్న మాంస అవశేషాలు
హైనాల గుంపు ఖరాబు చేసిన ప్లాస్టిక్ సీటూ
చక్రాలూ, ఊత ఊచలూ పూర్తిగా బయటనే
రబ్బర్ టైర్లా ఒకప్పుడు దేవతల ఊపిరితో నిండుగా ఉండేవి
చక్రాలు జోరుగా పరుగులు పెట్టేవి ఫుల్ జోష్‌లో
ఇప్పుడవి ఆరగింపులకు బలై, అదృశ్యమై పోయాయి
ఎప్పటికీ, ఎప్పటికీ, ఇంకెప్పటికీ
పునరావృతం కాకూడని దశలో మనం
'మండేలా మనల్ని మభ్య పెట్టాడా?
ఇక్కడున్నాము మనం ఒకరికి అన్నీ అమిరి,
మరొకరు దిక్కులను కప్పుకుని ఇతరులచే అణచివేతకు గురవుతూ
తల్లుల కన్నీళ్లతో చెరువులన్నీ ఉప్పనవుతున్నాయి
మనం సాధిస్తాం.. మనం సాధిస్తాం...
మనమీ స్వేచ్ఛల ఢంకా మోగించ సమర్థులమే కానీ కావాలిప్పుడు
డప్పు చప్పుళ్లా కొట్టుకులాడే గుండె ఒకటి –
ఇది కావాలి మళ్ళా మన కొత్త 1994 –
సైకిల్ పెడళ్లూ, వేగం పెంచే అదనపు ఫ్లై వీల్, చైనూ, ఇంకా తొక్కే ఆశా –
ఈ డొక్కు సైకిల్ కు అమర్చాలి ఉన్నతంగా ఉండే ఒక సీటు
మన వేడి ఊపిర్లు నిండి నిండుగా ఉన్న టైర్లూ
ఎముకల్లా పార్టులు దేలిన సైకిల్ కు
మరమ్మత్తులు చేసే మాంస కండరాల దట్టింపు
మన కలలకు మరమ్మతులు,
పైన పడే హైనాల గుంపులను పారదోలడానికి
అన్ని గుండెల చప్పుళ్ల చురుకుదనం పెంచడానికి
ఎప్పటికీ, ఎప్పటికీ, ఇకెప్పటికీ ఈ దశ
పునరావృతం కాకూడదన్నదే మన జన రణఘోష
వీధి స్తంభపు కట్టడి నుంచి సైకిల్‌ను విడుదల చేసి
ఎప్పటికీ అస్తమించని సూర్య పరంపరను
సైకిల్ సీటు పై కూచోబెట్టుకు
ముందుకు మున్ముందుకు తొక్కుకుంటూ వెళ్లడానికి
అయితే ఈసారి మాత్రం అమాండ్లా
ప్రజలకే అధికారం అంటూ
అందరమూ కలిసి గట్టిగా పెడల్ తొక్కాలి!

మూల రచన : అతోల్ విలియమ్స్
వ్యాఖ్యానం, అనువాదం : రామతీర్థ
98492 00385

వెబ్ కూడలిలో యువ కథకులు

తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గుతుందా? పెరుగుతందా? అంటే– తగ్గతుందని చాలామంది పేర్కొంటారు. పుస్తకాలు కొనేవాళ్లు, చదివేవాళ్లూ తగ్గారని ఉదహరిస్తారు. నిజానికి ఇది వాస్తవం కాదు. చూడటానికి అలా కొంత కనిపిస్తున్నా– కొత్త కొత్త వేదికలపై సాహిత్య సాధకులు పుట్టుకొస్తున్నారు. వెబ్ పత్రికలు, సోషల్ మీడియా అందుకు వేదిక అవుతున్నాయి. ఇప్పుడు సాహిత్యం గురించి, సమాజం గురించి మాట్లాడేవారు ఆ వేదికల మీదికి వెళ్లాలి. నవతరానికి ప్రామాణిక, ప్రయోజనకర సాహిత్యాన్ని పరిచయం చేసి, వారి నుంచి నవీన సాహిత్యం ప్రభవించేలా బాటలు వేయాలి.

తెలుగు సాహిత్యంలో ఎన్ని సాహిత్య ప్రక్రియలు ఉన్నా– వన్నె తగ్గని ప్రక్రియ కథ. కథ కళ్ల ముందు ఒక మెరుపులా ఓ జీవిత శకలాన్నో, ఓ వర్తమాన సంఘర్షణనో చూపిస్తుంది. కథ కొన్ని జీవితాలను మారుస్తుంది. మరికొన్ని జీవిత గాథలను పరిచయం చేసి అదొక పార్యాంశంగా మన జీవితాల్లో నిలిచిపోతుంది. కథలు మన జీవితాల నుంచే పుట్టి ఎన్నో జీవితాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. నేడు యువకులు కథల పట్ల ఎంత ఆసక్తిగా ఉన్నారో జీవిత గాథలను అక్షర రూపంగా మలిచి ప్రాణం పోయడంలోనూ అంతే ముందున్నారు. మునుపు కథలు ఎక్కువగా కుటుంబం, విలువలు, బంధాలు చుట్టూ తిరిగేవి. నేడు సామాజిక అంశాలతో కూడుకున్న కథలెన్నో మనకు లభిస్తున్నాయి.

టెక్నాలజీ పెద్దగా లేని రోజుల్లో కథలు రాసి పత్రికలకు పంపేవారు. అవి ప్రచురణ కావడంలో జాప్యం జరిగేది. పేజీలు, కాలవ్యవధి రీత్యా అందరికీ అవకాశం దొరికేది కాదు. నేడు అలా కాదు. అంతర్జాలంలో వివిధ పత్రికలు, వెబ్‌సైట్స్ అందుబాటులోకి వచ్చాయి. అలాంటి వాటిలో 'ప్రతిలిపి' వెబ్‌సైట్ ఒకటి. దీనిలో రచయితలు తమ రచనలను తామే స్వీయ ప్రచురణ చేసుకోవచ్చు. ఈ వెబ్‌సైట్‌కి మొబైల్ యాప్ కూడా ఉంది. ప్రతిలిపి తరచూ పోటీలను కూడా నిర్వహిస్తూ ఉంటుంది. యువ రచయితల్లో కుంచె చింతా లక్ష్మీ నారాయణ ప్రతిలిపి కథల పోటీల్లో రెండుసార్లు గెలిచారు. సినీ స్క్రీన్‌ప్లే తరహాలో ఆయన రచనలు సాగుతాయి. ముఖ్యంగా హర్రర్, త్రిల్లర్, ప్రేమ కథలు బాగా రాస్తారు. తరుచూ కథలు రాస్తున్నవారిలో నల్లపాటి సురేంద్ర ఒకరు. దాదాపు యాభై కథలు ప్రతిలిపిలో ప్రచురించగా, రెండు లక్షల మంది పాఠకులు చదివారు. ఈయన రాసే కథలు పత్రికల్లో సైతం తరచూ వస్తున్నాయి. ఆవు కథాంశంగా ఆయన మత సామరస్యంపై రాసిన కథ ఆయనకు ఎంతో మంచి పేరు తెచ్చి పెట్టింది. పక్షులు, ప్రకృతి తదితర అంశాలపై బాబు కోయిలాడ రాసే కథలు సరికొత్తగా ఉంటాయి. యువ రచయిత్రి దీప్తి ప్రియ 'నేటి భార్య ఒకనాటి కూతురే' పేరిట రాసిన కథ 2017 లో ప్రతిలిపిలో ఎక్కువ మంది పాఠకులు చదివిన మొదటి పది కథల్లో చోటు దక్కించుకుంది. నేటి యువ రచయితలు సమాజాన్ని నెగటివ్ కోణంలో చూడటం లేదు. పాజిటివ్ కోణంలో స్ఫూర్తినిచ్చే కథలు రాస్తున్నారు. నిష్కల, విరాజిత, శ్రీనాథ్ పాకాల, హితేష్ కొల్లిపర, కార్తికేయ నందివెలుగు, రమేష్ రాపోలు ... ఇలా చాలామంది యువ రచయితలు వెబ్ మీడియాలో కథలు రాస్తున్నారు. వారు కొన్ని కథలు షార్ట్ ఫిలిమ్స్‌గా కూడా వచ్చాయి.

సృజన



చాలా అంతర్జాల పత్రికలు నేడు క్రమం తప్పకుండా సాహిత్య సేవ చేస్తున్నాయి. అనేకమంది యువతీయువకులు వెబ్, సోషల్ మీడియాలోనే తమ కథారచనకు శ్రీకారం చుడుతున్నారు. కహానియా.కాం, సుకథ.కాం వంటివి అనేక కథలను ప్రచురిస్తున్నాయి. యువ రచయితలే కాకుండా సీనియర్ రచయితలు కూడా వారి రచనలు వెబ్ పత్రికకు అందిస్తున్నారు. మనందరి.కాం, తెలుగు వన్.కాం, నమస్తే.ఇన్, వాకిలి వంటి చాలా పత్రికలు వెబ్‌లో అందుబాటులో ఉన్నాయి. నిజానికి కథ పత్రికల్లో ప్రచురణ అయితే కొంతమందికి మాత్రమే చేరే అవకాశం ఉంటుంది. అంతర్జాల పత్రికల్లో ప్రపంచంలో ఎక్కడి నుంచైనా, ఏ క్షణాన్నయినా లక్షల మంది చదివే అవకాశం కలుగుతుంది. మన రచనలన్నీ పిడిఎఫ్‌గా చేసి ఈబుక్‌గా కినిగె.కాంలో అమ్మకానికి కూడా పెట్టవచ్చు. విహంగ పేరిట మహిళలకు ప్రత్యేకంగా ఒక వార పత్రిక వెబ్‌లో ఉంది. దీనిని హేమలత పుట్ల నిర్వహిస్తున్నారు. తొలుత మహిళా రచయిత్రుల రచనలే ప్రచురించేవారు. ఇప్పుడు అందరి రచనలూ ఇస్తున్నారు. గోతెలుగు అంతర్జాల వార పత్రిక కూడా మంచి రచనలు ప్రచురిస్తోంది. కౌముది ఈ పత్రిక సంపాదకులు కిరణ్ ప్రభ దానిని ఎంతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. సాహిత్య విలువలు ఉన్న రచనలు ప్రచురిస్తున్నారు.

తెలుగుతల్లి కెనాడా మాస పత్రిక నిర్వహిస్తున్న లక్ష్మి రాయవరపు సాహిత్య పోటీలు పెట్టి రచయితలను ప్రోత్సహిస్తున్నారు. రచయిత్రి, కవయిత్రి జ్యోతి వలబోజు కూడా మాలిక అంతర్జాల పత్రికను నిర్వహిస్తున్నారు. మొత్తం మీద అంతర్జాలం నేడు దాదాపు అందరికీ అందుబాటులో ఉంది. దానిని సరైన మార్గంలో ఉపయోగించుకుంటే యువ రచయితలు వారి ప్రతిభతో అనేకమందికి చేరువ కావచ్చు. ఫేస్ బుక్, యూట్యూబ్, వాట్సప్‌లో కూడా సృజనాత్మక సాహిత్యం నడుస్తోంది. అయితే, ఇందులో చాలామంది యువ రచయితలకు సరైన మార్గనిర్దేశనం చేసేవారు లేరు. ఫేస్‌బుక్‌లో, సంగమం వంటి గ్రూపుల్లో సీనియర్ కవులు కూడా చురుగ్గా ఉండటంతో వారి నుంచి కొందమందికి సలహాలు సూచనలు అందుతున్నాయి. సాహిత్యానికి దూరం అవుతున్నారనుకుంటున్న యువతరం ఇలా కొత్త కొత్త మాధ్యమాల్లో తమలోని రచనాశక్తిని ప్రదర్శిస్తూ ఉండటం చాలా సంతోషదాయకం. వారికి ప్రోత్సాహమూ, విమర్శలూ, సూచనలూ సలహాలూ అందివ్వాల్సిన బాధ్యత సీనియర్లపై ఉంది. అలా జరిగినప్పుడు సమకాలీన పరిస్థితుల లోతుపాతులు వెబ్ సాహిత్యంలో ప్రతిబింబిస్తుంది. అలా పుట్టుకొచ్చిన రచయితలూ, రచయిత్రులే రేపటి తెలుగు సాహిత్యాకాశంలో మెరుపులూ వెలుగులూ. వారి రచనలను ఆస్వాదిస్తూ అభినందిస్తూ విశాల సాహిత్య ప్రవాహంలోకి ఆహ్వానిద్దాం. యువ కథకులు, కొత్త కథకులు ఉన్న చోటకు సీనియర్లూ వెళ్లాలి. వెబ్‌లోనూ రాయాలి. వారి రాతలే కొత్త సృజనకారులకు మార్గదర్శకాలు అవుతాయి. మున్ముందు మన సాహిత్యం సామాజిక, వర్తమాన సంఘర్షణలకు అద్దం పడతాయి.

– అఖిలాశ
72595 11956



ఉద్యోగం స్త్రీ లక్షణమే..!

సరోజిని, కమలమ్మ కూర్చొని కాసేపట్లో నిర్వహించబోయే డ్వాక్రా గ్రూపు మీటింగ్‌లో చర్చించాల్సిన విషయాల గురించి మాట్లాడుతూ, ఎవరెంత అప్పు తీసుకున్నదీ, ఎవరెవరు నెల వాయిదాలు చెల్లిస్తున్నదీ లెక్కలేసుకుంటున్నారు. ఇంతలో, సరోజిని కూతురు ఆకాంక్ష అక్కడికొచ్చింది. "అమ్మా..! మీడబ్బులే మీరే అప్పుగా తీసుకుంటున్నారు సరే! వాటిని తీర్చేసి, మళ్లీ డబ్బులు జమేసుకోడానికి ఊళ్లోనేమో పొలం పనుల్లేవు. మిగతా పనుల్లో ఎక్కువగామగోళ్లనే తీసుకుంటారు. వాళ్ల సంపాదించే డబ్బులు ఇంట్లో అవసరాలకే సరిపోతున్నాయ్. ఆడోళ్లని ఎక్కడో ఒకచోట తప్ప పనికి తీసుకోరు. మరి స్వయం సహాయక సంఘాలు బతికేది ఇంకెన్నాళ్లు?" అని సంశయాన్ని వ్యక్తం చేసింది.

'నువ్వు ఉద్యోగం చేసి తీర్చుదువుగానిలే..' అంది కమలమ్మ.

"వీళ్ల నాన్న పెళ్లి సంబంధాలు చూస్తున్నాడొదినా. ఈ ఎండల్లోనే పెళ్లి చేయాలంటాడు. అమ్మాయేమో చదువుకుంటానంటుంది. 'చదువుకోని ఏ ఊళ్లేలాలి?' అంటాడాయన. వీళ్లిద్దరి వాదనలు వినలేక నాకు రోగమొచ్చేటట్టుంది" అంటూ నిట్టూర్చింది సరోజిని.

ఇంతలో కమలమ్మ కలుగజేసుకొని, 'ఆకాంక్షా..! మా గ్రూపు ఆడోళ్లతో ఇట్టాంటి కబుర్లు చెప్పొచ్చుకదమ్మా! వాళ్లకీ లోకం పోకడేందో తెలుసుద్ది' అని బతిమాలినట్లు అంది.

'సరే కమలత్తా..' అంది ఆకాంక్ష.

కొంతసేపటికి మీటింగ్‌కి రావల్సినవాళ్లంతా వచ్చారు. గ్రూపు సెక్రెటరీ కమలమ్మ అందర్నీ ఉద్దేశించి.. ఆకాంక్షను మాట్లాడుతుందని చెప్పింది.

"కమలత్త చదువుకోలేదు. కానీ ఇప్పుడు మన ఊరి సర్పంచ్ భార్యతో సమానంగా మాట్లాడగలదు. బ్యాంకుకెళ్లి మీ గ్రూపు వ్యవహారాలన్నీ చూసుకోగలదు. అంతకుముందు ఖాళీగా ఇంట్లో కూర్చున్నప్పుడు ఇలాంటి పనులంటేనే భయపడేది. ఇప్పుడు ఆర్థిక విషయాల్లో భాగస్తురాలయ్యింది గనుక ఆత్మవిశ్వాసం పెరిగింది. అలా మహిళలు వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడినప్పుడే మనం చెప్పుకునే స్త్రీ సాధికారత సాధ్యమవుతుంది. కానీ దేశంలో పరిస్థితి వేరుగా ఉంది. మీ అందరికీ తెలిసినమ్మాయి లక్ష్మి.. ప్రస్తుతం ఇంజినీరింగ్ పూర్తిచేసింది. ఉద్యోగావకాశాలు బాగున్నాయని అదేదో మంచి గ్రూపే తీసుకుంది. కానీ చదువుకు తగిన ఉద్యోగం దొరకలేదు. ఏదో ఫైనాన్స్ కంపెనీలో లెక్కలు చూసుకునే పనిలో చేరింది. ప్రస్తుతం పోటీ పరీక్షలు రాయడానికి సిద్ధపడుతుంది. దేశంలో చాలా మంది పరిస్థితి ఇలాగే ఉంది.

శారీరక సామర్థ్యం సాకు

అమ్మాయికి డిగ్రీ పూర్తవగానే ఇంట్లో పెళ్లి తంతు మొదలుపెడుతున్నారు. లేదంటే ఆర్థిక పరిస్థితుల వల్ల ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఏ రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయో వాటికి సంబంధించిన కోర్సులే చదువుతున్నారుగానీ ఆయా రంగాల్లో పురుషులకే ఎక్కువ అవకాశాలు ఉంటున్నాయి. టెలికాం, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్, విద్యుత్, తదితర రంగాల్లో మహిళలు ఓవర్ టైమ్ చేయలేరనో, నైట్ డ్యూటీలు చేయరనో, శారీరక సామర్థ్యం సరిపోదనే సాకుతో మహిళలకు అవకాశాలు ఇవ్వడంలేదు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో కాంట్రాక్టు ఉద్యోగావకాశాలే ఎక్కువయ్యాయి. ఏ క్షణంలో ఊడుతుందో తెలియని అనిశ్చితిలో ఉన్న అలాంటి ఉద్యోగాల్ని చేయలేకో, చేయడానికి ఇంట్లో ఒప్పుకోకో మహిళలు వాటికీ దూరమవుతున్నారు. ఒకవేళ చేరినా ఆయా సంస్థలు పురుషులతో సమానంగా స్త్రీలకు వేతనం ఇవ్వట్లేదు. ఈ పరిస్థితి వ్యవసాయ, వ్యవసాయేతర కూలీ పనుల్లో అధికంగా ఉంది. పని తక్కువగా ఉండి ఉద్యోగస్తులను తగ్గించాలని సంస్థ అనుకుంటే అందులో ముందుగా మహిళలనే తొలగిస్తున్నారు. ఇక క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఆశా, అంగన్వాడీ, శిక్షా మిత్ర తదితర స్కీముల్లో పనిచేస్తున్న వర్కర్ల పరిస్థితి మరింత కష్టంగా ఉంది.

అన్నింటా వివక్షే

చాలారంగాల్లో దేశం ప్రగతి పథంలో, అత్యంత వేగంగా పరిగెడుతుందని వింటున్నాం. అయితే అందులో 'లింగసమానత్వం' ఉందా? అనేది ప్రశ్న. చెప్పుకోడానికి దేశం అభివృద్ధి చెందుతుందనే వాదనలున్నా ఉద్యోగం, ఉపాధిలో మహిళల భాగస్వామ్యం తక్కువవుతుందని గణాంకాలు చెబుతున్నాయి. 'ఒక దేశంగానీ, రాష్ట్రంగానీ, అంతెందుకు ఒక సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళల భాగస్వామ్యం అత్యంత అవసరం' అనేది నిజం. కొన్ని సర్వేల ప్రకారం పెళ్ళైన తర్వాత భార్యలను కొట్టడం సమంజసమేనని చెబుతున్న 50 శాతం మందిలో.. పురుషులతో పాటు మహిళలూ ఉన్నారంటేనే సమాజం ఎంత మూఢత్వంలో ఉందో అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఇక్కడ బిడ్డ గర్భంలో ఉన్నప్పుడే లింగ వివక్ష మొదలవుతుంది. ఆడపిల్ల పెరిగి పెద్దదై, యుక్తవయస్సుకు వచ్చేటప్పటికి ఈ వివక్ష పెరిగి, స్త్రీని అణగదొక్కేస్తుంది. విద్య, ఉపాధి అవకాశాల్లో అసమానత్వం, తద్వారా ఆర్థిక అసమానత్వం స్త్రీ పురోగతిని అడ్డుకుంటున్నాయి. భారతదేశంలోని 53 శాతం పాఠశాలల్లో పారిశుధ్య సదుపాయాలు లేవు. దానివల్ల ఎందరో అమ్మాయిలు విద్యకు దూరమవుతున్నారు. దీనికితోడు బాల్యవివాహాలూ, లైంగిక హింస, తదితర కారణాలు మరింత బాధిస్తున్నాయి. దేశంలో స్త్రీలపై పెరిగిపోతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు మహిళలను ఉద్యోగ, ఉపాధి రంగాల్లో నిలదొక్కుకునే పరిస్థితులను నీరుగారుస్తున్నాయి.

సహకారం

స్త్రీ సాధికారత అంటే ముందుగా నగరాల్లో నివశించే ఉన్నత వర్గాలకు చెందిన మహిళా వ్యాపారస్తులే కనిపిస్తారు. గ్రామాల నుంచి ఎంతో కష్టపడి పెద్ద చదువులు చదివొచ్చిన స్త్రీలూ వర్ణ, వర్గ వివక్షల్లో బాధితులుగానే మిగిలిపోతున్నారు. అందుకే వారిని స్వయం సహాయక బృందాల్లో, వృత్తి విద్యాల్లో భాగస్థులను చేసి, ఉపాధిని కల్పిస్తున్నామనే పేరుతో 'ఎక్కడున్న గొంగళిని అక్కడే ఉంచాలనే' ప్రయత్నం చేస్తున్నారు పెట్టుబడిదారీ వర్గాలు. అడ్డంకులను దాటుకుంటూ స్వయం సహాయక బృందాల ఆసరాగా సామాజిక మార్పుకు కారణమవుతున్న మహిళలూ లేకపోలేదు. వీళ్ల గ్రామాల్లోని స్త్రీలకు ఉపాధి కల్పించడంతో పాటు చాలా కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నారు. దీనితోపాటు దేశ ఆర్థిక సంరక్షణకూ, లింగ వివక్షను తొలగించడానికీ, సామాజిక సమానత్వానికీ పాటుపడుతున్న మహిళలు లేకపోలేదు. కానీ వారి చేతుల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనలో నిర్ణయాధికారం ఉందా అనేదే ప్రశ్న. సంఘం సహకారంతో చేసుకునే వ్యాపారాలకు అడ్డంకులున్నాయి. బ్యాంకుల్లో అధిక వడ్డీల భారంతో పాటు, అధికారుల వేధింపులు, స్వయం ఉపాధి మహిళలకు కుటుంబపరమైన అవరోధాలు, క్షేత్రస్థాయిలో అమలుకాని ప్రభుత్వ ప్రోత్సాహకాల వలన ఇబ్బందులున్నాయి. మార్కెటింగ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయా చిన్న వ్యాపారాలను దెబ్బతీస్తున్నాయి.



గుర్తింపులేమి

కౌముదిని ఆర్థికంగా ఉన్నతమైన కుటుంబంలో పుట్టింది. బాగా చదివి పెద్ద శాస్త్రవేత్త కావాలనుకుంది. కానీ తండ్రి పెళ్లిచేసి అమెరికా పంపాలనుకుంటున్నాడు. సంబంధాలోళ్లేమో 'అమ్మాయి ఉద్యోగం చేయడం మాకు ఇష్టంలేదు..' అంటున్నారు. తండ్రికి సర్దిచెబుదామని ప్రయత్నిస్తే 'ఆడపిల్లకి అంత నోరు ఉండకూడదు' అంటుంది తల్లి. కౌముదిని అక్క కేంద్రప్రభుత్వంలో ఉన్నతోద్యోగి, పిన్ని కూతురేమో పెద్ద ప్రయివేటు కంపెనీలో మేనేజరు స్థాయి. ఇద్దరూ మంచి స్థాయిలోనే ఉన్నారుగానీ పైస్థాయికి వెళ్లలేకపోతున్నారు. ఈ పరిస్థితి అన్ని రంగాల్లోనూ ఉంది. మన దేశంలో రక్షణా, భద్రతా శాఖల్లో మహిళలకి ఉన్నతోద్యోగాలు ఇవ్వడానికి ఎన్నో ఏళ్లు పట్టింది. అంతర్జాతీయంగా ఎన్నో విజయాలను చవిచూసిన భారత అంతరిక్ష శాఖలో అత్యున్నత స్థాయిలో ఉన్న మహిళా శాస్త్రవేత్తలు ఎంతమంది? ఒక మహిళకి దేశ రక్షణ బాధ్యతలు అప్పగించడానికి 70 ఏళ్లు పట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో పురుషులతో సమానంగా అత్యున్నతస్థాయి బాధ్యతలు మహిళలకి చేరేదెప్పుడు?



ఆచరణ కావాలి

వ్యవసాయ రంగంలో యాంత్రికత పెరుగుతున్న ఈ పరిస్థితుల్లో మహిళలకు వ్యవసాయేతర రంగంలో అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉంది. స్త్రీలకు ఉన్నత విద్యావకాశాలను మెరుగుపరిచి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు, అందుబాటులోకి తీసుకురావాలి. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో మెటర్నిటీ సదుపాయాలనూ మరింత అనుకూలంగా మార్చాలి. పని వాతావరణంలో లైంగిక హింస రూపుమాపడానికి తగిన చర్యలు తీసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా స్త్రీ విద్య, సాధికారతలకు అధిక ప్రోత్సాహం ఉంది. కానీ భారతదేశంలో అవి పేరుకే తప్ప ఆచరణలో విఫలమవుతున్నాయి. ఎన్ని పంచవర్ష ప్రణాళికలు మారినా మహిళల రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేకపోవడానికి కారణంగా ఎవరిని చూపాలి? భారతదేశంలో ఎక్కువ మంది కొలిచే స్త్రీ రూపాలన్నీ భర్తకూ, కుటుంబానికీ సేవ చేస్తూ, వారి మాటను జవదాటని వారే. అలాంటి స్త్రీల కథల్ని ఉన్నతమైన వ్యక్తిత్వంగల వారిగా ప్రచారం చేస్తూ, స్వేచ్ఛగా వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునే స్త్రీలను మాత్రం సంఘవ్యతిరేకులుగా చూపుతున్న వ్యవస్థలో స్త్రీ సాధికారత ఎప్పటికి సాధ్యం? ఆలోచించాల్సిన తరుణమిది." అంటూ ముగించింది ఆకాంక్ష.

'ఉద్యోగం పురుష లక్షణం' అనే నానుడి ఎప్పటి నుంచో వింటూనే ఉన్నాం. అంతరిక్షంలో ప్రయాణించినా, రక్షణ బలగాల్లో ధైర్యసాహసాలు ప్రదర్శిస్తున్నా, సాంకేతికంగా ఎంత విజ్ఞానం సంపాదించినా, సాహిత్య, కళారంగాల్లో కొత్తదారులు వేస్తున్నా, ఎంత శక్తిసామర్థ్యాలు, ఎన్ని నైపుణ్యాలు ఉన్నా మహిళ అణిగిమణిగి ఉండాలనే భావన ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. కూలి పనిచేసే కార్మికురాలి నుంచి.. వినూత్న ఆలోచనలతో అద్భుతాలు సృష్టిస్తున్న ఆధునిక మహిళ వరకూ ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సరైన గుర్తింపుకు నోచుకోని పరిస్థితుల్లోనే ఉన్నారు. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకూ కుటుంబం, వృత్తి, ఉద్యోగాల్లో స్త్రీల భాగస్వామ్యం లేకుండా ఊహించుకోగలమా..?!

- ప్రవీణ్ వెలువోలు

సరికొత్త మ్యాట్ పర్పుల్ ఫినిషింగ్‌లో స్కూటీ జెస్ట్ 110 స్కూటర్‌ను టీవీఎస్ మోటార్ కంపెనీ మార్కెట్లో విడుదల చేసింది. ఇప్పటికే ఈ మోడల్ నాలుగు విభిన్నమైన నలుపు, ఎరుపు, పసుపు, నీలం రంగుల్లో లభ్యమవుతోంది. దీనికి తోడు తాజాగా మ్యాట్ పర్పుల్ రంగు వచ్చి చేరింది. సాంకేతికంగా టీవీఎస్ స్కూటీ జెస్ట్ 110 స్కూటర్‌లోని మ్యాట్ పర్పుల్ ఎడిషన్‌లో అదే 109.7 సీసీ కెపాసిటీగల గాలితో చల్లబడే సింగిల్ సిలిండర్ పెట్రోల్ ఇంజన్ అందించారు. సివిటి ట్రాన్స్‌మిషన్ అనుసంధానంగల ఇది 7.8 బిహెచ్‌పి పవర్, 8.4 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. టీవీఎస్ స్కూటీ జెస్ట్ స్కూటర్‌లో సస్పెన్షన్ కోసం ముందువైపున టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్క్స్, వెనుకవైపున హైడ్రాలిక్ మోనోషాక్ అబ్జార్వర్ ఉన్నాయి. బ్రేకింగ్ డ్యూటీ కోసం ఫ్రంట్ వీల్‌కు 110 ఎమ్ఎమ్ డ్రమ్, రియర్ వీల్‌కు 130 ఎమ్ఎమ్ డ్రమ్ బ్రేక్ సెటప్ ఉంది.

న్యూస్

స్కూటీ జెస్ట్ 110 సరికొత్త కలర్ స్కీమ్‌లో..!

అలాగే, 19 లీటర్ల అండర్ సీట్ స్టోరేజ్ సామర్థ్యం, యుఎస్‌బి ఛార్జర్, పగటిపూట వెలిగే లైట్ వంటివి అదనపు ప్రత్యేకతలు. మ్యాట్ సిరీస్ స్కూటర్లలో ప్రత్యేకించి అండర్ సీట్ స్టోరేజీలో లైట్, డ్యూయల్ టోన్ కలర్ సీటు, సిల్వర్ ఓక్ ఇంటీరియర్ ప్యానల్, త్రీడి జెస్ట్ 110 లోగో వంటి ఫీచర్లు ఉన్నాయి. టీవీఎస్ స్కూటీ జెస్ట్ 110 ఎంట్రీ లెవల్ స్కూటర్ల సెగ్మెంట్లో పాపులర్ మోడల్‌గా నిలిచింది. విపణిలో ఉన్న హోండా ఆక్టీవా ఐ, సుజుకి లెట్స్, హీరో ప్లెజర్, యమహా రే-జడ్ వంటి స్కూటర్లకు గట్టి పోటీనిస్తోంది. ★



పనిభారం తగ్గాలంటే?

ప్రస్తుత కాలంలో జీవితం ఉరుకులు పరుగులమయమైపోతోంది. ఈ క్రమంలో చాలామంది ఒత్తిడికి గురై, జబ్బుల బారిన పడుతుంటారు. కానీ ఒత్తిడిని దూరంచేసి మనసుని ప్రశాంతంగా ఉంచగలిగితే ఆయుః ప్రమాణాలు పెరుగుతాయని వైద్యులు అంటున్నారు. ఒత్తిడిని అధిగమించాలంటే, నిత్యం సంతోషంగా ఉంటూ.. తమ పని తాము చేసుకుపోతుంటే ఎలాంటి జబ్బులు దరిచేరవనీ వారు చెబుతున్నారు. పని ఒత్తిడి పురుషులలో కన్నా మహిళలలోనే ఎక్కువగా ఉంటుంది. పురుషులు కేవలం ఆఫీసు వ్యవహారాలు మాత్రమే చూసుకుంటుంటారు. ఇంట్లోని ప్రతి చిన్న పనినీ స్త్రీలే చేస్తుంటారు. కొందరు పురుషులైతే వారు తాగే నీటినీ మహిళల చేతే తెప్పించుకుంటారు.

మహిళల విషయానికి వస్తే మాత్రం పురుషునితో సమానంగా ఆఫీసు పనులు చక్కపెట్టడమే గాకుండా, ఇంటి వద్ద భర్త, పిల్లలకు, అత్తమామలకు, ఇంటికి వచ్చే అతిథులకు రుచికరమైన ఆహారాన్ని చేసిపెట్టాలి. అయితే మహిళలు ఎక్కువగా ఒత్తిడికి గురికాకుండా, తెలివిగా ఇంటిపనులను ప్రణాళికా బద్ధంగా చేసుకుంటూపోతే సంతోషంగా జీవితాన్ని గడపవచ్చుంటున్నారు పరిశోధకులు. దీంతో వారి ఆయుఃప్రమాణం పెరుగుతుందని అధ్యయనకారులు చెబుతున్నారు. అలాగే మహిళలు తమ కార్యాలయాలలోనూ ప్రణాళికాబద్ధంగా పని చేస్తే.. అధిక ఒత్తిడికి గురికాకుండా ఉంటారు. రేపటి పని గురించి ఈరోజే ఆలోచించుకుని, పని చేసుకోవాలి. అలాగే ఇంటి పనుల్లో భర్తను, పిల్లల్ని భాగస్వాములను చేయాలి. దీంతో శారీరక ఒత్తిడినే కాకుండా మానసికమైన ఒత్తిడినీ దూరం చేసుకోవచ్చుంటున్నారు పరిశోధకులు. కార్యాలయంలోనూ మహిళలు చేసే పనిని సానుకూల దృక్పథంతో ఆలోచించి చేయాలి. అవసరాన్ని బట్టి స్నేహితుల సహకారం తీసుకోవాలి. దీంతో ఒత్తిడి ఉండదు. ఒకవేళ మరీ ఒత్తిడి ఎక్కువగా ఉంటే పక్కనున్న కొలీగ్‌తో ఏదో ఒక సంభాషణ ప్రారంభిస్తే కొంతసేపటికి ఒత్తిడి దూరమవుతుంది. ★



మీకోసం

వంటింటి అరలని సర్దడానికి ముందు బేకింగ్ సోడా నీళ్ళల్లో కలిపి మూలల్లో స్ప్రే చేస్తే.. దుర్వాసన తగ్గుతుంది.



జీవన సౌరభం


యావత్తు శ్రమలో అత్యధిక భాగం ఆమె శ్రమే.

ఆమె.. వాటర్ మదర్

రాజస్థాన్‌లో ఎడారి భూములను హరిత వనాలుగా మార్చిన ఘనత ఆమెకే దక్కింది. అందుకే ఆమెను అందరూ 'వాటర్ మదర్' అని గౌరవంగా పిలుస్తారు. ఎండిపోయిన చెరువులు, కుంటల్లో మళ్లీ జలకళ ఉట్టిపడేలా చేయడం ఆమెకి నీటితో పెట్టిన విద్య. నీటిని ఒడిసి పట్టుకోవడం, పొదుపుగా వాడుకోవడం, వ్యవసాయానికి వినియోగించుకోవడంలో పల్లెవాసులకు ఆమె తగిన తర్ఫీదు ఇస్తుంటారు.

ముంబయికి చెందిన విద్యావేత్త అమ్లారుయా సామాజిక సేవ చేయాలన్న సంకల్పంతో 'ఆకార్ ఛారిటబుల్ ట్రస్టు' ద్వారా రైతులకు అండగా నిలిచారు. రాజస్థాన్‌లో ఎడారి భూములను సస్యశ్యామలం చేస్తూ ఇప్పటికి దాదాపు వంద గ్రామాల్లో పంటల దిగుబడి పెంచేందుకు ఆమె కృషి చేశారు. ఉష్ణతాపంతో భగభగమండే రాజస్థాన్‌లో నీటి నిల్వలను కాపాడుకోవడం అత్యంత దుర్లభం. ఎప్పుడో వర్షం కురిసినా నీరు ఆవిరైపోతుంది తప్ప నిల్వ ఉండే అవకాశం ఉండదు. వర్షపు నీటిని నిల్వ చేసుకుంటే భవిష్యత్తు అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రుయా పల్లెప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. నీటిని నిల్వ చేసుకునేందుకు ఎలాంటి అవగాహన లేకపోవడం వల్లే ఎడారి ప్రాంత వాసులు సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె ప్రత్యక్షంగా గమనించారు. ఎలాగైనా అక్కడి పరిస్థితిని మార్చాలని, నీటిని నిల్వ చేయడంలో సవాళ్లను అధిగమించాలని ఆమె భావించారు. ఎక్కడికక్కడ చెక్‌డ్యామ్‌లు నిర్మించుకుంటే నీరు నిల్వ ఉంటుందని, అవసరానికి తగ్గట్లు ఆ నీటిని వాడుకుని, అవసరాలు తీర్చుకోవచ్చని పల్లెప్రజలకు అర్థమయ్యేలా బోధపరిచారు. ఎండవేడి కారణంగా నీరు నిల్వ ఉండడం అంత సులువు కాదని అక్కడి ప్రజలు అనుకున్నారు. శ్రమదానంతో చెక్‌డ్యామ్‌లు నిర్మించుకుంటే మంచి ఫలితం ఉంటుందని వారికి ఆమె వివరించారు. ఆమె మాటలపై గురి కుదరడంతో ప్రజలు శ్రమదానం చేసేందుకు ముందుకు వచ్చారు. 'ఆకార్ ఛారిటబుల్ ట్రస్టు' ద్వారా కొంతమేరకు నిధులను ఆమె అందజేశారు. ముందుగా సీకర్ జిల్లాలో గద్రాతా, హామెట్స్ గ్రామాల వద్ద చెక్‌డ్యామ్‌లు పూర్తయ్యాయి. అయితే, అప్పుడు కొన్ని నెలలకిగానీ వర్షం కురవలేదు. ఆలస్యంగా వర్షం కురిసినా ఆ నీరు చెక్‌డ్యామ్‌ల్లోకి చేరడంతో తమకు నీటి కష్టాలు తీరిపోయాయని జనం ఆనందంతో పొంగిపోయారు. ఆ నీటిని వాడుకుని పంటలు వేశారు. పంట దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో జనం ఆర్థికస్థితి మెరుగుపడింది. సంపాదన పెరగడంతో చాలామంది రైతులు పాడి పశువులు కొన్నారు. కొందరు రైతులు ట్రాక్టర్లు, బైకులు వంటి వాహనాలు కొనుగోలు చేశారు. ఆడపిల్లల పెళ్లిళ్లకు ఎలాంటి ఆటంకాలూ ఎదురుకాలేదని రైతులు సంబరపడ్డారు. ఇదంతా అమ్లా చొరవతోనే సాధ్యపడిందని గ్రామస్తులు చెబుతుంటారు. సమీప గ్రామాల వారూ చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి సాయం చేయాలని ఆమెను ఆశ్రయించారు. ఆమె కృషి ఫలితంగా మరికొన్ని గ్రామాలూ జలకళను సంతరించుకున్నాయి. ఒకప్పుడు కడుపునిండా తినడానికీ అనేక ఇబ్బందులు పడిన వారు ఇపుడు ఆహారోత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు. దాదాపు వంద గ్రామాలు అమ్లా చొరవతో నేడు సుభిక్షంగా మారాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని దుర్భిక్ష ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించేందుకు అమ్లా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి చేస్తున్న సేవలకుగాను 'లక్ష్మీపత్ సింఘానియా' అవార్డు, లక్నో ఐఐఎం నుంచి సామాజిక సేవా అవార్డును ఆమె అందుకున్నారు. కష్టపడి పనిచేస్తే ఏదీ అసాధ్యం కాదని, సవాళ్లను అధిగమించడంలోనే అసలైన నైపుణ్యం దాగి ఉంటుందని ఆమె చెబుతుంటారు ★





GENERAL SCIENCE PAPER-1

S.S.C.MODEL PAPER

(PART-A&B)

Time: 2.45 Hours - Max Marks: 40

PART – A

Time: 2.15 Hours Max Marks: 30

Instructions: 1. Answer the Following questions in 1 or 2 sentences
2. Each Question carries '1'mark.

SECTION - I (4 × 1 = 4)

1. An opthmalagist suggested Ravi to use the lens with 3D power after testing. Then what is the focal lenth of the lens?
2. How do you say that 'Rainbow is a continous spectrum' ?
3. Find the potential difference between the terminals of a conductor of lm length moving with a velocity 10 m/sec perpendicular to the magnetic field of flux density 0.8T?
4. Write the instruments used in water of crystallisation experiment?

Section - II (5 × 2 = 10)

Instructions: 1. Answer the Following questions in 4 or 5 sentences
2. Each Question carries '1'mark.

5. Sita's uncle will go outside with out wearing spectacles.
But he will use spectacles for reading news paper.
(1) write type of eye defect he is suffering from?
(2) suggest the type of lens he can use?
6. sireesh throw stones at honey beehive. then he was biten by honey bees. he suffered a lot.
(1) Assume the reason for his suffering?
(2) Suggest him to over come the pain?
7. Observe the below table

Substance	Specific heat (Cal/gm°C)
Kerosene	0.5
Ice	0.5
Water	1

Answer the following questions.
1. Which substance requires more heat energy to raise the temparature of both ice and kerosene to 400 C?
2. Which substance temparature raises rapidly if we supply same amount of a heat?
8. Write the applications of faraday's laws in daily life?
9. Write a short note on esters role in daily life?

Section - III (4 × 4 = 16)

10. The focal length of a symmetrical convexlens is 24 cm. Refractive index of the material used for lens is 1.5. Then find out the radius of curvature of lens?
(or)
Explain the formation of BF3 molecule with the concept of hybridisation.
11. How do you find the relation between resistance of a conductor and area of cross section. Explain with an activity ?
(or)
How do you find the vertical shift of a glass slab. From that how do you find refractive index?
Answer the following :
a) Indentify the organic compound.
b) Write the chemical equation for the aobve reaction.
c) Name the gas evolved.
d) How do you test the gas evolved.
e) list two important uses of above compound.
f) List two important uses of above compound.

Elements	Electron Configuration
A	$1S^2\ 2S^2$
D	$1S^2$
E	$1S^2\ 2S^2\ 2P^5$
G	$1S^2\ 2S^2\ 2P^6\ 3S^2$
J	$1S^2\ 2S^2\ 2P^6\ 3S^1$

12)
Answer the following questions.
(1) Name the elements belongs to same group?
(2) What are the elements in second period?
(3) Which is the inertgas?
(4) Name the compound formed between J and E?
(or)

Ore	formula
Magnetite	$MgCO_2$
Zincate ZnO	
Zinc Blende	ZnS
LimeStone	$CaCO_2$
Carnality	$KC\lambda MgC\lambda_2.6H_2O$

Answer the following questions.
(1) Write the names of Carbonate ores?
(2) Name the metals present in Carnalite?
(3) Which ore is concentrated by frothflitation process?
(4)Name the ore that can calcinate?
13. A Concave mirror formed an inverted diminished image what is the position of the object? Draw the ray diagram showing the formation of image?
(or)
Draw the diagram showing decomposition reaction and lable the parts/ Write the chemical equation showing the above reaction.

PART - B

Time : 30 mts Marks : 10

Instructions : Choose the correct answers and write in brackets.

14. which is true [ ]
A). Melting is a cooling process
B). Evaporation is a heating process
C). Specificheat is responsible for change
D). Condensation is a cooling process

15. Mirror formaula [ ]
A). $\frac{1}{f}=\frac{1}{u}-\frac{1}{v}$ B). $\frac{1}{f}=\frac{1}{v}-\frac{1}{u}$
C). $\frac{1}{f}=\frac{1}{u}+\frac{1}{v}$ D). $\frac{1}{f}=(n-1)\left(\frac{1}{R_1}+\frac{1}{R_2}\right)$

16. focal length of convexlens .... in water [ ]
A). decreases
B). increases
C). no change
D). we can not say

17. n1 Sin i = n2 Sin r is ..... [ ]
A). Fermat's priciple
B). Snell's law
C). Lens formula
D). Lens maker's formula

18. The process of dividing white light into seven colours..... [ ]
A). refraction
B). reflection
C). scattering
D). Total internal reflection

19. Group - I Group - II [ ]

Group - I	Group - II
a). Sky in blue colour	i). Afternoon
b). Sky in white colour	ii). morning, evening
c). Sun in red color	iii). N2 , O2 Molecules
d). Sun in white colour	iv). Water molecules

A). a-iii, b-ii, c-iv,d-i
B). a-iv, b-iii, c-i,d-ii
C). a-iii, b-iv, c-ii,d-i
D). a-iii, b-iv, c-i,d-ii

20. ..... is used in houses to avoid short circuit [ ]
A). Fuse B). switch
C). Motor D). Regulator

21. 1) Motor converts electrical energy into mechanical energy [ ]
2) Dynamo converts mechanical energy into electrical energy
A). 1 True, 2 True
B). 1 True, 2 False
C). 1 False, 2 True
D). 1 False, 2 False

22. Force acting on current carrying conductor perpendicular to uniform magnetic field [ ]
A). 0 B). ILB
C). 2 ILB D). ILB

23. Which amoung the following is not a balanced chemical equation [ ]
A). 2H2O → 2H2+O2
B). 2Zn+O2 → 2ZnO
C). NH3+Hcl → NH4cl
D). Na2O+H2O → NaOH

24. Salt is [ ]
A). Acid B). Base
C). Nautral D). Any one

25. Plank's constant..... [ ]
A). 6.626I10`27 Js
B). 6.626I10`29 Js
C). 6.626I10`34 Js
D). 6.626I10`25 Js

26. Set - I Set - II [ ]

Set - I	Set - II
i). Helps burning	a). Hydrogen
ii). burning	b). Oxygen
iii). neither burn/ nor helps buring	c). Nitrogen

A). i-b, ii-c, iii-a
B). i-c, ii-a, iii-b
C). i-a, ii-b, iii-c
D). i-b, ii-a, iii-c

27. [ ]

Sub-orbit	No.of.orbitals
s	1
p	X
d	Y
f	7

Values of X,Y are ....
A). 2, 3 B). 5, 3
C). 3, 5 D). 3, 2

28. Which of the following is small in size [ ]
A). Na atom
B). Na+ ion
C). Both are same
D). We cannot say

29.Which of the following is triatomic molecule........ [ ]
A). Carbondioxide B). Acetylene
C). Nitrogen D). oxygen

30. Heating the ore in the absense of oxygen is called.... [ ]
A). Calcination
B). Roasting
C). Smelting
D). Electrification

31. Name of CH3-CH2-CH2-CHO [ ]
A). Butanal
B). Butanol
C). Buranoic acid
D). Propanal

32. What do we know by spraying food color in hot and cold water in beakers [ ]
A). Kinetic energy of molecules decreases on heating
B). Water cools on spraying food colour
C). Kinetic energy of molecules increases on heating
D). Cool water becomes warm on spraying food colour

33. The process of applying zinc layer on iron articles is called [ ]
A). Galvonization
B). Rusting
C). Corrosion
D). Rancidity

★

Part -B (Answers)

14.A	15.C	16.B	17.B
18.C	19.C	20.A	21.A
22.B	23.D	24.D	25.C
26.D	27.C	28.B	29.A
30.A	31.A	32.C	33.D

ఉద్యోగాలు

ఎన్ఐటీ ఉత్తరాఖండ్‌లో 38 పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఉత్తరాఖండ్ (ఎన్ఐటీయూకే).. 38 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: ప్రొఫెసర్/ అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్-38.
వేతనం: ప్రొఫెసర్-రూ.1,59,600, అసోసియేట్ ప్రొఫెసర్-1,39,600, అసిస్టెంట్ ప్రొఫెసర్-1,01,500.
విభాగాలు: ఇంజనీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, సీఎస్ఈ, ఎంఈ, సీఈబీ నాన్ ఇంజనీరింగ్‌లో మ్యాథమెటిక్స్, సోషల్ సైన్సెస్, ఎకనమిక్స్, ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ.
అర్హతలు: సంబంధిత విభాగాలను బట్టి పీహెచ్‌డీతోపాటు నిబంధనల మేర అనుభవం.
ఎంపిక: ఇంటర్వ్యూ.
దరఖాస్తు ఫీజు: రూ.1,000.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 13, 2018.
హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ: మార్చి 20, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: nituk.ac.in

ఏపీ పోస్టల్ సర్కిల్‌లో 245 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌లోని వివిధ పోస్టల్/ ఆర్ఎంఎస్ డివిజన్లలో 245 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

పోస్టు-ఖాళీలు: పోస్ట్‌మ్యాన్-234, మెయిల్ గార్డ్-11.
రీజియన్ల వారీ ఖాళీలు: విజయవాడ-112 (పోస్ట్‌మ్యాన్-106 + మెయిల్ గార్డ్-6), కర్నూలు-62 (పోస్ట్‌మ్యాన్-60 + మెయిల్ గార్డ్-2), విశాఖపట్నం-71 (పోస్ట్‌మ్యాన్-68 + మెయిల్ గార్డ్-3).
వేతనం: రూ.21,700 + ఇతర అలవెన్సులు.
అర్హతలు: పదోతరగతి/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 2018, మార్చి 15 నాటికి 18-27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక: రాతపరీక్ష.
రాతపరీక్ష విధానం: దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో పార్ట్-ఎలో జనరల్ నాలెడ్జ్ నుంచి 25, పార్ట్-బిలో మ్యాథమెటిక్స్ నుంచి 25, పార్ట్-సిలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 25, తెలుగు లాంగ్వేజ్ నుంచి 25 చొప్పున మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో ఉంటాయి. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
రాతపరీక్ష కేంద్రాలు: కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.
దరఖాస్తు ఫీజు: రూ.500 (అప్లికేషన్ ఫీజు-రూ.100 + ఎగ్జామినేషన్ ఫీజు-రూ.400). ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మహిళ అభ్యర్థులకు ఎగ్జామినేషన్ ఫీజు లేదు.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ: మార్చి 15, 2018.
పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: appost.in, www.indiapost.gov.in

టీఎస్ఎన్‌పీడీసీఎల్లో 2,553 ఉద్యోగాలు

వరంగల్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎన్‌పీడీసీఎల్).. 2,553 జేఎల్ఎం ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ లైన్‌మ్యాన్ (జేఎల్ఎం).
వేతన శ్రేణి: రూ.15,585-రూ.25,200.
సర్కిళ్ల వారీ ఖాళీలు: వరంగల్-575, కరీంనగర్-674, ఖమ్మం-365, నిజామాబాద్-500, ఆదిలాబాద్-439.
అర్హతలు: పదోతరగతి/ తత్సమాన విద్యతోపాటు ఎలక్ట్రికల్/ వైర్‌మ్యాన్ ట్రేడ్‌లో ఐటీఐ/ ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో రెండేళ్ల ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 2018, జనవరి 1 నాటికి 18-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల మేర గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఔట్‌సోర్స్ ఉద్యోగుల వయసును.. కాంట్రాక్టులో చేరిన నాటి నుంచి పరిగణనలోకి తీసుకుంటారు.
ఎంపిక: రాతపరీక్ష, పోల్ క్లైంబింగ్.
రాతపరీక్ష విధానం: దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 80 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో సెక్షన్ 'ఎ'లో 65 ప్రశ్నలు సంబంధిత ఐటీఐ ట్రేడ్ నుంచి సెక్షన్ 'బి' లో 15 ప్రశ్నలు జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ నుంచి ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇన్ సర్వీస్ అవుట్ సోర్స్ అభ్యర్థులకు ఆయా కేటగిరీలను బట్టి గరిష్ఠంగా 20 మార్కుల వరకు వెయిటేజీ ఇస్తారు. రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారికి పోల్ క్లైంబింగ్ నిర్వహించిన అనంతరం తుది ఎంపిక ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.220 (అప్లికేషన్ ఫీ-రూ.100 + ఎగ్జామినేషన్ ఫీ-రూ.120), ఎస్సీ/ ఎస్టీ/ బీసీ కేటగిరీలకు ఎగ్జామినేషన్ ఫీజు నుంచి మినహాయింపు ఉంది.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ: మార్చి 19, 2018.
పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: tsnpdcl.cgg.gov.in

ఆర్ఆర్‌బి, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇంధన భద్రత - బొగ్గు



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

భారతదేశ ఇంధన భద్రత ప్రధానంగా బొగ్గుపై ఆధారపడి ఉంది. కీలకమైన భారీ పరిశ్రమాగారాలైన ఉక్కు, సిమెంటు, అల్యూమినియం, విద్యుత్ వంటి పరిశ్రమలు బొగ్గుపైనే ఆధారపడి ఉన్నాయి. వీటితోపాటు ఇటుకలు, సెరామిక్ వంటి చిన్న పరిశ్రమల నుంచి బొగ్గుకు డిమాండ్ పెరుగుతూనే ఉంది. మౌలిక పరిశ్రమలన్నీ బొగ్గు వినియోగం ఆధారంగా రూపుదిద్దుకోవడంతో బొగ్గుకు నానాటికీ డిమాండ్ ఎక్కువవుతూనే ఉంది.

ప్రపంచం మొత్తంమీద కనుగొన్న 850 బిలియన్ల టన్నుల నిల్వలలో 286 బిలియన్ల టన్నులతో ఇండియా ఐదో స్థానంలో ఉన్నప్పటికీ నల్లబంగారం దిగుమతిలో రెండో స్థానంలో ఉండటం గిరాకీ, సరఫరాల మధ్య అంతరాన్ని కళ్లకు కడుతోంది. భారతదేశంలో లభించే బొగ్గును ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరిస్తారు. 1. కోకింగ్ రకపు బొగ్గు 2. నాన్-కోకింగ్ రకపు బొగ్గు. అదే విధంగా కర్బనం శాతాన్ని బట్టి, ఏర్పడిన స్థాయిని బట్టి కూడా బొగ్గును వర్గీకరిస్తారు.

వేల సంవత్సరాల క్రితం భూమిలో కూరుకుపోయిన మొక్కలు, చెట్లు, పొదల శిలాజాల నుంచి బొగ్గు ఏర్పడుతుంది. బ్యాక్టీరియా చర్యలతో ఇవి పీట్ బొగ్గుగా రూపొందుతాయి. ఈ రకమైన జీవరసాయన చర్యలు ముగిసిన అనంతరం భౌమా రసాయన చర్యల వల్ల తదనంతర కాలంలో ఈ రకపు బొగ్గు క్రమేణా లిగ్నైట్, బిట్యుమినస్, ఆంత్రసైట్ రకపు బొగ్గుగా మార్పుచెందుతుంది. పీట రకపు బొగ్గు మలినాలతో ఉండి తక్కువ కర్బన శాతం కలిగి ఉంటుంది. అందువల్ల దీని కెలోరిఫిక్ విలువ కూడా తక్కువగా ఉంటుంది. లిగ్నైట్‌లో 40-60 శాతం బిట్యుమినస్‌లో 60-80 శాతం, ఆంత్రసైట్‌లో 80-90 శాతం కర్బన శాతం కలిగి ఉంటుంది. మిగిలిన పదార్థంతో తేమ, బూడిద, సల్ఫర్ వంటివి ఉంటాయి. వీటిని అధిక ఒత్తిడి, పీడనం కలుగజేయడం ద్వారా తొలగిస్తారు.

బిట్యుమినస్ బొగ్గు ఎంతో కీలకమైనది. ఆక్సిజన్ లేకుండా వేడి చేసినప్పుడు ఇందులో ఉన్న బిట్యుమిన్ కోకింగ్ రకపు బొగ్గుగా మారుతుంది. దీనిని మరింత వేడి చేసినప్పుడు కోక్‌గా మార్పు చెందుతుంది. దీనిని ప్రధానంగా బ్లాస్ట్‌ఫర్నెస్‌లో ముడిఇనుము నుంచి ఇనుప ఖనిజాన్ని సంగ్రహించడానికి వినియోగిస్తారు. అయితే ఈ తరహా బొగ్గు భారతదేశంలో లభ్యత బాగా తక్కువగా ఉంది. 88 శాతం నిల్వలు నాన్-కోకిగ్ తరహాకు చెందినవి కాగా మిగిలిన 12 శాతం నిల్వలలో బూడిద శాతం బాగా ఎక్కువగా ఉంది. భారతదేశంలో లభ్యమయ్యే కోకింగ్ రకపు బొగ్గు తక్కువ నాణ్యత కలిగి ఉంటుంది.

భారతదేశ బొగ్గు నిల్వలు ప్రధానంగా తూర్పు ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నాయి. ఝార్ఖండ్, బీహార్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర, తెలంగాణా రాష్ట్రాలలో బొగ్గు నిల్వలు విస్తరించి ఉన్నాయి. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాలలో తక్కువ మొత్తంలో బొగ్గు నిల్వలు విస్తరించి ఉన్నాయి.

భారతదేశంలో బొగ్గు రంగం ప్రధానంగా కోల్ ఇండియా లిమిటెడ్ గుత్తాధిపత్యంలోనే ఉంది. బొగ్గు గనుల జాతీయీకరణ చట్టం -1973 ప్రకారం కోల్‌ఇండియా ఏర్పడింది. దేశంలో మొత్తం ఉత్పత్తిలో 80 శాతం కోల్ ఇండియా ఉత్పత్తి చేస్తుంది. టాటాస్టీల్ వంటి కొన్ని ప్రయివేటు సంస్థలు తమ సొంత సిమెంటు, ఉక్కు, అల్యూమినియం కర్మాగారాల ముడిసరుకు అవసరాలకు మాత్రమే బొగ్గు నిక్షేపాలను తవ్వుకోవడానికి అనుమతిస్తున్నారు. అవసరానికి మించి అదనంగా తవ్వుకున్న బొగ్గును బహిరంగ మార్కెట్‌లో విక్రయించడానికి అనుమతిలేదు. దీనిని తిరిగి కోల్ ఇండియాకు విక్రయించాల్సిందే.



ఇటీవల కేంద్ర ప్రభుత్వం బొగ్గు క్షేత్రాలకు సంబంధించి కీలకమైన నిర్ణయం వెలువరించింది. దేశ, విదేశ ప్రయివేటు సంస్థలు వాణిజ్య ప్రాతిపదికన బొగ్గు క్షేత్రాలను వేలంలో పాడుకొని స్వేచ్ఛగా విక్రయించుకునే విధానానికి తెరతీసింది. బొగ్గు క్షేత్రాల జాతీయీకరణ జరిగి 45 సంవత్సరాల తర్వాత ఇంధన రంగంలో స్వావలంబన దిశగా తీసుకున్న చర్యగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. దేశంలో అపారంగా బొగ్గు నిల్వలున్నప్పటికీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం కొరవడటం వల్ల పెద్ద మొత్తంలో ఆస్ట్రేలియా, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా వంటి దేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. 2005 నాటికి 4.12 కోట్ల టన్నుల దిగుమతులు ప్రస్తుతం 18 కోట్ల టన్నులకు చేరి కరెంటు ఖాతాలోటును పెంచేస్తున్నాయి. బొగ్గు రంగంలో తీసుకొస్తున్న కొత్త విధానంలో బొగ్గుక్షేత్రాలను వేలంద్వారా కేటాయిస్తారు. టన్ను బొగ్గుకు ఎవరెక్కువ చెల్లిస్తే వారికే గనులు కేటాయించే విధానంలో ఆయా క్షేత్రాలున్న రాష్ట్రాలకే ఆ మొత్తం దక్కుతుంది. రాయల్టీతోపాటు వేలం ద్వారా దక్కే మొత్తంతో సంబంధిత రాష్ట్రాల రెవెన్యూ ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుంది. ఈ మొత్తాన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించడంవల్ల రాష్ట్రాలు ఇతోధికంగా అభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా దేశంలోని తూర్పున రాష్ట్రాలు ఈ విధానం వల్ల బాగా లబ్ధిపొందనున్నాయి.

వాణిజ్య పద్ధతిలో బొగ్గు వెలికితీత వల్ల దేశ, విదేశీ ప్రయివేటు పెట్టుబడులు ఈ రంగంలో పెరగనున్నాయి. పెట్టుబడులతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల సామర్థ్యం, ఉత్పత్తి పెరగనుంది. 2022 నాటికి నూరుకోట్ల టన్నుల బొగ్గు ఉత్పాదన లక్ష్యసాధనకు ఈ విధానం ఊతమిస్తుంది. భారీ కర్మాగారాలకు ఇంధన భద్రతతోపాటు లక్షల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి సృష్టి సాధ్యపడుతుంది. దేశంలో వినియోగించే విద్యుత్తులో 70 శాతం తాప విద్యుత్ కేంద్రాల ద్వారానే ఉత్పత్తి అవుతుంది. కొత్త విధానం వల్ల వినియోగదారునికి చౌకగా విద్యుత్ లభించే అవకాశం ఏర్పడుతుంది. ★

రైస్‌మిల్లుపై విజిలెన్స్ దాడి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలంలోని దువ్వలోని విజయలక్ష్మి రైస్‌మిల్లుపై ఆదివారం దాడులు నిర్వహించారు. రైస్‌మిల్లు ఆవరణలో 48 బస్తాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. అదే విధంగా మిల్లు నిర్వహణ, బియ్యం నిల్వల్లో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తనిఖీలు కొనసాగాయి. అనంతరం రైస్‌మిల్లు యజమాని రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సిఐ వివి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో అధికారులు జయప్రసాద్, కె.సీతారాం, అశోక్ వర్మ, శివ కుమార్ పాల్గొన్నారు.



అనంతపురం జిల్లాలలో ఐద్వా ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రాంగోపాల్‌వర్మను తక్షణమే అరెస్టు చేయాలి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం సిటీ

నేడు మహిళలపై జరుగుతున్న అసభ్య ప్రచారానికి పరాకాష్టగా నిలిచిన సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మను తక్షణమే అరెస్టు చేయాలని ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్‌ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన దినాన్ని పాటించారు. ఈ సందర్భంగా విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనరు ఎ.రాజమోహన్, ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ.. జిఎస్‌టి అనే పేరుతో పోర్న్ సినిమాను తీసిన రాంగోపాల్ వర్మను అరెస్టు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశ చట్టాల ప్రకారం పోర్న్ సినిమాను నిర్మించరాదన్నారు. అయినా రాంగోపాల్ వర్మ జిఎస్‌టి సినిమాను నిర్మించడమే గాక టివి చర్చల్లో మహిళా సంఘాల నాయకుల పట్ల అసభ్యకరంగా, అవమానకరంగా మాట్లాడారన్నారు. దీనిపై తెలంగాణాలోనూ, అలాగే విశాఖపట్నంలోనూ కేసులు నమోదయి వారాలు గడుస్తున్నా పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఇలాంటి అశ్లీలతను అరికట్టేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు రామాంజినమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, నూరుల్లా, సంతోష్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-నందిగామ



కృష్ణాజిల్లా నందిగామలోని తేజ డివిఆర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వేముల త్రివేణి (16) ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. బిసి కాలనీలో నివాసం ఉంటున్న త్రివేణి గత కొంత కాలంగా చదువులో వెనుకబడి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందింది. ఆమె శవాన్ని పంచనామా కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊట్లబందలో మరో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి - మారేడుమిల్లి (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా వై.రామవరం మండలం కానివాడ పంచాయతీలోని ఊట్లబందకు చెందిన గిరిజనుడు సాదల కర్రిరెడ్డి (85) విషజ్వరంతో ఆదివారం మతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. వై.రామవరం మండలంలోని ఊట్లబంద, గొప్పులతోట మామిడి, పెదమళ్ల గ్రామాల్లో సుమారు 300 మందికిపైగా విషజ్వరాలతో బాధపడుతున్నారు. నెల రోజులుగా విషజ్వరాలతో గిరిజనులు మృత్యువాతపడుతున్నారు. ఈనేపథ్యంలో శనివారం కానివాడ పంచాయతీలో రంపచోడవరం ఎంఎల్ఎ రాజేశ్వరి, వైద్యశాఖాధికారులు పర్యటించారు. మృతి చెందిన ఎనిమిది కుటుంబాలను కలిశారు. ఆయా గ్రామాల్లో మూడు వైద్య బందాలతో పర్యటించారు. రోగులను గుర్తించి వారిలో 11 మందిని మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే గ్రామంలోని సాదల కర్రిరెడ్డి మృతి చెందడంతో ఈ సంఖ్య తొమ్మిదికి చేరింది. దీంతో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు.

కలుషిత నీరు తాగి ఏడుగురికి అస్వస్థత

గుంటూరు : గుంటూరు జిల్లా సంగడిగుంటలో కలుషిత నీరు తాగి పలువురికి అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన ఏడుగురు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం ఇచ్చినా నగర పాలక సంస్థ అధికారులు స్పందించలేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. నవ్‌జోత్‌కౌర్
2. హర్మన్‌ప్రీత్ కౌర్
3. దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్
4. 5 యూనివర్సిటీలు
5. 5వ స్థానంలో

హోదా కోసం భిక్షాటన

వామపక్షాలు, వైసిపి ఆధ్వర్యంలో కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి యంత్రాంగం

ప్రత్యేక హోదా పోరు తీవ్రతరమైంది. వివిధ పార్టీల నాయకులు, ప్రత్యేక హోదా కార్యాచరణ సమితి నాయకులు, నాన్ పొలిటికల్లో జేసీ నాయకుల్లో ఇప్పటికే న్యూఢిల్లీకి చేరుకోగా, మరికొందరు ప్రయాణంలో ఉన్నారు. స్థానికంగా ఉన్న మరికొందరు వివిధ రూపాల్లో ఆదివారం కూడా ఆందోళనలు చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో వివిధ చోట్ల రిలేదీక్షలు కొనసాగాయి. అనంతపురంలో సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి నాగేంద్రకుమార్, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సిపిఐ ఎంఎల్ నాయకులు నాగరాజు, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వీరనారప్పలు పాల్గొన్నారు. నెల్లూరులో గాంధీ బొమ్మ వద్ద చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రత్యేక హోదాను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం నష్టపోయే పరిస్థితి ఉన్నందున పార్టీలకతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు, ఏఐటియుసి నగర కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో సామూహిక నిరసన దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలనుద్దేశించి ఎంఎల్‌సి యండపల్లి. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విభజన హామీల అమలుకు ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలో ఉన్న అన్ని హామీలనూ బిజెపి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.కుమార్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి రామనాయుడు తదితరులు పాల్గొన్నారు. కర్నూలులో వామపక్షాలు, వైసిపిలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. విజయనగరం జిల్లా రామభద్రా పురం,, బొబ్బిలిలో చేపట్టిన దీక్షల్లో సిపిఎం, సిపిఐ, వైసిపి నాయకులు పాల్గొన్నారు. లక్కవరపుకోటలోని అంబేద్కర్ జంక్షన్లో సిపిఎం



అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రత్యేక హోదాకోసం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో భిక్షాటన చేసి నిరసన తెలుపుతున్న నాయకులు

ఆధ్వర్యాన నిరసన దీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ కొనసా గాయి. విశాఖ జిల్లాలోని చీడికాడ, కె.కోటపాడు, రావికమ తం మండల కేంద్రాల్లో సిసిఎం ఆధ్వర్యాన నిరసన దీక్షలు చేపట్టారు. దేవరాపల్లిలో చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలపగా, కొత్తకోటలో కొవ్వొత్తుల ర్యాలీ, మాడుగులలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. విజయవాడలో మిర్యాల వెంకట్రావ్ సామాజిక న్యాయ అధ్యయన కేంద్రం ఆధ్వర్య ంలో కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు వై.శ్రీనివాసరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బహుజన దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో పోడూరు, తణుకు, నరసాపురం తదితర ప్రాంతాల్లో రిలేదీక్షలు కొనసాగాయి. పెదపాడు బండ్ల తూము సెంటర్‌లో రాస్తారోకో, పెంటపాడులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరులో అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక వసంతమహల్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. విభజన చట్టం హామీలను అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని పొట్టి శ్రీరాములు విగ్రహానికి అందించారు. నరసాపురంలో టిడిపి సోషల్ మీడియా వింగ్ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు.

21 నుంచి పార్లమెంట్ ఎదుట మహా ధర్నాలు



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి
- బిజెపి పాలనలో 40వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు
- ఆలిండియా కిసాన్ సంఘ్ కో-ఆర్డినేషన్ కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలో రైతు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకూ పార్లమెంట్ ఎదుట మహాధర్నాలు నిర్వహించనున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు తెలిపారు. ఆలిండియా కిసాన్ సంఘ్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కొరటాల మీటింగ్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముసునూరు రమేష్ అధ్యక్షత వహించారు. కేశవరావు మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర, రుణ విముక్తి, భూసేకరణ, ఆత్మహత్యల నివారణకు పార్లమెంట్‌లో చర్చించి చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా బిజెపి అధికారంలోకి వచ్చాక సుమారు 40 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు హామీని అటకెక్కించారని విమర్శించారు. దీనిపై జిల్లా, మండల కేంద్రాల్లో కో-ఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక సమస్యలపై పని చేయాలని సూచించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయాలన్నారు. ఎన్నికల హామీ మేరకు పూర్తి రుణమాఫీకి సరిపడా నిధులు రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని, మిర్చి, అపరాలు తదితర పంటలను మద్దతు ధరకు తగ్గకుండా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ 2011 కౌలు రైతుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, కౌల్దార్లకు గుర్తింపు కార్డులు, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై అన్ని రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు వై.రాధాకృష్ణ, కె.అజయ్ కుమార్, రైతు కూలీ సంఘం నాయకులు మల్లిక్, వైసిపి రైతు విభాగం కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఆలిండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తూమాటి శివయ్య, ఆప్ నాయకులు శ్రీనివాసరెడ్డి, రైతు రక్షణ వేదిక నాయకులు కాటా సాంబశివరావు, బైరగాని శ్రీనివాసరావు, ఎన్.కాళిదాసు పాల్గొన్నారు.

చివరి బడ్జెట్‌లోనూ రిక్తహస్తమే

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ, విజయనగరం సిటీ

ప్రత్యేక హోదా అంశం రాజకీయ పార్టీల ఎన్నికల అజెండాగా మారిందని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. 'ప్రత్యేక హోదా-విభజన చట్టం హామీల అమలు' అనే అంశంపై శ్రీకాకుళంలోనూ, విజయనగరంలోనూ ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి రిక్తహస్తం చూపిందన్నారు. విభజన చట్టంలోని షెడ్యూల్-13లో పేర్కొన్న ఒక్క హామీ కూడా కార్యరూపం దాల్చలేదన్నారు. పార్లమెంట్‌లో చేసిన విభజన చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం, అమలు చేయించుకునేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని విమర్శించారు. ప్రత్యేక హోదా అమలుకు రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదాకు అడ్డు చెప్పలేదని ఇది వరకే చైర్మన్, సభ్యులు ప్రకటించారని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాల అమలుకు పార్టీలు, సంఘాలకతీతంగా ఒకే వేదిక నుంచి పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సుకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసు, విజయనగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.శివవర్మ అధ్యక్షత వహించారు.

ఉపాధి హామీ పనులు, పెండింగ్ బిల్లుల కోసం 21న చలో అసెంబ్లీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధిహామీ పనులు, పెండింగ్ బిల్లులు, చట్టం రక్షించుకోవడానికై ఈ నెల 21న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టిన్నట్లు ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు వెల్లడించాయి. ఈ మేరకు ఏపి వ్యవసాయ కార్మిక సంఘం(ఎఐఎడబ్ల్యూయు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు,దాసరి భవన్) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవుల శేఖర్, జెల్లివిల్సన్ ఆదివారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. కూలీలకు ఉన్న ఊరిలో పనికల్పించి వలసలు నివారించడానికి వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి, టిడిపి ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కూలీల కోసం వచ్చిన నిధులను నీరుచెట్టు, సిమెంట్‌రోడ్లు, పక్కగృహాలు, ప్రభుత్వ భవనాలు, ఆటస్థలాలు, చివరకు విలాసవంతమైన కార్డు కొనుగోలుకు నిధులను మళ్ళించి పేదల పొట్టగొడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిగ్రామంలో వెంటనే పని కల్పించాలని, 100 రోజులు దాటిన ప్రతి కుటుంబానికి 200 రోజుల పని, రోజు కూలీ రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసిన పనికి ప్లేసిఫ్‌లు ఇవ్వాలని, పోస్టాఫీస్‌ల ద్వారా వారంలోపు బిల్లులు చెల్లించాలని, పాత బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. రెండు పూటల పని ఆలోచన విరమించాలని, పని ప్రదేశాల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రసూతి మహిళలకు 90 రోజులు పని దినాలకు ఉచితంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. ఒంటరి, వృద్ధాప్య మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి పని ఇవ్వాలని తెలిపారు. ఉపాధి మేట్లకు గుర్తింపు కార్డు ఇచ్చి రూ.5ల పారితోషికం ఇవ్వాలని కోరారు. ఉపాధి నిధులను సిమెంట్ రోడ్లకు, భవనాలకు, స్టేడియాల, గోడౌన్‌లకు మళ్ళించొద్దని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, దళిత, గిరిజనుల భూములు అభివృద్ధి చేయాలని కోరారు. చెరువులు, కుంటలు, పంటకాలువలు, భూగర్భ జలాలు పెరిగే అన్ని రకాల మట్టిపనులు, మట్టిరోడ్లు చేయించాలని డిమాండ్ చేశారు. యంత్రాలను నిషేధించాలని, అందరికి పనిముట్లు, టెంట్, మెడికల్ కిట్ ఇవ్వాలని, ప్రమాదాల్లో చనిపోయిన వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

కళలే మన సిరిసంపదలు : శివారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్



కళలను, కళాకారులను ప్రోత్సహించినపుడే మనజాతికి కళాసంపద సిరిసంపదలా నిలిచిపోతుందని, కళాకారులు సమాజాన్ని చాలా ప్రభావితం చేస్తారని ప్రముఖ సినీ నటులు, కమెడియన్ శివారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కర్నూలులో జరుగుతున్న ది ఇండియన్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ షో -2018 వేడుకలు రెండవరోజు సాయంత్రం మున్సిపల్ అవుట్‌డోర్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. భారతీయ సాంప్రదాయాలను, సాంస్కృతిక వైభవాన్ని, చారిత్రిక కళాసంపదను ప్రదర్శిస్తూ సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు వేలాది మందిప్రేక్షకుల కేరింతల నడుమ ఆనందోత్సాహాల సందడితో కళాకారులు తమ కళలను అద్భుతంగా ప్రదర్శించారు. జానపద నృత్యాలు, పాశ్చాత్య నృత్యాలు, సంప్రదాయ నృత్యాలను అత్యంత వైభవంగా ప్రదర్శించారు. రెండవరోజు జరిగిన ఈ సాంస్కృతిక పండుగకు కమెడియన్ శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మిమిక్రీతో సందడి చేశారు. ప్రముఖ సినీ నటుల స్వరాలను, రాజకీయనాయకుల స్వరాలను తనదైన శైలిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా తన కళానైపుణ్యాన్ని ప్రదర్శస్తూనే శివారెడ్డి వివిధ సందర్భాల్లో మాట్లడుతూ అన్నం లేని నాకు కళ కడుపునింపిందని, ప్రేక్షకులు ఆశీస్సులు, ఆదరాభిమానాల వల్లే ఇంతటి వాడినయ్యానని అన్నారు. కళాకారులను ప్రోత్సహించినపుడే రెట్టించిన ఉత్సాహంతో వారి వారి కళలను ప్రదర్శించి కళకు జీవం పోస్తారని అన్నారు.

పాదయాత్ర

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని

ఉద్యోగుల పాదయాత్ర, అర్ధనగ్న ప్రదర్శన

అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ ఉద్యోగులు తలపెట్టిన 'మహా పాదయాత్ర'లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాదయాత్ర ద్వారా నిరసన తెలుపుతున్న ఉద్యోగులపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడి అరెస్ట్ చేయడంపై ఉద్యోగులు మండిపడ్డారు. ఆదివారం పాదయాత్ర పటమట ఎన్‌టిఆర్ సర్కిల్ వద్దకు చేరుకుని ఉద్యోగ విరమణ తరువాత సిపిఎస్ ఉద్యోగి జీవితాలు ఎలా రోడ్డున పడతాయో చూపిస్తూ బిక్షాటన, అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. చట్ట సభల్లో సిపిఎస్ రద్దుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తేటతెల్లం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుండగా రంగంలోకి దిగిన పోలీసులు ఉద్యోగుల ప్రదర్శనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులను బలవంతంగా జీపుల్లో ఎక్కించుకుని కమిషనరేట్ పరిధిలోని వివిధ స్టేషన్లకు తరలించారు. తమ సమస్యలను ప్రభుత్వానికి వివరించేందుకు అసెంబ్లీ వద్దకు పాదయాత్ర చేపట్టామని, ప్రభుత్వం తమ పట్ల కఠినంగా వ్యవహరించడం శోచనీయమని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పేటేటి సత్యనారాయణ, సంఘం కార్యదర్శి ముప్పాళ్ళ శ్రీనివాసరావు పేర్కొన్నారు.



విద్యుత్ కార్మికుల దీక్షలకు పెరిగిన సంఘీభావం

13వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరింది. పలు సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి. రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక దీక్షలు, నిరసనలు వివిధ రూపాల్లో ఉధృత రూపం దాల్చినా పాలకులు స్పందించడం లేదు. విజయనగరం కలెక్టరేట్ వద్ద నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షల్లో కూర్చున్న తాడ్డి నాగేంద్ర, జిఎస్ కృష్ణారావు, పి.నాగేశ్వరరావుకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం. ఉమామహేశ్వరి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శేషగిరి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.అప్పలసూరి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. కార్మికుల పోరాటానికి సిపిఎం, యుటిఎఫ్, ఎస్‌ఎఫ్ఐ, అంగన్ వాడీ యూనియన్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్లు మద్దతు తెలిపాయి. శ్రీకాకుళం జిల్లాలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె కొనసాగింది. తూర్పు గోదావరి జిల్లాలో విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరింది. కాకినాడ కలెక్టరేట్ సమ్మెలో భాగంగా కార్మికులు నిరవధిక దీక్షలకు దిగారు. ఈ సమ్మె శిబిరాన్ని వామపక్షాలు, కార్మిక సంఘాలు సందర్శించి మద్దతు తెలిపాయి.



కడప జిల్లా రైల్వే కోడూరులో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు

రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద, రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు సబ్ స్టేషన్ వద్ద సమ్మె శిబిరాలు కొనసాగుతున్నాయి. మోతుగూడెం ఎపి జెన్‌కో ముఖ్యఇంజినీర్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరాయి. పశ్చిమగోదావరి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కార్మికులు కలెక్టరేట్ వద్ద ధర్నా శిబిరం నుంచి నేరుగా జెడ్‌పి ప్రధాన ద్వారం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం జెడ్‌పి ప్రాంగణంలో జాతీయ నాయకుల విగ్రహాలకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ప్రభుత్వం తమ పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తుందని, పాలకులకు కనువిప్పు కల్గించాలంటూ కార్మికులు నినదించారు. కర్నూలు జిల్లాలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల 13 రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్నారు. మూడ్రోజులుగా ట్రాన్స్‌కో కార్యాలయాల ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షలు మూడో రోజుకు చేరాయి.

సమస్యలపై అసెంబ్లీ ప్రస్తావిస్తా : సుజయ్ కృష్ణ

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకటరావుతో మాట్లాడుతానన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు మంత్రి సుజయ్‌కృష్ణను విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం తారాపురంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల జెఎసి నాయకులు మాట్లాడారు.

87 కోట్ల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం

న్యూఢిల్లీ: ఆధార్ అనుసంధానం గడువు ఈ నెల 31న ముగుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్త మయ్యారు. దాదాపు 80శాతం బ్యాంక్ ఖాతాలకు, 60శాతం మొబైల్ కనెక్షన్‌లకు ఆధార్‌ను అనుసంధానించినట్టు యూఐడీఏఐ సీనియర్ అధికారి వెల్లడించారు. 12 అంకెల ఆధార్‌ను బ్యాంకు అకౌంట్లు, పాన్ కార్డు, మొబైల్ సిమ్‌కార్డులతో ఆధార్‌ను ఈ నెల 31లోపు తప్పనిసరిగా అనుసంధానించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. మొత్తం 109.9కోట్ల బ్యాంక్ అకౌంట్లకుగాను 87కోట్ల అకౌంట్లకు ఆధార్ అనుసంధానం పూర్తయిందని యూఐడీఏఐ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

సంఘ్ పరివార్ హింసాకాండపై ఫిర్యాదు

త్రిపురలో ఎన్నికల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం కార్యకర్తలపైనా, కార్యాలయాలపైనా సంఘ్ పరివార్, బిజెపి గూండాలు విజయోన్మాదంతో రెచ్చిపోయి చేస్తున్న హింసాత్మక దాడులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర డిజిపికి సిపిఎం నాయకులు ఫిర్యాదు చేశారు. సిపిఎం ఎంపీ శంకర్ ప్రసాద్ దత్తా నేతృత్వంలోని బృందం డిజిపిని పోలీసు ప్రధానకార్యలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.



నివాళి

త్రిపురలో ఇటీవల మరణించిన సిపిఎం సీనియర్ నాయకులు, మత్స్యశాఖ మంత్రి ఖగేంద్ర జమాతియాకు ఆదివారం అగర్తలలోని సిపిఎం రాష్ట్ర కార్యలయంలో నివాళు లర్పిస్తున్న ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు విప్లవ్ కుమార్ దేవ్ కూడా జమాతియాకు నివాళులర్పించారు.



మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి వియత్నాం మద్దతు



న్యూఢిల్లీ : ఆసియా, పసిఫిక్ ఆర్థిక సహకారం (అపెక్)తో సహ ప్రాంతీయ అనుసంధానాలలోనూ, సహకార యంత్రాంగాలలోనూ భారత్ పోషిస్తున్న క్రియాశీల భాగస్వామ్యానికి వియత్నాం మద్దతిస్తోందని ఆ దేశ అధ్యక్షుడు ట్రాన్ డయ్ క్వాంగ్ ఆదివారం తెలిపారు. అంతేకాకుండా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో (యుఎన్‌ఎస్‌సి) భారత్ శాశ్వత సభ్యత్వానికి కూడా మద్దతివ్వనున్నట్లు క్వాంగ్ తెలిపారు. ఇక్కడ తీన్‌మూర్తి భవన్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ భారతదేశ 'యాక్ట్ ఈస్ట్' పాలసీ ఆగ్నేయాసియా దేశాల అసోసియేషన్ (ఏసియన్) చుట్టూ రూపు దిద్దుకున్నదేనని గత ఏడాది నవంబరులో జరిగిన ఏసియన్ - ఇండియా సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను క్వాంగ్ అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్ ప్రథమ ప్రాధాన్యత వియత్నాంకేనని ప్రధాన మంత్రి మోడీ చెప్పారని, అదేవిధంగా వియత్నాం విదేశీ విధానం నుంచి చూస్తే అత్యంత ప్రాధాన్యత కలిగిన భాగస్వామ్య దేశాలలో భారత్ ఒకటని ఆయన చెప్పారు. అంతకుముందు ఆదివారం ఉదయం మాజీ కాంగ్రెస్ అద్యక్షురాలు సోనియాగాంధీ, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ తదితరులతో క్వాంగ్ సమావేశమయ్యారు. క్వాంగ్ శనివారం రాష్ట్రపతి భవన్ వద్ద రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ అయ్యారు.

ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో త్రిముఖ పోటీ



లక్నో : ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫుల్పూర్ పార్లమెంటరీ నియోజక వర్గాలకు మరో వారం రోజుల్లో ఉప ఎన్నికలు జరగనున్న తరుణంలో రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఈ రెండు నియోజక వర్గాలపై దృష్టి పెట్టాయి. ఈ ఎన్నికలను 2019లో జరగబోయే సాధారణ ఎన్నికలకు రిహార్సల్స్‌గా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు పరిగణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో గెలుపు సాధించేందుకు రాష్ట్ర రాజకీయ పార్టీలు తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఉత్తర ప్రదేశ్ శాసన మండలికి ఎన్నికైన క్రమంలో రెండు నియోజక వర్గాలకు ఖాళీ ఏర్పడింది. దీంతో ఉప ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. గోరఖ్‌పూర్ బిజెపికి అత్యంత ప్రాధాన్యత కలిగిన నియోజకవర్గంగా మారింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నియోజక వర్గం కావడమే ఇందుకు కారణం. ఫల్పూర్ నియోజక వర్గం ఒకప్పుడు కాంగ్రెస్‌కు అత్యంత ప్రాధాన్యత గల నియోజకవర్గంగా నిలిచింది. దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఈ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థానంఓ తొలిసారిగా బిజెపి గెలుపొందింది. కేశవ్ ప్రసాద్ మౌర్య గెలుచుకున్నారు. రాష్ట్రంలో జరిగే ఉప ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. బిజెపి, సమాజ్‌వాది పార్టీ, కాంగ్రెస్‌ల మధ్య ఈ పోటీ నెలకొంది.గోరఖ్‌పూర్‌లో ఉపేంద్ర దత్ శుక్లా, ఫల్పూర్‌లో కౌసలేంద్ర సింగ్‌లను సమాజ్‌వాది పార్టీ అభ్యర్థులపై బిజెపి పోటీలో ఉంచింది. ఫల్పూర్‌లో ప్రవీణ్ నిషాద్, గోరఖ్‌పూర్‌లోని నరేంద్ర ప్రతాప్ సింగ్ పటేల్‌ను ఎస్‌పి పోటీలో ఉంచింది. కాగా గోరఖ్‌పూర్ నియోజక వర్గం నుంచి సురీత కరీమ్‌ను కాంగ్రెస్ పోటీలో ఉంచింది. ఫల్పూర్ నియోజకవ వర్గం నుంచి మనీష్ మిశ్రాను పోటీలో ఉంచింది.

ప్రతిష్టంభన తప్పదా?

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేసింది. వీటిలో మహిళ రిజర్వేషన్ బిల్లు లేకపోవడం గమనార్హం. ఆ బిల్లును కూడా ఈ సమావేశాల్లోనే పెట్టాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నీరవ్‌మోడీ, రఫెల్ కుంభకోణాలపై చర్చకు పట్టుపట్టాలని నిర్ణయించింది. ఆ పార్టీ వ్యూహ సమావేశంలో ఈ మేరకు కసరత్తు పూర్తి చేశారు. వీటితో పాటు ఎస్ఎస్‌సి-సిజిఎల్ పేపర్ లీకేజీ, సిబిఐ న్యాయమూర్తి లోహియా అనుమానాస్పద మృతి తదితర అంశాలను కూడా ప్రస్తావించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఎంపిలు ప్రత్యేకహోదా సాధనకోసం ఆందోళనను తాజా సమావేశాల్లోనూ కొనసాగించనున్నారు. అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడానికి వైఎస్‌ఆర్‌సిపి సిద్ధమౌతోంది. గట్టిగా పోరాడాలన్న తమ అధినేత చంద్రబాబునాయుడి సూచనతో టిడిపి ఎంపీలు కూడా ప్రత్యేకహోదాపై పెద్దఎత్తున ఆందోళనకు కసరత్తు చేస్తున్నారు. మొదటిరోజు నుండే రాష్ట్ర ఎంపీలు గళం విప్పితే పార్లమెంటులోని మిగిలిన పార్టీలు ఎలా స్పందిస్తాయో చూడాల్సిఉంది. నిరుద్యోగం, దళితులపై దాడులు, రైతాంగ సంక్షోభం తదితర అంశాపై చర్చకు వామపక్షాలు పట్టుపట్టనున్నాయి. శీతాకాల సమావేశాల్లో లోక్‌సభలో ఆమోదం పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభలో ఆమోదానికి నోచుకోలేదు. బిల్లులో కొన్ని అంశాలను ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. బిల్లును సెలెక్టు కమిటీకి పంపించాలని డిమాండ్ చేశాయి. దీంతో రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందకుండానే గత శీతాకాల సమావేశాలు ముగిశాయి. ఆ బిల్లుకు బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం పొందేలా చూడడానికి ప్రభుత్వం యోచిస్తోంది. ఏకాభిప్రాయ సాధనకు యత్నిస్తామని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు బిసి కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించే బిల్లును కూడా ఈ సమావేశాల్లోనే ఆమోదించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బిల్లు ఇంకా లోక్‌సభలోనే ఆమోదం పొందలేదు. వీటితో పాటు ఎఫ్ఆర్డీఐ బిల్లును కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు యోచిస్తోంది. ఈ బిల్లును ప్రతిపక్షాలు పూర్తి స్థాయిలో వ్యతిరేకిస్తోన్నాయి. సమాన్య మధ్యతరగతి ఖాతాదారులకు నష్టం చేకూరేలా ఈ బిల్లు ఉందని సిపిఎంతో పాటు ఇతర పక్షాలు ప్రకటించాయి.

నిరుద్యోగంపై చర్చకు సిపిఎం పట్టు

దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్ బడ్జెట్ రెండో విడుత సమావేశాల్లో చర్చించాలని సిపిఎం డిమాండ్ చేసింది. దేశంలో నిరుద్యోగం ఎక్కువైందని, చదుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తోన్న యువత ఎక్కువైయ్యారని గుర్తు చేసింది. మోడీ 2014 ఎన్నికల్లో ఏడాదికి కోటి ఉద్యోగాలు ప్రకటిస్తామని యువతకిచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేసింది. నిరుద్యోగ సమస్యపై ఈ సమావేశాల్లో చర్చించాలని, అందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేసింది. దేశంలో రైతాంగం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతుందని, వ్యవసాయ రంగం సంక్షోభం, రైతులు ఎదుర్కుంటున్న సమస్యలు, వ్యవసాయ సంక్షోభాన్ని నివారించేందుకు పార్లమెంట్‌లో చర్చ పెట్టాలని డిమాండ్ చేసింది. న్యాయ వ్యవస్థలో వచ్చిన ప్రకంపనలపై కూడా చర్చించాల్సిన అవసరముందని ప్రభుత్వానికి సూచించింది. దళిత, మైనార్టీలపై పెరిగిన దాడులు, కోరిగావ్‌లో దళితులపై జరిగిన దాడి వంటి అంశాలపై చర్చ జరగాలని డిమాండ్ చేసింది. జమ్ము కాశ్మీర్, దేశంలో ఇతర ప్రాంతాల్లో శాంతి భద్రతలు క్షీణించాయని, ప్రజలకు రక్షణ కరువైందని సిపిఎం తెలిపింది. దేశంలో క్షీణించిన శాంతి భద్రతలపై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేసింది. అంతేకాకుండా మోడీ సర్కార్ అవినీతి రహిత భారత్‌ను నిర్మిస్తానని ఓట్లు దండుకున్నారని, మోడీ గద్దెనెక్కిన తరువాత కోట్ల రూపాయాలు దోచుకోని విదేశాలకు పారిపోతున్న వారి సంఖ్య పెరిగిందని విమర్శించింది.

రూ.516 కోట్ల మొండి బాకీల మాఫీ

- కార్పొరేట్ రుణ ఎగవేతదారులకు సర్కార్ బొనాంజా
- ప్రభుత్వ రంగ బ్యాంకుల నడ్డి విరుస్తున్న నిరర్థక ఆస్తులు
- తొలి స్థానంలో ఎస్‌బిఐ, రెండో స్థానంలో పిఎన్‌బి



న్యూఢిల్లీ : కార్పొరేట్ రుణ ఎగవేతదారులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బొనాంజా ప్రకటిం చింది. ఉద్దేశపూర్వంగా రుణాలు ఎగవేయడంతో నిరర్థక ఆస్తులుగా మారిన ఖాతాలను ప్రభుత్వ బ్యాంకులు రద్దు చేశాయి. 2017-18 ఆర్థిక సంవత్సరం తొలి అర్థ భాగంలో 38 ఖాతాలకు గాను రూ.516 కోట్లు మొండి బాకీలను రైట్ ఆఫ్ అనే ముద్దుపేరుతో బ్యాంకులు మాఫీ చేసేశాయి. ఈ వివరాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ గణాంకాలు వెల్లడించాయి. బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో రుణాలు తీసుకొని వాటిని ఉద్దేశ్యపూర్వ కంగా ఎగ్గొట్టిన బాగోతాలు హెచ్చుమీరుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్దేశపూర్వ కంగా ఎగవేతకు పాల్పడిన దాదాపు 38 రుణ ఖాతాలు బ్యాంకు పుస్తకాలలో రద్దు చేసి కనిపించా యని మంత్రిత్వ శాఖ తెలిపింది. 2017-2018 సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో రుణాల రద్దు జరిగినట్లు వెల్లడించింది. ఎక్కువ మొత్తాలలో చెల్లించాల్సిన అత్యధిక రుణాలను బ్యాంకులు రద్దు చేసినట్లు సీనియర్ బ్యాంకు అధికారి ఒకరు తెలిపారు. బ్యాంకింగ్ పరిభాషలో రద్దు చేయడమంటే ఎగవేతకు గురైన రుణాలను నూటికి నూరు శాతం బ్యాంకు సంపాదించిన దాని నుంచి చెల్లించడమేనని ఆ అధికారి తెలిపారు. దీని వల్ల నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ) బ్యాంకు బాలెన్స్ షీటులో దీర్ఘకాలం కనిపించవు. ఏదైనా ఒక రుణాన్ని రద్దు చేస్తే దాని నిర్వహణ లాభం తగ్గి బ్యాంకు బాలెన్స్ షీట్‌పై భారం పడుతోంది. ఉద్దేశ పూర్వకంగా ఎగ్గొట్టే రుణాల వసూలు చాలా ఇబ్బందిగా ఉండటం వల్ల, భవిష్యత్‌లో వాటిని తిరిగి ఇచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుం దని ఆ అధికారి తెలిపారు. ఏ ఉద్దేశంతో రుణాన్ని తీసుకున్నాడో దాని కోసం ఆ మొత్తాన్ని ఉపయోగించక పోయినా, రుణాన్ని తిరిగి చెల్లిం చక పోయినా, రుణాన్ని ఇతరత్రా వినియోగానికి తరలించినా, రుణాలు తీసుకునేందుకు హామీగా ఉంచిన ఆస్తులను బ్యాంకుకు తెలియకుండా అమ్ముకున్నా అటువంటి వ్యక్తి ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారు అవుతాడు.

రుణ ఎగవేత దారులపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించడమే కాకుండా, వారికి హామీ ఉన్న వారిపై కూడా చర్యలు తీసుకుంటామని, బకాయిలు రికవరీ చేసేందుకు సంబంధిత ఆస్తులను వేగంగా జప్తు చేయాలని 2015లోనే రిజర్వు బ్యాంకు అన్ని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. అవసరమైతే రుణాలు ఇచ్చిన వారు ఉద్దేశపూర్వక ఎగవేత దారులపై నేర చర్యలకు కూడా ఉపక్రమించ వచ్చు. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులలో మార్చి 2017 నాటికి ఉద్దేశపూ ర్వకంగా ఎగవేసిన రుణాలు మొత్తంలో దాదాపు 27 శాతం రుణాలు భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బిఐ) పరిధిలోనే ఉన్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి.

మార్చి 31, 2017 నాటికి దాదాపు 1,762 మంది ఉద్దేశపూర్వక రుణ ఎగవేత దారులు రూ.25,104 కోట్ల రుణాలను ఎస్‌బిఐకి ఎగవేశారు. దీంతో దాని బాలెన్స్ షీట్‌పై భారం పడింది.

తరువాత స్థానంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) ఉంది. దాదాపు 1,120 మంది ఉద్దేశపూర్వ ఎగవేత దారులు రూ.12,278 కోట్ల రుణాలను ఎగవేయడంతో నిరర్థక ఆస్తుల సంఖ్య పెరిగింది.

ఈ రెండు బ్యాంకుల మొత్తం కలిపి రూ.37, 382 కోట్లు అంటే 40 శాతం ఉద్దేశపూర్వక ఎగవేత రుణాలను కలిగి ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు అన్నిటిలోనూ దాదాపు 8,915 మంది ఉద్దేశపూర్వక రుణ ఎగవేత దారులు రూ.92,376 కోట్ల రుణాలు ఎగవేసినట్లు ఆ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి

- తెలంగాణ సిఎం కెసిఆర్ వెల్లడి
- 70 ఏళ్లలో ఆ రెండు పార్టీలు చేసిందేమిటి?
- పిట్ట బెదిరింపులకు భయపడను
- 'ప్రజాశక్తి'ని ఏకం కానీయడం లేదు
- కెసిఆర్‌కు మమత ఫోన్



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

దేశ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ రాజకీయ కూటమిని ఏర్పాటు చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వెల్లడించారు. జాతీయ రాజకీయాల్లో మార్పు రావాల్సిన అవసరముందని, ఆ మార్పు తెలంగాణ నుంచే మొదలవుతుందన్నారు. థర్డ్‌ఫ్రంట్‌పై శనివారం కెసిఆర్ సూచనప్రాయంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌కు పెద్దసంఖ్యలో టిఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం తరలివచ్చారు. వారిని ఉద్దేశించి కెసిఆర్ మాట్లాడారు. థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు దిశగా తాను ముందుకెళుతున్నానని, త్వరలోనే అందరినీ కూడగడతానని స్పష్టం చేశారు. థర్డ్‌ఫ్రంట్‌ను అందరూ స్వాగతిస్తున్నారన్నారు. ప్రజల ఆకాంక్షల్ని గుర్తించడంలో కాంగ్రెస్, బిజెపి విఫలమయ్యాయన్నారు. 70 ఏళ్లలో ఆ రెండు పార్టీలూ చేసిందేమీ లేదన్నారు. కులాల పేరుతో హిందూ, ముస్లిం, క్రైస్తవుల పేరుతో మతాల పరంగా దేశాన్ని విభజించి 'ప్రజాశక్తి'ని ఏకం కానీయకుండా ఆ రెండు పార్టీలు రాజకీయంగా ఆటలాడుకుంటున్నాయని ఆరోపించారు. దేశంలో ఫెడరల్ వ్యవస్థ ఉందా.? మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు..అది ఉందా.? అని ప్రశ్నించారు. ఈ దేశానికి నిజమైన ఫెడరల్ వ్యవస్థ రావాల్సిన అవసరముందన్నారు. ఎంతటి సుదీర్ఘ ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుందని, ప్రజల దీవెన ఉంటే జాతీయ రాజకీయాల్లోకి కూడా వస్తానని, దేశానికి మార్గనిర్దేశం చేస్తానని చెప్పారు. అధికారాల్ని కేంద్రం తన చేతిలో పెట్టుకొని పెత్తనం చెలాయిస్తోందని విమర్శించారు. కేంద్రం వద్ద పరిమిత అధికారాలు ఉండాలన్నారు. ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, విద్యావిధానాన్ని రాష్ట్రాలకు ఎందుకు అప్పగించరు? అని ప్రశ్నించారు. రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్రాలకు ఎందుకివ్వరని నిలదీశారు. రిజర్వేషన్ల పెంపు అంశంపై అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. నీళ్ల పంపకాల్లో రాష్ట్రాల మధ్య గొడవ పెడుతున్నారని కేంద్రం తీరుపై మండిపడ్డారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా, గోదావరి, తమిళనాడు, కేరళ మధ్య కావేరి వివాదాన్ని పరిష్కరించడం లేదన్నారు. అన్ని ధరలనూ పెంచుతున్నారే తప్ప, పంటల మద్దతు ధరలు పెంచలేదన్నారు. రైతాంగం సంక్షోభంలో ఉన్నా.. మనం ఎందుకు మాట్లాడకూడదు? అని ప్రశ్నించారు. ఒకవేళ మాట్లాడితే జైలుకు పంపుతారట... పిట్ట బెదిరింపులకు నేను భయపడను అని వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్ మీద కోపంతో బిజెపిని గెలిపిస్తే.. రైతులు, విద్యార్థులు, కార్మికులకు ఏమీ ఒరగలేదన్నారు. వాళ్ల జమానాలో మాల్యా, వీళ్ల జమానాలో నీరవ్‌మోడీ బ్యాంకుల్ని మోసం చేసి పారిపోయారన్నారు. 'ఒకప్పుడు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొన్న చైనా.. ఇప్పుడు అమెరికాతో పోటీ పడుతోంది. కానీ మనం మాత్రం ఆస్థాయిలో ఎదగలేకపోతున్నాం' అని కెసిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

థర్డ్ ఫ్రంట్‌కు అసదుద్దీన్ స్వాగతం

కెసిఆర్ ఏర్పాటు చేసే థర్డ్‌ఫ్రంట్‌కు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్వాగతం పలికారు. బిజెపి తెలంగాణ నాయకులు మాత్రం ఫ్రంట్‌కు టెంట్ కూడా ఉందని ఎద్దేవా చేశారు. టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లా డుతూ ప్రజా సమస్యల్ని పక్కదారి పట్టించేందుకే కొత్తగా 'థర్డ్‌ఫ్రంట్' అంటూ కెసిఆర్ నాటకాలాడుతున్నారని విమర్శించారు.

కెసిఆర్‌కు పలు రాష్ట్రాల నుండి ఫోన్లు

నాన్ కాంగ్రెస్, నాన్ బిజెపి శక్తులతో కలిసి థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని ప్రకటించిన తెలంగాణ సిఎం కెసిఆర్‌కు వివిధ రాష్ట్రాల నేతల నుంచి ఫోన్లు వచ్చాయి. పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఫోన్ చేసి 'తమ్ముడూ.. మంచి నిర్ణయం తీసుకున్నావు. త్వరలో నిన్ను కలుస్తా. కలిసి ముందుకు వెళ్దాం' అని అన్నారని సిఎం కెసిఆర్ తెలిపారు. జార్ఖండ్ మాజీ సిఎం, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ తనకు ఫోన్ చేసి మద్దతు పలికారని చెప్పారు. మహారాష్ట్ర నుంచి ఏడుగురు ఎంపిలు ఫోన్ చేసి మద్దతు పలికారని, కూటమి ఏర్పాటు చేయగానే.. తమ పదవులకు రాజీనామా చేస్తామని చెప్పారని కెసిఆర్ తెలిపారు.

వ్యవసాయం, ఉపాధిపై కాంగ్రెస్ దృష్టి

16 నుంచి 18 వరకూ కాంగ్రెస్ ప్లీనరీ

న్యూఢిల్లీ : ఈ నెల 16 నుంచి 18 వరకూ దేశరాజధానిలో కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో వ్యవసాయం, ఉపాధి, పేద నిర్మూలనపై ప్రత్యేక తీర్మానం విడుదల చేయనున్నారు. 2019 ఎన్నికల్లో బిజెపిని ఎదుర్కొవడానికి ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు చివరిసారిగా 2010లో జరిగాయి. ఆ సమావేశాల్లో వ్యవసాయం, ఉపాధి అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టారు. కాగా, వ్యవసాయం, ఉపాధి, పేదరిక నిర్మూలన అంశాలపై హర్యానా మాజీ ముఖ్యమంత్రి భుపేందర్ సింగ్ హూడా చైర్మన్‌గా ఉప సంఘాన్ని ఏర్పాటు చేయనున్నారు. పార్టీ నాయకుడు మీనాక్షి నటరాజన్ ఈ ఉప సంఘానికి కన్వీనర్‌గా వుంటారు. ప్రస్తుతం దేశంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, దీనిపై భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శంగా ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు తెలిపారు. మరోక నాయకుడు మాట్లాడుతూ దేశంలో గత మూడు సంవత్సరాల నుంచి ఉపాధి, పేదరిక నిర్మూలన అంశాలు తీవ్రంగా మారాయని అన్నారు. నోట్లరద్దు, జిఎస్‌టిలు దేశ ఆర్థిక వ్యవస్థను నష్టాల్లోకి నెట్టాయని అన్నారు.

బిజెపి-ఎన్‌డిపిపి కూటమికి మరో సీటు

అగర్తల : నాగాలాండ్‌లో నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి)-బిజెపి కూటమికి మరో స్థానం లభించింది. ఎన్నికల ఫలితాల్లో రిజర్వ్‌లో ఉంచిన టెన్నింగ్ అసెంబ్లీ స్థానం ఫలితాన్ని ఎన్నికల కమిషన్ ఆదివారం ప్రకటించింది. ఈ స్థానంలో ఎన్‌డిపిపి అభ్యర్థి విజయం సాధించినట్లు ఎన్నికల కమిషన్ కార్యదర్శి అరవింద్ కుమార్ వెల్లడించారు. శనివారం ఈ స్థానంలో నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) అభ్యర్థి ఎన్ఆర్ జెలియాంగ్ విజయం సాధించనట్లు ప్రకటించారు. నాగాలాండ్ ముఖ్యమంత్రి టిఆర్ జెలియాంగ్ సోదరుడైన ఎన్ఆర్ జెలియాంగ్ పెరెన్ అసెంబ్లీ స్థానం నుంచి కూడా విజయం సాధించారు. కాగా తాజా విజయంతో ఎన్‌డిపిపి కూటమి బలం 32కు పెరిగింది. 60 మంది సభ్యులు ఉన్న నాగాలాండ్ అసెంబ్లీలో 31 మ్యాజిక్ మార్క్. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్‌పిఎఫ్‌కు ఈ ఎన్నికల్లో 29 స్థానాలు వచ్చాయి. ఇతరులు రెండు స్థానాల్లో విజయం సాధించారు. వీరు ఎన్‌డిపిపి కూటమికి మద్దతు ప్రకటించారు.

లంచంగా బంగారం, వజ్రాలు

నీరవ్ మోడి ఎత్తుగడ

ముంబయి/న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు కు చెందిన అధికారి ఒకరు నీరవ్ మోడీ నుంచి వజ్రాలను, బంగారాన్ని లంచంగా తీసుకున్నారని సిబిఐ శనివారం కోర్టుకు తెలియచేసింది. ప్రముఖ వజ్రాల వ్యాపారి నిరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి దాదాపు రూ.12,600 కోట్ల రుణాలు తీసుకుని ఎగవేసిన సంగతి తెలిసిందే. ఈ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. పలువురు బ్యాంకు అధికారులు నిరవ్ మోడీతో కుమ్మక్కైనట్లుగా సిబిఐ సందేహించి వారిపై విచారణ చేపట్టింది. అందులో భాగంగా శనివారం 14 మందిని అరెస్టు చేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రుణాలు ఎగవేసిన కేసులో తొలిసారిగా అరెస్టులు జరిగాయి. కాగా బ్యాంకుకు చెందిన ఒక అధికారికి నిరవ్ మోడి లంచాలు ఇచ్చినట్లు దర్యాప్తులో తేలిందని సిబిఐ తెలిపింది. బ్యాంకుకు చెందిన ముంబయి శాఖలో ఫారెక్స్ విభాగానికి మేనేజర్‌గా వ్యవహరిస్తున్న యశ్వంత్ జోషి 60 గ్రాముల బంగారు నాణాలు రెండిటిని, బంగారు నగల జతను, వజ్రాలతో చేసిన చెవి రింగులను మోడీ నుంచి లంచంగా తీసుకున్నాడని సిబిఐ కోర్టుకు తెలిపింది. జోషి లంచంగా తీసుకున్న వస్తువులను ఆయన నివాసం నుంచి స్వతంత్ర సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ తెలిపింది. బ్యాంకును మోసగించడంలో మోడీతో జోషి కుమ్మక్కయ్యారని సిబిఐ ఇన్‌స్పెక్టర్ దామోదరన్ కోర్టులో తెలిపారు.

64 సంస్థలు ఆస్తుల అమ్మకుండా నిషేధం

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం విచారణలో భాగంగా 64 సంస్థలు తమ అస్తులను అమ్మకుండా నిషేధం విధించారు. వీటిల్లో నీరవ్ మోడి, మెహుల్ చోక్సి, వారి బంధువులు, భాగస్వాములకు చెందిన కంపెనీలు, సంస్థలు వున్నాయి. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బహిరంగ ప్రకటన ప్రకారం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ఈ ఆదేశాలు జారీ చేసింది. కంపెనీల చట్టం 2013లోని వివిధ సెక్షన్ల ప్రకారం మంత్రిత్వ శాఖ దాఖలు చేసిన పిటిషన్‌పై ఎక్స్-పార్టే ఆర్డర్‌ను ఎన్‌సిఎల్‌టి జారీ చేసింది.

ప్రత్యేకం

ఇంకా పునరావస కేంద్రాలోన్లే బాధితులు

గుజరాత్ మతఘర్షణలకు 16 ఏళ్లు



గాంధీనగర్ : గుజరాత్‌లో మతోన్మాదం సృష్టించిన మారణకాండకు 16 ఏళ్ళు పూర్తికానున్నాయి. అయితే బాధితులు ఇంకా పునరావస కేంద్రాల్లోనే నివస్తున్నారు. వారిలో భయాందోళనలు తగ్గలేదు. ప్రభుత్వాలు వీరిపై దృష్టి పెట్టడం లేదు. కనీస సౌకర్యాలు లేక, గత్యంతరం లేని స్థితిలో బాధితులు ఈ కేంద్రాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

గుజరాత్‌లో 2002 మార్చి 16న మత ఘర్షణలు చెలరేగాయి. ఆర్ఎస్ఎస్, కాషాయ మూక జరిపిన ఈ మారణకాండలో సుమారు 2 వేల మంది మృతి చెందారు. ఈ మత ఘర్షణల్లో బాధితులు కోసం గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా 83 పునరావస కాలనీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కాలనీల్లో 3 వేలకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి.

అహ్మదాబద్‌లో 15 కాలనీలు, అనంద్‌లో 17, సబర్కంతాలో 13, పంచమహల్‌లో 11, మెహ్సానలో 8, వడోదరాలో 6, అరావళి 5 పునరావస కాలనీలు ఉన్నాయి. భరుంచ్, ఖేధా జిల్లాల్లో చెరో నాలుగు కాలనీలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ కేంద్రాలను జమైతా ఈ ఉలెమా ఈ హింద్, గుజరాత్ సర్వజనిక్ రిలీఫ్ కమిటీ, ఇస్లామిక్ రిలీఫ్ కమిటీ, యునైటెడ్ ఎకనమిక్ ఫోరమ్ అనే నాలుగు స్వచంధ సంస్థలు నిర్మించాయి. వీటిల్లో ఎక్కువ కేంద్రాల్లో ప్రాథమిక సదుపాయాలు కూడా లేవని, అయినా బాధిత కుటుంబాలు ఇందులో నివసిస్తున్నాయని హోజెఫ ఉజైని అనే ఉద్యమవేత్త తెలిపారు. ఈ కాలనీలన్నింటినీ నగరాలకు దూరంగా నిర్మించారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా వీటికి లేదు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలు ఉండవు. ఈ కాలనీలను తాత్కాలిక అవసరాల కోసం ఏర్పాటు చేశారు. అయితే బాధితులు వెనక్కి వెళ్లడానికి ఇష్టపడక ఇక్కడే ఉంటున్నారు. బాధితుల్లో చాలా మందికి సొంత ఇళ్లు లేకపోవడం ఇందుకు ఒక కారణమయితే, వారిలో మత ఘర్షణల భయాలు ఇంకా వెంటాడుతున్నాయి. దీంతో కాలనీలును వారు ఖాళీ చేయడం లేదు.

అనంద్‌లో ఉన్న కాలనీలో 19 ఇళ్లు ఉన్నాయి. వీటిలో 24 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా ముర్తజనగర్‌కు చెందిన భూమి లేని రైతులు, కార్మికులు. ప్రస్తుతం వీరు దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు.

ఈ కాలనీలను 2002లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఎన్నికల వచ్చిన ప్రతీసారి నాయకులు, అధికారులు ఈ కాలనీలను సందర్శిస్తారు. కానీ ఈ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై ఎవ్వరూ దృష్టి పెట్టరు. 2015 నుంచి 2017 వరకూ గుజరాత్ ముఖ్యమంత్రికి 5 దరఖాస్తులు, 15 మెమరాండాలను బాధితులు అందచేశారు. కానీ ఎలాంటి స్పందన రాలేదు.

మతఘర్షణలు జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని బాధితులు చెపుతున్నారు. తమ వద్ద సరైన పత్రాలు లేనికారణంగా బ్యాంకులు కూడా తమకు రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షిప్తం

యూపీ ఉప ఎన్నికల్లో ఎస్పీకి మద్దతు

న్యూఢిల్లీ : 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీతో కలిసి పోటీ చేయనున్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని బీఎస్పీ అధినేత్రి మాయావతి స్పష్టం చేశారు. అవి ఆధారరహితమైన, తప్పుడు వార్తలని ఆమె అన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తమకు గౌరవనీయమైన సంఖ్యలో సీట్లు ఇచ్చేందుకు ప్రతిపాదన వస్తే అప్పుడే నిర్ణయిస్తామని మాయావతి తెలిపారు. యూపీలో ఈ నెల 11న గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల్లో బీఎస్పీ తమ అభ్యర్థులను నిలబెట్టకుండా అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించింది. దాంతో, రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయన్న ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. బీజేపీని ఓడించేందుకే ఉప ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని తమ పార్టీ నిర్ణయించినట్టు మాయావతి తెలిపారు.

జిన్నా ప్రత్యేక దేశం కోరలేదు.. : ఫరూఖ్ అబ్దుల్లా

జమ్ము : ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలని మహ్మద్‌అలీ జిన్నా కోరలేదని జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. ముస్లింలు, సిక్కులకు మైనారిటీ హోదా కోరారని, అందుకు జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్, సర్దార్‌పటేల్ అంగీకరించలేదని..అందువల్లే జిన్నా ప్రత్యేక దేశంగా పాకిస్థాన్‌ను డిమాండ్ చేశారని ఫరూఖ్ అన్నారు. జిన్నా కోరినట్టు మైనారిటీ హోదాకు అంగీకరించి ఉంటే పాకిస్థాన్, ఆ తర్వాత బంగ్లాదేశ్ ఏర్పడేవే కావని అంతా ఇండియాలోనే కలిసి ఉండేవారని ఫరూఖ్ అన్నారు. జమ్మూలోని షేర్ ఏ కాశ్మీర్ భవన్‌లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఫరూఖ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ జాతిపితగా జిన్నాకు పేరున్నది. ఫరూఖ్ వ్యాఖ్యల్ని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఖండించారు. చరిత్రను మరోసారి చదవాలని ఫరూఖ్‌ను కోరారు. పాకిస్థాన్ డిమాండ్‌ను వదులుకుంటే జిన్నాను అవిభాజ్య ఇండియాకు ప్రధానిగా చేయడానికి కాంగ్రెస్ నేతలను ఒప్పిస్తానంటూ మహాత్మాగాంధీ ప్రతిపాదించారని జితేంద్రసింగ్ అన్నారు.

వైట్‌హౌస్ ముందు వ్యక్తి ఆత్మహత్య

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ ముందు శనివారం ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం సృష్టించింది. శనివారం నాటు తుపాకీతో వైట్ హౌస్ ముందుకొచ్చిన ఒక వ్యక్తి ఆకస్మాత్తుగా తనను తాను కాల్చుకున్నాడని అతడు అక్కడికక్కడే చనిపోయాడని స్థానిక పోలీసులు వివరించారు. ఈ వ్యక్తి ఎవరన్న విషయం ఇంకా వెల్లడికాలేదు. ఈ ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో పోస్ట్ అయిన ఒక వీడియోలో ఎమర్జెన్సీ వాహనాలు ఘటనా స్థలివైపు సైరన్లతో దూసుకొస్తుండగా ప్రజలు కకావికలై పరుగులు తీస్తున్న దృశ్యాలు కన్పిస్తున్నాయి.

అధికారం దక్కేనా?

ఇటలీ పార్లమెంటుకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో మిలాన్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించు కుంటున్న మాజీ ప్రధాని, ఫోర్జా ఇటాలియా అధినేత సిల్వియో బెర్లుస్కోనీ



ఇటలీలో ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలు

రోమ్ : ఇటలీ పార్లమెంట్‌కు ఆదివారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. దశ, దిశలేని ఆర్థిక వ్యవస్థ, భారీగా పెరిగిన నిరుద్యోగిత, వలస సమస్యల వంటి సమస్యలే అజెండాగా జరిగిన ఈ ఎన్నికల్లో మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ నేతృత్వంలోని ఫోర్జా ఇటాలియా, దాని మితవాద మిత్రపక్షాలు ఆధిక్యతను సాధించే అవకాశం వుందని, అయితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన బలం ఎవరికీ దక్కే అవకాశాలు కన్పించటం లేదని హంగ్ పార్లమెంట్ ఏర్పడే అవకాశాలే ఎక్కువగా వున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. దేశంలో అవినీతి, పేదరికం భారీగా పెరిగిన ప్రస్తుత సమయంలో ప్రభుత్వ వ్యతిరేకత అత్యధిక స్థాయిలో వుందని, దీనితో పాలక సెంటర్ లెఫ్ట్ డెమొక్రాటిక్ పార్టీ మూడో స్థానానికే పరిమితమవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో 5 స్టార్ మూమెంట్ పార్టీకి విజయావకాశాలు కన్పించినప్పటికీ, ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 40 శాతం బలం సాధించటం ఏ పార్టీకి లేదా కూటమికి అసాధ్యంగా కన్పిస్తోందని యుట్రెండ్ పోల్‌స్టర్స్ సంస్థ సహ వ్యవస్థాపకుడు లోరెంజో ప్రెగ్లియాస్కో అభిప్రాయపడ్డారు. యూరో జోన్‌లో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన ఇటలీ ఇప్పుడు భారీగా అప్పుల్లో కూరుకుపోయింది.

ఈ నేపథ్యంలో దేశంలో సుదీర్ఘకాలం కొనసాగిన రాజకీయ అస్థిరత ఆర్థిక వ్యవస్థను మరింత దిగజార్చిందని పరిశీలకులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 11 గంటలకు పోలింగ్ ముగిసిన తరువాత ఎగ్జిట్ పోల్స్ వెలువడే అవకాశం వుంది. అత్యంత సంక్లిష్టమైన కొత్త ఎన్నికల చట్టం పరిధిలో ఎన్నికలు జరుగుతుండటంతో సోమవారం అర్ధరాత్రి తరువాత కానీ ఫలితాలు వెలువడే అవకాశం లేదని ఎన్నికల కమిషన్ వర్గాలు చెబుతున్నాయి.

వాణిజ్య పోరును కోరుకోవటం లేదు

అమెరికాతో సంబంధాలపై చైనా



బీజింగ్ : అమెరికా, లేదా మరే ఇతర దేశంతోనైనా తాము వాణిజ్యపరమైన పోరును కోరుకోవటం లేదని చైనా స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్టీలు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలను భారీగా పెంచుతూ ప్రకటించిన నేపథ్యంలో చైనా ఉప విదేశాంగ మంత్రి ఝాంగ్ యెసుయ్ ఆ దేశ పార్లమెంట్ సమావేశాలలో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఝాంగ్ స్పష్టం చేశారు. దేశాల మధ్య వాణిజ్య పరమైన పోటీ మంచిది కాదని, విజయం సులభసాధ్యం కాదన్నారు.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ గత ఏడాది జనవరిలో పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఇరుదేశాల మధ్య వాణిజ్యపరమైన పోటీ నెలకొంది. అమెరికా స్టీల్ దిగుమ తుల్లో చైనా వాటా తక్కువే అయినప్పటికీ, ఆ దేశం తమ ఉక్కు పరిశ్రమను భారీగా విస్తరించి ఉక్కు ఉత్పత్తిని పెంచ టంతో ప్రపంచ వ్యాప్తంగా ఉక్కు ధరలు భారీగా తగ్గిపో యాయి. దేశాల మధ్య వాణిజ్యపరమైన పోటీని, పోరును నివారించేందుకు చర్చలు, పరస్పరం అవకాశాలు కల్పించు కోవటమే ఉత్తమమైన మార్గమని ఝాంగ్ అన్నారు. ఏ దేశంతోనూ, ముఖ్యంగా అమెరికాతో తాము వాణిజ్యపర మైన పోరును కోరుకోవటం లేదని, అయితే తమ ప్రయో జనాలు దెబ్బతింటుంటే చైనా మౌనంగా కూర్చోబోదని ఆయన స్పష్టం చేశారు.

రక్షణ బడ్జెట్‌లో స్వల్ప పెరుగుదలతో ముప్పులేదు..

చైనా తన రక్షణ వ్యయాన్ని స్వల్పంగా పెంచటం వల్ల గతంలో చోటు చేసుకున్న లోటు పాట్లు భర్తీ అవుతాయే తప్ప ఎవరికీ ఎటువంటి ముప్పూ వుండదని ఝాంగ్ యెసుయ్ స్పష్టం చేశారు.

గత ఏడాది సైనిక వ్యయాన్ని ఏడు శాతం మేర (1.044 లక్షల కోట్ల యువాన్లు) పెంచాలని ప్రతిపాదించామని, ఆ ఏడాది అమెరికా పెంచిన రక్షణ వ్యయంలో ఇది నాలుగో వంతు మాత్రమేనని తెలిపారు. రక్షణ వ్యయంలో పెంపుదల అనేది కేవలం రక్షణ రంగంలో గతంలో చోటు చేసుకున్న లోటుపాట్లను భర్త చేయటానికి, సైనికదళా ఆధునీకరణకు, సైనికుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించినదే తప్ప ఇతరులకు చేటు చేసేందుకు ఉద్దేశించింది కాదని స్పష్టం చేశారు. చైనా ఎప్పుడూ శాంతి యుత అభివృద్ధినే కోరుకుంటుందని, స్వీయ రక్షణకు మాత్రమే రక్షణ విధానాన్ని అనుసరిస్తుందన్నారు.

కొరియాల మధ్య మరింత మైత్రి

నేటి నుంచి దక్షణ కొరియా

సియోల్: ఉభయ కొరియాల మధ్య సంబంధాలు మరింతగా పటిష్టమౌ వుతున్నాయి. ఇరుదేశాల ఉద్రిక్తతల సడలింపునకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు దక్షిణ కొరియా జాతీయ భద్రతా వ్యవస్థ డైరెక్టర్ ఛుంగ్ యు యంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం ఉత్తర కొరియాకు వెళ్లనుంది. దాదాపు దశాబ్దకాలం విరామం అనంతరం ఉ.కొరియా ద.కొరియా నుండి ఒక ఉన్నత స్థాయి ప్రతినిధివర్గం వెళ్లటం ఇదే ప్రథమం కావటం విశేషం. ఇటీవల ముగిసిన శీతాకాలం ఒలింపిక్ క్రీడలలో ఉభయ కొరియాల మధ్య సౌహార్ద్ర వాతావరణం వెల్లి విరిసిన నేపథ్యంలో ఉభయ కొరియాల మధ్య చర్చలకు మార్గం సుగమమవుతున్న విషయం తెలిసిందే. ద.కొరియా జాతీయ భద్రతా వ్యవస్థ డైరెక్టర్ చుంగ్ యు యంగ్ నేతృత్వంలోని ఈ పదిమంది సభ్యుల ప్రతినిధి బృందం తమ రెండు రోజుల ఉ.కొరియా పర్యటనలో అక్కడి సీనియర్ అధికారులతో మంతనాలుజరు పనున్నారు. కొరియా ద్వీపకల్పంలో శాంతియుత వాతావరణం కోసం తీసుకో వాలిస్న చర్యలు, ఉభయ కొరియాల మధ్య సంబంధాల బలోపేతం, అమెరికా– ఉ.కొరియా మధ్య చర్చల ప్రారంబానికి అనువైన వాతావరణం ఏర్పరచటం వంటి అంశాలపై తాము ఉ.కొరియా ప్రభుత్వంతో చర్చించనున్నట్లు ద.కొరియా అధ్యక్షు డు మూన్‌జే ఇన్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉ.కొరియా పర్యటన అనంతరం ద.కొరియా ప్రతినిధి బృందం అమెరికా వెళ్లి తమ చర్చల పురోగతిని వివరిస్తుందని అధ్యక్ష కార్యాలయం సీనియర్ అధికారి యూయంగ్ చాన్ మీడియాకు చెప్పారు. ఇదిలా వుండగా చర్చలు పున్ణప్రారంభం కావాలంటే ముందు ఉ.కొరియా అణు నిరాయుధీకరణ కోసం చర్యలు తీసుకోవాలని అమెరికా చెబుతుండగా, చర్చల కోసం అణు కార్యక్రమాలను పణంగా పెట్టబోమని ఉ.కొరియా స్పష్టం చేస్తోంది.

బ్రెగ్జిట్‌పై మరో రిఫరెండమా? నో ఛాన్స్..!

• తేల్చి చెప్పిన బ్రిటన్ ప్రధాని మే

లండన్ : బ్రిటన్ ఐరోపా కూటమి (ఇయు) నుండి నిష్క్రమించే అంశం (బ్రెగ్జిట్)పై మరో రిఫరెండం నిర్వహించే ఉద్దేశం లేదని బ్రిటన్ ప్రధాని థెరెస్సా మే తేల్చిచెప్పారు. బ్రెగ్జిట్‌పై ఇరువర్గాల మధ్య సమగ్రమైన ఏకీకృత ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నట్లు ఆమె శనివారం రాత్రి ఇక్కడ కొంతమంది విదేశీ మీడియా ప్రతినిధులకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. బ్రెగ్జిట్‌పై తుది ఒప్పందం కుదిరిన తరువాత దానిని పార్లమెంట్ ముందుచుతామని ఆమె వివరించారు. ఈ అంశంపై మరోసారి రిఫరెండం నిర్వహించటం లేదా ఎన్నికల ప్రచారాస్త్రంగా వినియోగించటం వంటి వాటికి అవకాశాలు లేవని ఆమె స్పష్టం చేశారు. 2019 మార్చి 29 నాటికి బ్రిటన్ ఐరోపా కూటమి నుండి నిష్క్రమిస్తుందని ఆమె పునరుద్ఘాటించారు. ప్రజల తీర్పును గౌరవించటం తమ విధి అన్నారు.

ఉమ్మడి మార్కెట్ వంటి ఐరోపా యంత్రాంగాలను రద్దు చేయాలన్న తన ఆలోచనను ఆమె పునరుద్ఘా టించారు. అయితే ఐరోపా కూటమితో ప్రతిపాదిత కస్టమ్స్ ఒప్పందం లేదా కస్టమ్స్ అసోసియేషన్ ఏర్పాటు విషయంలో ఎటువంటి సరిహద్దులను తమ ప్రజలు అంగీకరించబోరన్నారు.



పాక్ సెనేట్‌కు తొలిసారిగా హిందూ దళిత మహిళ ఎన్నిక

కరాచీ : పాకిస్తాన్‌లో తొలిసారిగా ఓ హిందూ దళిత మహిళ సెనేటర్‌గా ఎన్నికై రికార్డు సృష్టించింది. సింథ్ ప్రావిన్స్‌కు చెందిన కొల్లి కృష్ణ కుమారి అనే ఈ మహిళ బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ తరపున సెనేట్‌కు ఎన్నికయ్యారు. పాకిస్తాన్‌లో మహిళలు, మైనార్టీ హక్కుల కోసం సాగుతున్న ఉద్యమాలలో కొల్లి సాధించిన విజయం ప్రధానమైన మైలురాయి వంటిదని పరిశీలకులు చెబుతున్నారు. ఇంతకు ముందు పాకిస్తాన్ పీపుల్స్ పార్టీయే తొలిసారిగా రత్నా భగవాన్‌దాస్ చావ్లా అనే హిందూ మహిళను సెనేట్‌కు పంపిన విషయం తెలిసిందే.

కొల్లి కృష్ణకుమారి సింథ్ ప్రావిన్స్‌లోని థార్ జిల్లాలో మారుమూల గ్రామం నగర్‌పర్కార్ అనే కుగ్రామంలో పేద రైతు కుటుంబంలో 1979లో జన్మించారు. 16వ ఏటనే వివాహం చేసుకున్న ఆమె 2013లో సింథ్ యూనివర్శిటీ నుండి సోషియాలజీలో మాస్టర్స్ డిగ్రీని అందుకున్నారు. సెనేట్‌కు శనివారం జరిగిన ఎన్నికల్లో మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్ నేతృత్వం లోని పిఎంఎల్ ఎన్ పార్టీ 15 స్థానాలను గెల్చుకుంది.

ఈ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్లతో కలిపి మొత్తం 130 మంది పోటీ చేశారు.

అమెరికాలో రైలీ తుపాను బీభత్సం

ఏడుగురు మృతి

న్యూయార్క్: అమెరికాలోని 12 రాష్ట్రాల్లో రైలీ తుపాన్ బీభత్సం సృష్టించింది. ఈ తుపాన్ ధాటికి ఇప్పటి వరకూ ఏడుగురు మృతి చెందారు. విద్యుత్ వ్యవస్థ కుప్పకూలి 23 లక్షలకు పైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. న్యూయార్క్, వర్జీనియా, మసాచూసెట్స్, మేరీల్యాండ్ సహా మరికొన్ని రాష్ట్రాలపై ఎడతెరిపిలేని వర్షం, తీవ్రమైన హిమపాతం భీకర గాలులతో రైలీ తుపాను విరుచుకుపడింది. వేర్వేరు రాష్ట్రాల్లో చెట్లు విరిగి పడిన ఘటనల్లో ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. పెనుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకూలిపోగా, ఎక్కడికక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మొదటి పేజీ తరువాయి


సీను మారేనా ?

అనేది రాజకీయ విశ్లేషకుల్లో చర్చగా మారింది. అసెంబ్లీ సమావేశాల ప్రకటన వచ్చినప్పటి నుండి దీనిపైనే చర్చ నడుస్తోంది. రాజకీయంగా కీలకమైన వ్యవహారం కావడంతో ఈ సారి ఎవరు ఎలా వ్యవహరిస్తారనే దానిపై రాజకీయ మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు బిజెపి నాయకులు రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించడం ద్వారా టిడిపిని ఇరుకునపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికితోడు కీలకమైన రాజధాని వ్యవహారం, అనంతపురంలో కియో సంస్థ ఏర్పాటు చేసే ప్రాంతంలో టిడిపి ఎమ్మెల్యేలు, మంత్రుల భూముల కొనుగోలు వ్యవహారం, పోలవరం, పట్టిసీమ, అమరావతిలో భూ కుంభకోణాలు తదితర అంశాలపై దృష్టి సారిస్తామని బిజెపి చెబుతోంది. తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా అందుకు దీటుగా సమాధానం చెప్పాలనే ఆలోచనతో ప్రయత్నాలు మొదలుపెట్టారు. నాలుగేళ్ల లో కేంద్రం నుండి వచ్చింది ఏమీ లేదనే విధంగా ఒక నివేదికను తయారు చేశారు. గవర్నర్ ప్రసంగంలోనూ దీన్ని పొందుపరచడం ద్వారా కేంద్రాన్ని ఇబ్బందులు పెట్టే విధంగా ప్రసంగ పాఠాన్ని సిద్ధం చేశారు. అయితే గవర్నర్ కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడతారా ? లేదా అనేది వేచి చూడాల్సిందే. దీంతోపాటు హోదా అంశాన్నీ సమావేశాల్లో మరోసారి ముందుకు తీసుకురానున్నారు. దీంతో బిజెపిని ఇరుకునపెట్టే విధంగా టిడిపి తనవంతు ప్రయత్నాలు చేస్తోంది.

వారిపై చర్యలు తీసుకుంటేనే అసెంబ్లీకొస్తాం : వైసిపి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచి అధికార తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించిన 23 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటేనే అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతామని వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. విజయవాడలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ కోడెలకు ఫిర్యాదు చేశామన్నారు. ఆదివారం గుంటూరులో స్పీకర్‌ను కలిసి ఫిరాయింపుదారులతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. రెండేళ్ల జైలు శిక్ష పడిన టిడిపి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కూడా అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విశ్వాసాన్ని ఈనె 21న పెట్టడం వల్ల ఎటువంటి ఉపయోగం లేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనడంపై స్పందిస్తూ ఎప్పుడు పెట్టాలో ఆయనే చెప్పాలని సూచించారు. అవిశ్వాసం చీప్ ట్రిక్ అని తెలంగాణ సిఎం కెసిఆర్ అనడం అర్థరహితమన్నారు.

ఐక్య వేదిక నేతలనిరవధిక నిరాహార దీక్షలు



విజయానంద్ మొండి వైఖరి అవలంబి స్తున్నారన్నారు. రాష్ట్రంలో కార్మిక సమస్యలు పట్టని వ్యక్తి కార్మిక శాఖ మంత్రిగా కొనసాగు తున్నారని, విద్యుత్ శాఖ పట్టించుకోని వ్యక్తి ఆ శాఖ మంత్రిగా ఉన్నారన్నారు. శాంతియుతంగా జరుగు తున్న ఉద్యమాన్ని అణచి వేయాలని చూస్తే కార్మిక వర్గం ఒక్కటే ప్రభుత్వంపై ఉక్కుపాదం మోపుతుందని హెచ్చరించారు. ఎఐటియుసి రాష్ట్ర నాయకులు రమణమూర్తి మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయడం లేదంటే, ప్రభుత్వమే నేరం చేస్తోందన్నారు. రాష్ట్రం, కేంద్రంలో ప్రజాస్వామ్యం లేదని, ధనస్వామ్యమే నడుస్తోందన్నారు. ఈ కారణంతోనే అన్ని రంగాల్లో కాంట్రాక్టు వ్యవస్థ పెరిగిపో తోందన్నారు. నిజమైన ప్రజా సేవకుల్ని చట్టసభలకు పంపే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆల్ పెన్షనర్స్ యూనియన్ నాయకులు ఎం.వి శాస్త్రి మాట్లాడుతూ చలో విద్యుత్ సౌధ కార్యక్రమంలో పెన్షనర్‌లు పాల్గొంటారన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, సిఐటియు నాయకురాలు కె.స్వరూపరాణి, ఎపి కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి ఛైర్మెన్ ఎ.వి నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కె.ఉమామ హేశ్వర రావు, ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు బి.వి.ఆర్ రెడ్డి, ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఆర్వీ నర్సింహారావు, యునైటెడ్ ఎలక్ట్రిసిసి ఎంప్లా యీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. విద్యుత్ కార్మికుల ఐక్య వేదిక జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి జిల్లా విఆర్.పురంలో జరిగిన రాస్తారోకోలో పాల్గొన్న భద్రాచలం ఎంఎల్ఎ సున్నం రాజయ్య



విశాఖ జిల్లా పాడేరులో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనర్స, ఇతర నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మన్యం బంద్ జయప్రదం

ప్రజాశక్తి– యంత్రాంగం

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని, విభజన చట్టం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన జెఎసి ఆధ్వర్యాన ఆదివారం చేపట్టిన రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ విజయవంతమైంది. బంద్‌లో భాగంగా ఆయా మండల కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్‌టిసి బస్సులతో పాటు ప్రయివేటు వాహనాలను తిరగకుండా గిరిజనులు ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. విశాఖ ఏజెన్సీలోని 11 మండలాల్లోనూ బంద్ సంపూర్ణంగా జరిగింది. ప్రయివేటు వాహనదారులు తమ వాహనాలను నిలిపివేసి బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. అరకు, అనంతగిరి, బొర్రా వంటి తదితర పర్యాటక కేంద్రాలు మూతపడ్డాయి. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు ఉదయం ఆరు గంటలకే గిరిజన సంఘం కార్యకర్తలు చేరుకొని మధ్యాహ్నం 12 గంటల వరకూ కాంప్లెక్స్ నుంచి ఒక బస్సును కూడా బయటకు వెళ్లనీయకుండా చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, జిల్లా ఉపాధ్యక్షులు పాలికి లక్కుతో పాటు 25 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అరకులోయలో సుంకరమెట్ట వారపుసంతలో ప్రధాన రహదారిపై గిరిజనులు బైటాయించడంతో సంత జరగలేదు. పోలీసులు పది మందిని అరెస్టు చేశారు. ముంచంగిపుట్టు మండలం కేంద్రంలో ఆర్‌టిసి బస్సులను పోలీసులు బలవంతంగా నడిపే ప్రయత్నం చేయడంతో, గిరిజన సంఘం నాయకులు అడ్డుకున్నారు. పోలీసులు అత్యుత్సాహం చూపి గిరిజన సంఘం జెండాలను కాళ్లతో తన్ని రహదారిపై ఉన్న కర్రలు, బల్లలను చెదరగొట్టారు. పోలీసులకు, గిరిజన సంఘం నాయకులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది.

బంద్ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా భామినిలో సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్‌ను, సారవకోటలో గిరిజన సంఘాల ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షులు జన్ని రామారావుతో పాటు ఏడుగురిని పోలీసులు ఉదయాన్నే ముందస్తుగా అక్రమ అరెస్టులు చేశారు. మధ్యాహ్నం వారిని విడుదల చేశారు.


విజయనగరం జిల్లా మన్యంలో ఉదయం ఆరు గంటలకే కురుపాం, మొండెంఖల్, గుమ్మలక్ష్మీపురం, నీలకంఠాపురం, కొమరాడ మండలం మాదలింగిల్లో గిరిజనులు రోడ్లపైకి వచ్చారు. గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. గిరిజన సంఘాల జెఎసి జిల్లా ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, జిల్లా కార్యదర్శి టి.రమేష్ తదితరుల ఆధ్వర్యాన బంద్ చేపట్టారు. కురుపాంలో జెఎసి నాయకులు బస్టాండ్ వద్ద ఆందోళనకు దిగారు.

పశ్చిమగోదావరి జిల్లా మన్యంలో బంద్ విజయవంతమైంది. పోలవరం, బుట్టాయగూడెం, వేలేరుపాడు, టి.నర్సాపురం మండలాల్లో బంద్‌కు మంచి స్పందన వచ్చింది. పోలవరంలో ఏటిగట్టు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. వేలేరుపాడులో మోటారు సైకిల్ ర్యాలీ, జీలుగుమిల్లిలో ప్రదర్శన, రాస్తారోకో, టి.నర్సాపురంలో ర్యాలీ చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీలోని 11 మండలాల్లోనూ బంద్‌కు మంచి స్పందన వచ్చింది. బంద్‌లో భాగంగా జాతీయ రహదారులపై రాస్తారోకోలు నిర్వహించి వాహనాలను నిలిపేశారు. విఆర్.పురంలో జరిగిన బంద్‌లో భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య పాల్గొన్నారు.

విజయవాడ చేరుకున్న గవర్నర్ నరసింహన్

మంత్రి దేవినేని ఘనస్వాగతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు గవర్నర్ ఈఎస్‌–ఎల్ నరసింహన్ ఆదివారం సాయంత్రం విజయవాడకు చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్‌కు, ఆయన సతీమణికి జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా కలెక్టర్ బి లక్ష్మీకాంతం, జిఎడి ప్రొటోకాల్ అడిషనల్ సెక్రటరీ కల్నల్ ఎం అశోక్‌బాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు విజయవాడలోని గేట్‌వే హోటల్‌కు చేరుకున్నారు.

నిర్మాణ రహిత ప్రాంతాన్ని ప్రకటించిన జమ్ము కశ్మీర్

శ్రీనగర్ : శ్రీనగర్–జమ్మూ జాతీయ రహదారి వెంబడి ఇరువైపులా ఉన్న హరిత ప్రదేశాన్ని రక్షించడానికి పుల్వామా జిల్లాలోని ఓ ప్రాంతాన్ని నిర్మాణ రహిత ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించింది. దక్షిణ కశ్మీర్‌లోని పాంపోర్‌లోని కడల్బల్ నుండి అవంతిపోరలోని మెర్జపోరా జాతీయ రహదారి వరకు ఇరువైపులా ఉన్న ప్రాంతాన్ని నిర్మాణ రహితంగా జిల్లా నిర్మాణ అభివృద్ధి శాఖ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేశారు. 300 కిలోమీటర్ల పొడవున్న శ్రీనగర్–జమ్మూ జాతీయ రహదారిని కాపాడుకోవటానికి ఇది అత్యవసరం మరియు ఆవశ్యకమైనదని నివేదికలో పేర్కొన్నారు.

హస్తినలో హోదా హోరు

(మొదటి పేజీ తరువాయి)

వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు ఆదివారానికే ఢిల్లీకి చేరుకున్నారు. దీంతో ఏపి భవన్, జంతర్‌మంతర్‌ల వద్ద ఇప్పటికే హోదా నినాదం మారుమ్రోగుతోంది.

టిడిపి, బిజెపి డ్రామాలు : వైసిపి నేతలు

టిడిపి, బిజెపిలు కలిసి డ్రామాలాడుతూ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని పలువురు వైసిపి నేతలు అన్నారు. ఆదివారం ఉదయం ఢిల్లీకి చేరుకున్న వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వైసిపి ఎంఎల్‌ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మోడీ, చంద్రబాబులు . రాజకీయ వికత క్రీడ ఆడుతున్నారని అన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రయోజనాల గురించి చంద్రబాబు మాట్లాడకుండా ఎన్నికల వస్తున్నాయనే నాటకాలాడుతున్నారు. మోడీ అంహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారు. వైసిపి ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ ప్యాకేజీ కోసం కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వం మోకరిల్లిందని విమర్శించారు. వైసిపి ఎమ్మెల్యే రాజన్న మాట్లాడుతూ ప్రత్యేక హోదా భిక్ష కాదు, ఆంధ్రుల హక్కని అన్నారు.

కేంద్ర మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం : నవ్యాంధ్ర విద్యార్థి జెఎసి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలకై కేంద్ర మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని నవ్యాంధ్ర విద్యార్థి జెఎసి అధ్యక్షుడు ఎ.అయ్యస్వామి హెచ్చరించారు. ఆదివారం ఏపి భవన్ వద్ద జెఎసి నేతలు భిక్షాటన చేశారు. అనంతరం అయ్యస్వామి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హక్కుల సాధనకై ఏపి ఎంపిలు తక్షణమే రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాన్ పొలిటికల్ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు అప్పికట్ల శ్రీహరినాయుడు, ఎపి నిరుద్యోగ పోరాట సమితి మర్రివేముల శ్రీనివాసులు, జెఎసి నేతలు వై.గంగాధర రావు, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విభజన సమస్యలపై 12న సమావేశం

ప్రత్యేకహోదా పోరాట నేపథ్యంలో విభజన సమస్యల పై చర్చించడానికి ఈనెల 12న ఢిల్లీలో రెండు వేర్వేరు సమావేశాలు జరుగనున్నాయి. ఈ మేరకు కేంద్ర రాష్ట్ర సంబంధాల విభాగం అదనపు కార్యదర్శి టివిఎస్ఎన్ ప్రసాద్ రెండు రాష్ట్రాలకు లేఖ రాశారు. అదేరోజు రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల(సిఎస్) సమావేశం జరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఈ సమావేశం ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడింది. తాజా గా నిర్ణయించిన మేరకు సమావేశం జరిగితే షెడ్యూల్ 9, 10ల్లోని సంస్థల విభజన, షెడ్యూల్ 13లో ఇచ్చిన హామీలు, విద్యుత్ ఉద్యోగుల విభజన, రెండు రాష్ట్రాల్లో పని చేస్తున్న ఉద్యోగుల విభజన, ప్రభుత్వ భవనాల అప్పగింత వంటి అంశాలపై చర్చకు వచ్చే అవకాశముంది.


పులివెందులలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక పూలంగళ్ల కూడలి రణరంగంగా మారింది. రెండు పార్టీలకు చెందిన వారు పరస్పరం రాళ్ల దాడులు చేసుకోవడంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. వివరాలిలా ఉన్నాయి. పులివెందుల అభివృద్ధిపై చర్చకు సిద్ధమంటూ ఈ నెల ఒకటిన శాసన మండలి ఉపాధ్యక్షులు సతీష్‌రెడ్డి సవాల్ విసిరారు. అందుకు తాము సిద్దమేనంటూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రతి సవాల్ విసిరారు. పులివెందుల ప్రాంతానికి జగన్ ఏమీ చేయలేదంటూ అంతా టిడిపి పాలనలోనే జరిగిందని సతీష్‌రెడ్డి వాదన. దీనికి ఎంపీ స్పందిస్తూ.... వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవ, చలవతోనే అభివృద్ధి జరిగిందని, కృష్ణాజలాలు రావడానికి వైఎస్సే ప్రధాన కారణమని తెలిపారు. తాము కూడా సాక్ష్యాధారాలతో నిరూపిస్తామంటూ వాదించారు. ఇందుకు పట్టణంలోని పూలంగళ్ల కూడలిని వేదికగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచే అటు టిడిపి, ఇటు వైసిపి కార్యకర్తలు భారీ సంఖ్యలో పులివెందులకు చేరుకున్నారు. సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు పూలంగళ్ల కూడలి వద్ద తిష్టవేశారు. ఒకదశలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో ఇరువర్గాల కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. రాళ్లు రువ్వుకున్నారు. శాంతిభద్రతలు అదుపు తప్పడంతో పోలీసులు 10రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం ఇరువర్గాలను పోలీసుల చెదరగొట్టే ప్రయత్నం చేశారు. రాళ్ల దాడిలో ఎస్ఐ చిరంజీవి, మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ లాఠీ చార్జిలో కౌన్సిలర్ వరప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితులు శ్రుతి మించడంతో ఎస్‌పి అట్టాడ బాపూజీ సంఘటనా స్థలానికి చేరుకుని అల్లరి మూకలను చెదరగొట్టడంతో పరిస్థితి చక్కబడింది.

ఎవరికి 'ఆస్కార్'ముంది?





ది షేప్ ఆఫ్ వాటర్

ప్రపంచ సినీ పండుగ 'ఆస్కార్' వేడుక. 90వ అకాడమీ అవార్డు వేడుకకు అమెరికా సన్నద్ధమైంది. లాస్‌ఏంజెల్స్ డాల్బీ థియేటర్ సర్వం సిద్ధం చేసేశారు. 'ఆస్కార్' గెలుచుకునే ఆస్కారం ఎవరికుంది? ఈ ఏడాది ఏ చిత్రం ఉత్తమ పురస్కారాన్ని దక్కించుకోబోతుందో కొద్ది గంటల్లోనే తెలిపోనుంది. ఇటీవల జరిగిన గోల్డెన్ గ్లోబ్ అవార్డుల వేడుకలో వినిపించిన నిరసన స్వరంఇక్కడ కూడా వినిపిస్తుందా? లేక అంతా యథాతథంగా సాగుతుందా? అన్నది కూడా ఓ పక్కన చర్చ జరుగుతుంది. చూడాలి ఏం జరగబోతుందో? భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 6:30 గంటల నుంచి లాస్‌ఏంజెల్స్‌లో ఈ వేడుక ప్రారంభం కానుంది. వేడుక ప్రారంభం నుంచీ టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

మూడింటి మధ్య పోటీ

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినిమాలు ఈ ఆస్కార్ కోసం పోటీ పడ్డాయి. ఉత్తమ చిత్రం విభాగంలో 'కాల్ మి బై యువర్ నేమ్', 'డార్కెస్ట్ అవర్', 'డన్‌క్రిక్' 'గెట్ అవుట్', 'లేడీ బర్డ్' , 'ఫాంటమ్ థ్రెడ్' 'ద పోస్ట్', 'ది షేప్ ఆఫ్ వాటర్' ,'త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్– మిస్సోరి' చిత్రాలు ఈ పోటీలో నిలిచాయి. అంతిమంగాఅత్యధిక నామినేషన్లు మూడు చిత్రాలు దక్కించుకున్నాయి. ఇందులో 'ది షేప్ ఆఫ్ వాటర్' అత్యధికంగా 13 విభాగాల్లోనూ, తొమ్మిది విభాగాల్లో 'త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్ –మిస్సోరి', 'డన్‌క్రిక్' 7 విభాగాల్లోనూ ఆస్కార్‌ను గెలుచుకునేందుకు బరిలో నిలిచాయి. మరో విశేషం ఏమిటంటే దిషేప్ ఆప్ వాటర్, డన్‌క్రిక్, త్రీ విల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్– మిస్సోరి... చిత్రాలే ఉత్తమ చిత్రాల విభాగంలోనూ పోటీ పడుతున్నాయి. 'కాల్ మి బై యువర్ నేమ్', 'డార్కెస్ట్ అవర్', 'గెట్ అవుట్', 'ది ఫాంటమ్ థ్రెడ్', 'ది పోస్ట్' చిత్రాలు మిగిలిన విభాగాల్లో ఆస్కార్‌ను సొంతం చేసుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది 'ఫాంటమ్ థ్రెడ్' తీసిన పాల్ థామస్ ఆండ్రసన్ ఉత్తమదర్శకుడిగా పురస్కారం గెలుచుకునేందుకు ఆస్కారం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈయనతో పాటు గల్లీర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్), గ్రీటా గ్రెవిగ్ (లేడీ బర్డ్), క్రిస్టోఫర్ నోలాన్ (డ్రంకిక్) పేర్లు కూడా వినిపిస్తున్నాయి. తన నటనతో 'ది షేప్ ఆఫ్ వాటర్'లో మెప్పించిన శాల్లీ హాకిన్స్‌కి ఉత్తమ నటిగా ఆస్కార్ లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్టు తెలుస్తుంది. ఈమెతో పాటు ఫ్రాన్సిస్ మెక్ డోర్మండ్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్ –మిస్సోరి), మార్గట్ రోబీ (ఐ టోన్యా) పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తిమోతీ చాల్మెట్‌కు బెస్ట్ యాక్టర్ పురస్కారం వచ్చే చాన్స్‌లు ఉన్నాయని విశ్లేషకుల భావిస్తున్నారు. గత ఏడాది తన మాటలతో ఆహూతులను అలరించిన జిమ్మీ కిమ్మెల్ ఈ ఏడాదీ వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు.



గ్యారీ ఓల్డ్‌మేన్



ది పోస్ట్



గెట్ అవుట్



త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్ -మిస్సోరి

భారీ ప్రమోషన్‌కు ప్లాన్



మహేష్ బాబు

మహేష్ బాబు ముఖ్యమంత్రిగా చేస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను ఏప్రిల్ 20వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను, టీజర్‌ను విడుదల చేసి అభిమానుల్లో ఆసక్తిని పెంచారు. ఇక నుంచి భారీ స్థాయిలోనూ, అదీ విభిన్నమైన రీతిలో ప్రమోషన్ కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సినిమాలో మహేష్ బాబు చేసిన రాజకీయ నాయకుడి పాత్ర తరహాలోనే ప్రమోషన్స్ కూడా చేపట్టే యోచనలో ఉన్నట్టు తెలుస్తుంది. ముందుగా ఇందులో మహేష్ బాబు ఎలా ఉండబోతున్నారన్న దానిపై స్పష్టత ఇవ్వడానికి ఓ టీజర్‌ను ఈనెల ఆరో తేదీన అభిమానుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఆ తర్వాత ఆడియో రిలీజ్ వేడుక, కాంటెస్ట్‌లు, ప్రీ రిలీజ్ వేడుక వంటివి ప్లాన్ చేశారు. ఈ ప్రమోషన్ బాధ్యతలను మహేష్‌బాబు భుజాలపై వేసుకున్నారు. 'శ్రీమంతుడు' అంత స్థాయిలో ఈ చిత్రాన్ని హిట్ చేసే దిశగా సినిమా యూనిట్ శ్రమిస్తుంది. అందుకు విభిన్నమైన పద్ధతి ప్రమోషన్‌కు వ్యూహ రచన చేసింది. ఈ చిత్రాన్ని డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. కైరా అద్వాని కథానాయికగా చేస్తుంది. ఈ నెల చివరకు ఈ చిత్రం షూటింగ్ పార్టు మొత్తం పూర్తి కానుంది.

'అర్జున్ రెడ్డి'తో మెహ్రీన్

'అర్జున్ రెడ్డి' చిత్రం తర్వాత ఫుల్ క్రేజ్ వచ్చింది విజయదేవరకొండకి. భాషలతో సంబంధం లేకుండా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఇప్పుడు తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లో కూడా సందడి చేయబోతున్నారు. విజయ్ కథానాయకుడిగా స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా ద్విభాషా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆనంద్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో కథానాయికగా మెహ్రీన్‌ను ఎంపిక చేశారు. మెహ్రీన్ గత ఏడాది 'మహానుభావుడు', 'రాజా ది గ్రేట్' చేశారు. హైదరాబాద్‌లో ఈ చిత్రం చిత్రీకరణ సోమవారం ప్రారంభం కానుంది.



విజయ్ దేవరకొండ



మెహ్రీన్

అతిలోక సుందరి శ్రీదేవి మృతికి తెలుగు చిత్రసీమ ఘనంగా నివాళు లర్పించింది. ఈ సందర్భంగా శ్రీదేవితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరామిరెడ్డి, కృష్ణంరాజు, జయసుధ, జయప్రభ, పి. సుశీల, జగపతి బాబు, రాజశేఖర్ దంపతులు తదితరులు హాజరయ్యారు.



'శ్రీనివాస కల్యాణం' మొదలైంది



నితిన్, రాశీ ఖన్నా

నితిన్, రాశీఖన్నా, నందిత శ్వేత హీరో హీరోయిన్లుగా రూపొందనున్న 'శ్రీనివాస కల్యాణం' చిత్రం షూటింగ్ ఆదివారం లాంఛనంగా ప్రారంభమైంది. ఈనెల 16వ తేదీ నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలు కానుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కనుంది. దర్శకుడు 'శతమానం భవతి' ఫేమ్ సతీశ్ వేగేశ్న ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రకాశ్ రాజ్ కీలకపాత్ర పోషించనున్నారు. ఈనెల 16 నుండి ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. తొలి షెడ్యూల్ మార్చి 30 వరకు జరుగుతుంది. జూన్‌కంతా చిత్రీకరణ, నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేయనున్నారు. జూలై చివరి వారం లేదా ఆగస్ట్ మొదటి వారంలో సినిమాను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి సంగీతం : మిక్కి జె.మేయర్, సినిమాటోగ్రఫీ : సమీర్ రెడ్డి, ఆర్ట్: రామాంజనేయులు, ఎడిటింగ్: మధు.

నరేశ్ కొత్త చిత్రం



అల్లరి నరేశ్ కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. రచయిత, దర్శకుడు పి.వి.గిరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఎ టీవి సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మించనున్నారు. నరేశ్ 55వ సినిమాగా తెరకెక్కనుంది. 'మేడ మీద అబ్బాయి' సినిమా తర్వాత చేస్తున్న చిత్రమిది. ఈ చిత్రానికి కెమెరా : నగేష్, కళ : గాంధీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికపాటి.

'గీతాంజలి' గుర్తుకు వస్తుంది

అసిన్ మూవీ క్రియేషన్స్ పతాకంపై హైదరాబాద్ నవాబ్స్ మూవీ ఫేమ్ లక్ష్మీకాంత్ చెన్నా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పరిచయం'. విరాట్ కొండూరు హీరోగా పరిచయం అవుతున్న ఈ మూవీలో సిమ్రత్ కౌర్ హీరోయిన్. ఈ చిత్రం టీజర్, ఫస్ట్ లుక్‌ని ఆదివారం నాని విడుదల చేశారు. అనంతరం నాని మాట్లాడుతూ ఈ చిత్రం టీజర్ చాలా ఫ్రెష్‌గా ఉందని, చూస్తుంటే మణిరత్నం 'గీతాంజలి' మూవీ గుర్తుకు వస్తుందని మళ్ళీ మళ్ళీ చూడాలని పించేలా ఉందని అన్నారు. హీరో కథకు సరిగ్గా నప్పాడని చెప్పారు. ఈ చిత్రం లవ్ ఎంటర్‌టైన్‌మెంట్ పాటు ఒక మంచి స్ట్రాంగ్ ఎమోషన్‌గా ఉంటుందని లక్ష్మీకాంతం చెన్నా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర, హీరో విరాట్ కొండూరు పాల్గొన్నారు.



'పరిచయం' చిత్రబృందంతో నాని

అందరినీ మెప్పించేలా..!

ఫైట్ మాస్టర్ విజయ్ తనయుడు రాహుల్ హీరోగా వి.ఎస్.క్రియేటివ్ వర్క్స్ బేనర్‌పై ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. కావ్య థాపర్ కథానాయిక. రాము కొప్పుల దర్శకత్వం వహిస్తున్నారు. దివ్య విజయ్ నిర్మాత. ఈ చిత్రం టాకీ పార్ట్‌ను పూర్తి చేసుకుంది. దర్శకుడు రాము కొప్పుల మాట్లాడుతూ 'సినిమా టాకీ పార్ట్ అంతా అనుకున్న విధంగా పూర్తయింది. సినిమా చాలా బాగా వచ్చింది. మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. రాహుల్ బాడీ లాంగ్వేజ్‌కి సరిపోయే కథ.తను క్యారెక్టర్‌లో అద్భుతంగా నటించారు' అని అన్నారు. నిర్మాత దివ్య విజయ్ మాట్లాడుతూ 'లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమా అందరినీ మెప్పించేలా ఉంటుంది. రాహుల్, కావ్య థాపర్ జోడి స్క్రీన్‌పై చక్కగా ఉన్నారు. సినిమా అవుట్‌పుట్ బాగా వస్తుంది. మణిశర్మ అద్భుతమైన బాణీలను అందించారు. అలాగే శ్యామ్ కె.నాయుడు సినిమాటోగ్రఫీ సినిమాకు మరో ఎసెట్ అవుతుంది' అని చెప్పారు.



కావ్య థాపర్, రాహుల్

శ్రీదేవి వల్లే నటినయ్యా



ప్రియాంక చోప్రా

తాను నటిని కావడానికి కారణం శ్రీదేవి అని గ్లోబల్ భామ ప్రియాంక చోప్రా అన్నారు. తన చిన్నతనం నుంచి శ్రీదేవిని చూస్తూనే పెరిగానని, ఆమె ప్రభావం వల్లే తాను ఈ రంగంలోకి వచ్చానని చెప్పారు ప్రియాంక. 'శ్రీదేవి 1980, 90 దశకాల్లో ప్రముఖ హీరోయిన్‌గా కొనసాగుతున్నప్పుడు నేను చిన్నదాన్ని. అప్పుడు ఆమె సినిమాలే ఎక్కువగా చూశాను. ఆమె నటన నాకెంతో ఇష్టం. తనలాగే నేను నటిని కావాలని అనుకునేదాన్ని" అని చెప్పారు ప్రియాంక. ఆమె కన్నుమూశారన్న వార్త విన్నవెంటనే తాను షాక్ గురయ్యానని పేర్కొన్నారు. అది తనలోనే కాదు ప్రతి ఒక్కరిలోనూ ఇదే పరిస్థితి ఏర్పడిందని, ఎందుకంటే శ్రీదేవి ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమానాన్ని సంపాదించుకున్నారని అందుకే ఈమెకు సంబంధించి అందరిలోనూ అనుభూతులు ఉంటాయని చెప్పారు. తానే కాదు ప్రతి ఒక్కరూ ఆమెలా కావాలని అనుకుంటారని, తనొక అవుట్‌టైమ్ యాక్టర్ అని తెలిపారు.

'2.0' టీజర్ లీక్

రజనీకాంత్, శంకర్ కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న '2.0' చిత్రం టీజర్ ఆదివారం ఉదయం లీక్ అయింది. అధికారికంగా విడుదల కాకముందే సామాజిక మాధ్యమాల్లో '2.0' టీజర్ రావడంపై చిత్రబృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. సినిమాను విభిన్నంగా ఉండేలా ప్రేక్షకుల ముందుకు ఎలా తీసుకెళ్లాలా? అని బుర్రలు బద్దలు కొట్టుకుంటున్న చిత్రబృందానికి ఈ లీక్ ఓ తలనొప్పిగా మారింది. ఇది వరకూ రజనీకాంత్ చేసిన 'కబాలి'కి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. లీక్ చేసిన వారిపై చర్యలకు సినిమా యూనిట్ ఉపక్రమించింది. నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించింది. ఈ విషయాన్ని సౌందర్య రజనీకాంత్ ట్విట్టర్‌లో తెలిపారు. సినిమా విడుదలకు ముందు కంటెంట్ విడుదల చేయడాన్ని ప్రోత్సహించొద్దని, చిత్రబృందం కష్టాన్ని మర్చిపోతున్నారని అన్నారు. 400కోట్లతో నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు చివరి దశలో ఉన్నాయి.



ప్రజాశక్తి
విజయవాడ
సోమవారం 5-3-2018

రూపాయి





బ్యాంకింగ్ యాప్‌తో ఇలా!

క్రమేణా.. ఆర్థిక సంస్థలకు, ఖాతాదారుల మధ్య పరోక్షంగా నిర్వహించే లావాదేవీలు తగ్గుముఖం పడుతున్నాయి. అందుకు కారణం బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ విధ్థా‍ అంతకంతకు విస్తరించడమే. ఏటిఎమ్ సెంటర్ల వ్యాప్తి నుంచి ఇప్పటి స్మార్ట్‌ఫోన్ల వరకూ.. బ్యాంకింగ్ రంగ సేవల్లో అనేక మార్పులు సంతరించుకుంటున్నాయి. అందులో కీలకంగా వినియోగంలోకి వస్తున్నవి డిజిటల్ యాప్స్. నిన్నటిదాకా డెస్క్‌టాప్ ద్వారా నిర్వహించే నెట్‌బ్యాంకింగ్ అనేది ఒక అద్భుతమైన సాంకేతిక సౌకర్యంగా భావిస్తే.. ఇటీవల విస్తరించిన బ్యాంకింగ్ యాప్స్ మరో సంచలనంగా మారాయి. అరచేతిలోని స్మార్ట్‌ఫోన్ ద్వారా నిమిషాల్లో లక్షల రూపాయల ఆర్థిక నిర్వహణ జరుపుకునే సౌలభ్యం ఈ డిజిటల్ యాప్స్ ద్వారా ఏర్పడింది. అయితే అలాంటి యాప్స్‌ను వినియోగించుకునే క్రమంలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరమూ ఉంది. అందుకే, ఆన్‌లైన్ బ్యాంకింగ్, యాప్‌ల విషయంలో ఎలా వ్యవహరించాలి..? వీటివల్ల లాభమా? నష్టమా? ఇందులో ఉండే సానుకూల, ప్రతికూల అంశాలేంటో ఈ వారం 'రూపాయి'లో తెలుసుకుందాం!!

గత ఏడాది నుంచి అంటే.. నోట్లరద్దు తర్వాత అన్ని బ్యాంకు ఖాతాదారులు అనివార్యంగా అన్‌లైన్ బ్యాంకింగ్ పద్ధతుల్ని ఆశ్రయించడం తప్పనిసరైంది. అయితే, బ్యాంకింగ్ వచ్చి బ్యాంకు లావాదేవీలను కాస్త సులభతరం చేసిన మాట వాస్తవం. ఆన్‌లైన్ బ్యాంకింగ్‌ని అలవాటు చేసే క్రమంలో బ్యాంకులు.. ప్రత్యేకమైన యాప్‌లను రూపొందించి, ఖాతాదారులను ముందుకు తెస్తున్నాయి.

దేశ జనాభా దాదాపు 130 కోట్లు. దాదాపు 100 కోట్ల మొబైల్ నెంబర్లు ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్లు వాడేవారు.. బ్యాంకింగ్ యాప్‌లను విస్తృతంగా వినియోగిస్తున్నారు. సాధారణ ఫోన్లు ఉన్నవారూ.. మొబైల్ బ్యాంకింగ్ ఉపయోగించేందుకు వీలుంది. ఎస్ఎంఎస్, మిస్డ్‌కాల్ ద్వారా నగదు నిల్వ ఎంత ఉంది? ఇతర లావాదేవీలను తెలుసుకునే సౌలభ్యమూ ఉంది. ఇప్పుడు దాదాపు ప్రతి బ్యాంకూ.. తమ ఖాతాదారుల కోసం ప్రత్యేకంగా యాప్‌లను అందిస్తున్నాయి. ఇవి సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాయి.



ఇలాంటి ఆర్థిక సేవలు

గతంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలన్నా.. రికరింగ్ డిపాజిట్ ప్రారంభించాలన్నా బ్యాంకులకు తప్పనిసరిగా వెళ్ళాల్సిందే. వేరొకరి ఖాతాలో నగదు జమ చేయాలంటే.. ఆ వ్యక్తికి ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చేది. మొబైల్ బ్యాంకింగ్ రాకతో వీటన్నింటికీ కాలం చెల్లింది. అయితే, చాలామంది మొబైల్ బ్యాంకింగ్ సేవలను కేవలం మొబైల్‌ఫోను రీఛార్జి చేసుకునేందుకు మాత్రమే ఎక్కువగా వాడుతున్నారు. ఇదొక ప్రయోజనం మాత్రమే. వాస్తవంగా మొబైల్ బ్యాంకింగ్ అందించే సేవలను పరిశీలిస్తే..నగదు నిల్వ తెలుసుకోవడం, గత పది లావాదేవీల వివరాలు (మినీ స్టేట్‌మెంట్), నగదు బదిలీ, తక్షణ నగదు చెల్లింపు (ఐఎంపీఎస్), చెక్కుబుక్కు కోసం అభ్యర్థన, బిల్లుల చెల్లింపు, ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్, ఈ రికరింగ్ డిపాజిట్ ఇలాంటి ఎన్నో లావాదేవీలను నేరుగా మీ మొబైల్ నుంచే నిర్వహించుకోవచ్చు. రోజులో ఎప్పుడైనా బ్యాంకు లావాదేవీలు నిర్వహించుకోవచ్చు.

జాగ్రత్తగా.. ఉండాలి!

స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు తమ బ్యాంకు యాప్‌లను నేరుగా సంబంధిత స్టోర్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత దాన్ని వాడేందుకు ఐడీ, పాస్‌వర్డ్‌ను పొందాల్సి ఉంటుంది. వీటిని బ్యాంకులు నేరుగా మీ నమోదిత మొబైల్ నెంబరుకు పంపిస్తాయి. అవసరమైతే బ్యాంకు వినియోగదారుల సేవాకేంద్రాన్ని సంప్రదిస్తే.. మీకు అవసరమైన సహాయాన్ని అందిస్తాయి. మొబైల్ బ్యాంకింగ్ యాప్‌కు తప్పనిసరిగా పాస్‌వర్డ్ ఉండేలా చూసుకోవాలి. పాస్‌వర్డ్, వోటీపి(వన్ టైమ్ పాస్‌వర్డ్) విషయంలో గోప్యత అవసరం. లేదంటే.. క్షణాల్లో మన అకౌంట్ నుంచి డబ్బులు మాయమయ్యే అవకాశాలూ ఉంటాయి. మొబైల్ ద్వారా.. లావాదేవీలు నిర్వహించేటప్పుడు బహిరంగ ప్రదేశాల్లో చేయకుండా ఉంటేనే మంచిది.







పర్స్‌లాంటిదే.. వ్యాలెట్

జేబులోనో.. పర్సులోనో డబ్బులు దాచిపెట్టుకునే రోజులు ఎప్పుడో పోయాయి. డెబిట్, క్రెడిట్ కార్డుల వాడకం అన్నిచోట్లా విస్తృతం అయ్యింది. ఇప్పుడు మొబైల్ వ్యాలెట్ల రాకతో.. ముందుగానే వాటిలో కొన్ని డబ్బులు నింపుకొని వాడుకునే వెసులుబాటు వచ్చింది. అంటే.. ఫోన్‌లో ఉండే బ్యాంక్ యాప్ వ్యాలెట్‌లోకి మనకుగల అకౌంట్ నుంచి అవసరమైనంత మేరకు డబ్బులు నిల్వ ఉంచుకోవడాన్ని వ్యాలెట్ అమౌంట్ అంటారు. అంటే.. మన జేబులో అవసరానికి సరిపడే డబ్బులు ఎలా అయితే పెట్టుకుంటామో.. అలాంటిదన్న మాట. వ్యాలెట్‌లో ఉన్న నగదును, వేరే అకౌంట్‌కు బదిలీ చేసుకోవచ్చు. రైల్వే, బస్‌టిక్కెట్, ఎలక్ట్రికల్ బిల్, సినిమా టిక్కెట్లు వంటి అనేక అవసరాలకు వాటిని ఖర్చు చేయొచ్చు. అయితే అన్‌లైన్ బ్యాంకింగ్, మొబైల్ యాప్‌లు వినియోగించే క్రమంలో.. ఏమేరకు అదనపు ఛార్జీలు పడుతున్నాయి? నష్టమా? లాభమా? వంటి విషయాల్ని పరిశీలించి.. ఆచితూచి వ్యవహరించడం అన్నిటికంటే ముఖ్యం.

- విశ్వచైతన్య

ఖాతాను.. తిరిగి ప్రారంభించాలంటే?!

సాధారణంగా ఖాతాదారు వేరే నగరానికో, దేశానికో వెళ్లినప్పుడు, అనారోగ్యం, ప్రమాదం బారిన పడినప్పుడు, మరణించినప్పుడు ఖాతాలో ఎలాంటి లావాదేవీలూ జరగవు. ఇలా ఏళ్ల తరబడి ఉంటే.. వాటిని నిష్క్రియా ఖాతాలు (ఎక్స్‌పైర్డ్ అకౌంట్స్)గా పరిగణిస్తాయి బ్యాంకులు. ఇలాంటి ఏదో ఒక కారణవల్ల.. ఆగిపోయిన ఖాతాను తిరిగి ఎలా పునరుద్ధరించుకోవచ్చో తెలుసుకుందాం!!



ఎలాంటి లావాదేవీలు నిర్వహించని ఖాతాల్లో మోసపూరిత జమలు, చెల్లింపులు జరక్కుండా నిరోధించేందుకే బ్యాంకులు వాటిని నిర్వహణలో లేని ఖాతాలుగా మారుస్తాయి. అలాంటప్పుడు ఖాతాదారులు ఇంటర్నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు, చెక్కులను ఉపయోగించడానికి సాధ్యపడదు.

నిర్వహణ లేకుంటే?!

నిర్వహణలో లేని ఖాతాల ద్వారా మోసాలు జరిగేందుకూ ఆస్కారం ఉంటుంది. ఖాతాలో చిరునామా ఎప్పటికప్పుడు కొత్తది ఉండేలా జాగ్రత్త పడాలి. లేకపోతే మీ ఖాతా లావాదేవీల వివరాలు మీ పాత చిరునామాకు వెళ్తుంటాయి. మీ ఖాతా వివరాలు, మీ వ్యక్తిగత వివరాలు ఇతరుల చేతికి లభిస్తే.. మోసపోయే అవకాశాలు లేకపోలేదు. చాలా సందర్భాల్లో ఇలా నిర్వహణలో లేని ఖాతాల ద్వారా మోసపూరిత లావాదేవీలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఒక ఖాతా పదేళ్లకు మించి నిష్క్రియా ఖాతాగా ఉంటే.. అందులో ఉన్న మొత్తాన్ని 'డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ (డీఈఏఎఫ్)'కు మళ్లిస్తారు. దీన్ని భారతీయ రిజర్వు బ్యాంకు నిర్వహిస్తుంటుంది. ఒకసారి ఈ ఖాతాకు మళ్లిన సొమ్ము తీసుకోవడానికి కొన్ని నిబంధనలను అనుసరించి, ఖాతాదారులు వెనక్కి తీసుకోవడానికి అవకాశముంది.

తిరిగి ప్రారంభించొచ్చు!

మన బ్యాంకు ఖాతా నిర్వహణలో లేదని ఈ మెయిల్ లేదా తపాలాలేఖ ద్వారాగానీ బ్యాంక్‌లు సమాచారం ఇస్తుంటాయి. అలాంటప్పుడు ఖాతాదారులు సంబంధింత బ్యాంకు శాఖను సంప్రదించాలి. ఇన్నాళ్లపాటూ ఎందుకు నిర్వహించలేదో సరైన కారణాలు వివరిస్తూ, తిరిగి కొనసాగించాలని అనుకుంటున్నానని ఒక లేఖ రాయాలి. దీనిపై ఖాతాదారుడు సంతకం చేయాలి. దీంతోపాటు కేవైసీ పత్రాలనూ జత చేయాలి. ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ పత్రాన్నీ సమర్పించాలి.

నిర్వహణ బాగుండాలి

ఒకవేళ మీకు ఏదైనా బ్యాంకు ఖాతాతో అవసరం లేకపోతే.. దాన్ని పూర్తిగా రద్దు చేసుకోవడం మేలు. ఆ ఖాతా మీకు తప్పనిసరి అవసరం అనుకుంటే.. కచ్చితంగా అందులో లావాదేవీలు నిర్వహించడం మంచిది. మీ బ్యాంకు ఖాతాలో మీరు ప్రస్తుతం ఉంటున్న చిరునామాను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలి. మొబైల్ నెంబరు, ఈమెయిల్ వంటివి మారితే వెంటనే బ్యాంకు ఖాతాలోనూ మార్పు చేయించుకోవాలి. బ్యాంకు లావాదేవీలకు సంబంధించి ఎస్ఎంఎస్ వస్తుందా? లేదా? చూసుకోవాలి. ఇవన్నీ మన బ్యాంక్ ఖాతాకు రక్షణగా నిలుస్తాయి.

'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పొస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

చిన్నారి



ఎవరిని?

నేనింటికి కాపలా ఉంటాను..
నేరస్తుల జాడ తెల్పుతాను..
నేనో.. పెంపుడు జంతువును..
ఏం చేసినా తోక వంకరుంటుంది..

జవాబు : కుక్క

జోక్ :

కిరణ్ : ఒరేయ్ రవీ! మీ ఇంటికి చాలా మంది వచ్చి పోతుంటారు. ఇంతకీ మీ నాన్న ఏంచేస్తుంటారు?
[illegible] దొరికిన చోటల్లా అప్పులు చేస్తుంటాడు!

రంగులు దిద్దండి!



పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని రైలు బొమ్మకు రంగులు వేయండి!

పుట్టుమచ్చలు ఎలా పుడతాయి?!



మీరు ఎప్పుడైనా గమనించారా?! మన శరీరంపై అక్కడక్కడా నల్లని మచ్చలు ఉంటాయి. వాటిని మనం నీళ్లతో, సబ్బుతో కడిగి తొలగించాలని ప్రయత్నించినా అవిపోవు. ఇప్పుడు మీకు గుర్తొచ్చిందా? అవే మన శరీరంపై అక్కడక్కడ ఉండే పుట్టుమచ్చలు. ఇవి చర్మంపై చాలా స్పష్టంగా కనబడతాయి. ఇవి మన శరీరంపై శాశ్వతంగా ఉండిపోతాయి. కాబట్టే వాటిని మనకు 'ఐడెంటిఫికేషన్ మార్క్' అంటారు. పదవ తరగతి పరీక్షలు రాసేటపుడు హాల్‌టికెట్ మీద మన ఫొటోతో పాటుగా పుట్టుమచ్చల వివరాలు ఇచ్చి ఉంటారు. వాటి ఆధారంగా పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థి నిజమైన వ్యక్తా? కాదా? అనేది నిర్ధారణ చేస్తారు. అంతేకాదు పిల్లలూ.. అనుకోకుండా ఏదైనా ప్రమాదంలో వ్యక్తి చనిపోతే అతని ముఖం గుర్తించలేకుండా ఉంటే అప్పుడు ఈ పుట్టుమచ్చల ఆధారంగానే ఫలానా వ్యక్తి అని గుర్తిస్తారు. ఇవి శరీరంపై ఏర్పడటానికి కారణం చర్మంలో ఉండే 'మెలినిన్' అనే పదార్థం. ఈ పదార్థం చర్మంలోని లోపలి పొరలలో సమంగా పరుచుకోకుండా ఒకచోట గుమిగూడినప్పుడు ఆ ప్రదేశంలో నల్లని మచ్చల్లాగా ఏర్పడతాయి. కొన్ని పుట్టుమచ్చల నుంచి వెంట్రుకలూ వస్తాయి. ఇవి చర్మంలోపలి 'డెర్మిస్' అనే పొరలపై మొదట ఏర్పడి, తర్వాత శరీర పైభాగానికి చేరుకుంటాయి. కాబట్టి అవి భవిష్యత్తులో చెరిగిపోయే ప్రశ్నేలేదు. పుట్టుకతోనే వచ్చే పుట్టుమచ్చల వల్ల ఏ ప్రమాదమూ ఉండదు. కానీ కొంత వయసు వచ్చిన తర్వాత కొత్తగా పుట్టుమచ్చలు శరీరంపై ఏర్పడినా, అంతకు ముందున్న మచ్చల పరిమాణం పెరుగుతున్నా, వాటి రంగు మారుతున్నా గమనంలోకి తీసుకోవాలి. ఇవి క్యాన్సర్‌లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదానికి సంకేతాలని జీవ, వైద్య శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ★





డ్యాన్స్ అంటే చాలా ఇష్టం

నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. టీవీలో సినిమా పాట వస్తే చాలు డ్యాన్స్ వేస్తూనే ఉంటా. మా స్కూల్లో అప్పుడప్పుడూ డ్యాన్స్ ప్రోగ్రాంలు జరుపుతుంటారు. వాటిల్లో కూడా నేను పాల్గొంటాను. ఈ మధ్య మా అమ్మతో కలిసి వాళ్ల ఆఫీసులో ఫంక్షన్‌కు వెళ్లా. అక్కడ స్టేజీమీద నాలాంటి పిల్లలందరూ డ్యాన్స్ వేస్తున్నారు. నేనూ అమ్మకు చెప్పకుండానే స్టేజీ ఎక్కేసా. వాళ్లందరితో కలిసి డ్యాన్స్ వేస్తుంటే అక్కడున్న అంకుల్ నీకు ఒక్కదానికి పాట వేస్తా. డ్యాన్స్ వేస్తావా! అని అడిగారు. వెంటనే సరేనన్నా. అంకుల్ 'వచ్చిందే పిల్ల మెల్లగ వచ్చిందే' అంటూ నాకెంతో ఇష్టమైన పాటను వేసారు. చాలా బాగా డ్యాన్సు చేశా. అందరూ ఒకటే ఈలలు, చప్పట్లు. నాకు భలేగా అనిపించింది. స్టేజీ దిగి వస్తుంటే శాంతి ఆంటి నాకు ముద్దు కూడా ఇచ్చారు. అక్కడున్న చాలామంది అక్కలు, ఆంటీలు నన్ను ఎంతగానో మెచ్చుకున్నారు. నాకు చాలా సంతోషం అనిపించింది.



సిహెచ్ పూజ,
ఎల్‌కెజి, ప్రగతి బాలవిద్యాలయం,
సుందరయ్యనగర్.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



సీనియర్ల గైర్హాజరీతో లంకలో రాణించేనా?

కొలంబో చేరిన టీమిండియా

6 నుండి నిదహస్ టీ20 ట్రై సిరీస్ ప్రారంభం



శ్రీలంకకు బయలుదేరే ముందు భారత ఆటగాళ్లు

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

శ్రీలంక వేదికగా భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక మధ్య జరిగే ముక్కోణపు సిరీస్ కోసం బయలుదేరిన టీమిండియా ఆదివారం లంకకు చేరింది. రోహిత్ శర్మ నాయకత్వంలో పూర్తి యువ జట్టుతో భారత్ లంక గడ్డపై ఈ నెల 6 ప్రారంభమయ్యే తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో తలపడనుంది. దక్షిణాఫ్రికా పర్యటన అనంతరం విరాట్ కోహ్లి, ఎంఎస్ ధోనీలతో పాటు పలువురు కీలక ఆటగాళ్లకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. దీంతో ఈ సిరీస్‌కి రోహిత్ శర్మ కెప్టెన్‌గా, శిఖర్ ధవన్ వైస్ కెప్టెన్ గా వ్యవహరించనున్నారు. కోహ్లి, ధోనీలే కాకుండా హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రాల గైర్హాజరీలో భారతజట్టు ఈ టోర్నీలో పాల్గొనబోతోంది. సీనియర్ల గైర్హాజరీ కారణంగా ఇటీవల జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో రాణించిన రిషబ్ పంత్, దీపక్ హుడా, మహ్మద్ సిరాజ్, విజయ్ శంకర్, వాషింగ్టన్ సుందర్‌లకు టీమిండియాలో బీసీసీఐ వీరికి స్థానం కల్పించారు. దీంతో యువకులతో కూడిన భారతజట్టు బలంగానే కనిపిస్తోంది. అయినప్పటికీ సీనియర్ల లేమి, ధోనీ అమూల్యమైన సలహాలు జట్టుకు దూరమయ్యాయనక తప్పదు. రంజీట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ ఆలీ టోర్నీలో కేవలం 38 బంతుల్లో 116 పరుగులు సాధించిన రిషబ్ పంత్‌కు టీమిండియాలో తొలి ప్రాధాన్యతను కల్పించారు. ఇటీవల 50 రోజుల సఫారీజట్టు పర్యటనను దిగ్విజయంగా పూర్తిచేసుకొని తిరిగొచ్చిన టీమిండియా వన్డే, టీ20 సిరీస్‌లను కైవసం చేసుకొని చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. టీ20 ట్రై సిరీస్ అనంతరం ఐపిఎల్-11 మెగా టోర్నీ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే.

బంగ్లా సారథి షకీబుల్ హసన్ అవుట్!

టోర్నీ (నిదహస్ ట్రోఫీ) ప్రారంభానికి ముందే బంగ్లాదేశ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. జనవరిలో చేతి వేలికి అయిన గాయం నుంచి పూర్తిగా కోలుకోని బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబల్ హసన్ నిదహాస్ ట్రోఫీకి దూరమయ్యాడు. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) శనివారం ప్రకటించింది. నిదహాస్ ట్రోఫీ కోసం ప్రకటించిన 16 మంది సభ్యుల జట్టులో తొలుత షకీబల్ హసన్ పేరును చేర్చింది. షకీబల్ గైర్హాజరీతో మహ్మదుల్లాకు బంగ్లా జట్టు పగ్గాలు అప్పగించింది. షకీబల్ స్థానాన్ని బ్యాట్స్‌మన్ లిటన్ దాస్ భర్తీ చేయనున్నాడు. టోర్నీలో భాగంగా ఈ నెల 6న భారత్-శ్రీలంక జట్టు పోటీ పడనున్నాయి. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో తొలిపోరు ప్రారంభం కానుంది.

ట్రైసిరీస్‌కి ముందు శ్రీలంకకు మరో షాక్

నిదాస్ ట్రోఫీ ప్రారంభానికి ముందే శ్రీలంకకు మరో భారీ షాక్ తగిలింది. ఇప్పటికే గాయాల కారణంగా ఆల్ రౌండర్ అంజిలో మ్యాథ్యూస్, అసెలా గుణ రత్నే జట్టుకు దూరమైన విషయం తెలిసిందే. వీరికి తోడుగా ఆ జట్టు కీపర్ నిరోషన్ డిక్ వెలా కూడా జట్టుకు దూర మయ్యాడు. శ్రీలంక 70 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఈ సిరీస్ నిర్వహిస్తున్నారు. అయితే డిక్‌వెలా ను జట్టు నుంచి తప్పించడానికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదు.

6 నుండి శ్రీలంకలోని కొలంబో మైదానంలో నిదహస్ టీ20 ట్రై సిరీస్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో భారత్‌తోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు పాల్గొంటున్నాయి. లంకజట్టులో ఇప్పటికే గాయాల కారణంగా ఆల్‌రౌండర్ అంజిలో మ్యాథ్యూస్, అసెలా గుణరత్నేతో పాటు వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెలా దూరమయ్యారు. బంగ్లాదేశ్ జట్టు సారథి షకీబుల్ హసన్ సైతం చేతి వేలికి గాయం కారణంగా టోర్నీకి దూరమైనట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ప్రకటించింది.

జట్ల బలా బలాలు

భారత జట్టు : రోహిత్ శర్మ (కెప్టెన్), ధావన్, రాహుల్, సురేష్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనద్కట్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

శ్రీలంక జట్టు : దినేష్ చండీమాల్ (కెప్టెన్), ఉపుల్ తరంగ, ధనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, దసున్ శనక, కుశాల్ పెరీరా, జీవన్ మెండీస్, లక్మల్, ఇసురు ఉదన, అకిల ధనుంజయ, అమిల అపోన్సో, నువాన్ ప్రదీప్, దుష్మంత చమీరా, ధనుంజయ డిసిల్వ, తిషారా పెరీరా.

బంగ్లాదేశ్ జట్టు : మహ్మదుల్లా, తమీమ్ ఇక్బాల్, సౌమ్యా సర్కార్, ముష్ఫికర్ రహీమ్ (కీపర్), షబ్బీర్ రహమాన్, ముస్తఫిజుర్ రహమాన్, రుబేల్ హుస్సేన్, అబు జయాద్, తస్కిన్ అహ్మద్, ఇమ్రుల్ ఖయాస్, నూరుల్ హసన్, మెహదీ హసన్. అబు హైదర్, ఆరిఫుల్ హక్, నజముల్ ఇస్లామ్, లితన్ దాస్.

10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో రిజ్వీ ప్రపంచ రికార్డ్

జీతూరాయ్, ఘోష్‌లకు కాంస్యాలు


క్రిస్టియన్ రెయిట్జ్, షెజార్ రిజ్వీ, జీతూ రాయ్

మెక్సికో : 10 మీటర్ల ఎయిర్ పిస్టర్ విభాగంలో భారత్‌కు చెందిన షెజార్ రిజ్వీ ప్రపంచ రికార్డ్ సృష్టించాడు. ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ విభాగంలో భాగంగా ఆదివారం జరిగిన ఈ ఈవెంట్‌లో పాల్గొని 242.3 పాయింట్లతో ఈ ఫీట్ సాధించడంతో పాటు బంగారు పతకాన్ని గెలుపొందాడు. ఇదే విభాగంలో పాల్గొన్న ఒలింపిక్ ఛాంపియన్ క్రిస్టియన్ రెయిట్జ్ (జర్మనీ)ను రిజ్వీ ఫైనల్లో ఓడించాడు. క్రిస్టియన్ రెయిట్జ్ 239.7 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితమై రజితాన్ని... భారత్‌కే చెందిన జీతూ రాయ్ 219 పాయింట్లతో కాంస్య పతకాలను గెలుచుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో వరల్డ్‌కప్‌లో పాల్గొన్న తొలిసారే ఈ ఘనత సాధించిన భారతీయునిగా రికార్డ్ సృష్టించాడు. భారత్‌కే చెందిన ఓమ్‌ప్రకాష్ మిథర్వాల్ 198.4 పాయింట్లతో నాల్గోస్థానంలో నిలిచి నిరాశపరిచాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల విభాగంలో భారత్‌కు చెందిన మెహులీ ఘోష్ 228.4 పాయింట్లు సాధించి కాంస్య పతకం సాధించింది.

కొల్‌కత్తా సారథిగా దినేశ్ కార్తీక్



కొల్‌కత్తా : గౌతమ్ గంభీర్‌ను తప్పించిన అనంతరం కొల్‌కత్తా నైట్ రైడర్స్ సారథ్య బాధ్యతలు దినేష్ కార్తీక్‌కు అప్పగించారు. ఈ విషయాన్ని కలకత్తా ఫ్రాంచేజీ సీఈవో వెంకీ మైసూర్ ఆదివారం ప్రకటించారు. దీంతో కలకత్తా సారథ్య బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారన్న ఉత్కంఠకు తెరపడినట్లయ్యింది. జట్టులోని పలువురు సీనియర్ల పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ.. చివరికి ఆ అదృష్టం దినేశ్ కార్తిక్‌కు దక్కింది. ఫ్రాంచేజీ సిఇవో వెంకీ కార్తిక్‌ను ఎంచుకోవడానికి గల కారణాలను ఈ సందర్భంగా వివరించారు. 'జట్టులో దీర్ఘకాలిక మార్పు కోసం చూ-స్తున్నాం గౌతం గంభీర్ స్థానాన్ని భర్తీ చేయగల సామర్థ్యం ఎవరిలో ఉంది అని పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నాం. సీనియర్ ఆటగాళ్లైన క్రిస్ లీన్, రాబిన్ ఊతప్పల పేర్లు కూడా పరిశీలించి.. చివరికి దినేశ్ కార్తీక్‌కు ఆ బాధ్యతలు అప్పగించాం. రాబిన్ ఊతప్పను వైస్ కెప్టెన్‌గా నియమించాం.' అని వెంకీ తెలిపారు.

పంజాబ్ బౌలింగ్ కోచ్‌గా వెంకటేష్ ప్రసాద్

టీమిండియా జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన వెంకటేశ్ ప్రసాద్ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ విషయాన్ని కేఎక్స్‌ఐపీ ప్యానెల్ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా వెంకటేశ్ ప్రసాద్ తమ బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంపై వీరేంద్ర సెహ్వాగ్ మాట్లాడుతూ.. "విదేశీ కోచ్‌తో వెంకటేశ్ కూడా జత కట్టడం ఎంతో సంతోషంగా ఉంది. వీళ్ల అనుభవంతో ఈ ఏడాది మా జట్టు మంచి ఫలితాలు సాధిస్తుందని భావిస్తున్నా" అని అన్నారు.

ఇంగ్లండ్‌తో 'డ్రా'

అజ్లాన్‌షా హాకీ టోర్నీ



కౌలాలంపూర్ : 27వ అజ్లాన్‌షా హాకీ టోర్నీలో భారత హాకీ జట్టు రెండో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఆదివారం ఇంగ్లండ్‌తో తలపడి 1-1 గోల్స్‌తో ఇరుజట్లు సమంగా నిలిచాయి. దీంతో సర్దార్ సేన ఈ టోర్నీలో రెండు మ్యాచ్‌లు ఆడి ఒక ఓటమి ఒక డ్రాతో నాల్గో స్థానంలో నిలిచింది. తొలి క్వార్టర్ 14వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్ చేసి టీమిండియా తొలి గోల్‌ను సాధించి ఇంగ్లండ్‌పై 1-0 ఆధిక్యతను సంపాదించి పెట్టాడు. అనంతరం అందివచ్చిన అనేక అవకాశాలను చేజార్చుకోవడంతో అదే ఆధిక్యతతో నాల్గవ క్వార్టర్‌వరకు కొనసాగించింది. నాల్గవ క్వార్టర్ చివర్లో ఇంగ్లండ్‌కు చెందిన మార్క్ గ్లెగోర్న్ 52వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. దీంతో ఇరుజట్లకు ఒక్కొక్క పాయింట్ లభించాయి. ఈ మ్యాచ్‌లో భారత హాకీజట్టుకు ఎన్నో అవకాశాలు వచ్చినప్పటికీ సద్వినియోగం చేసుకోలేక చేజేతులా మ్యాచ్‌ను డ్రాగా ముగించాల్సి వచ్చింది. భారత్‌కు చెందిన శీలానంద్‌కు అంపైర్ గ్రీన్ కార్డ్ చూపించడంతో మైదానం విడవాల్సి వచ్చింది. దీంతో మన హాకీజట్టు 10మందితోనే చివరివరకూ ఆడాల్సి వచ్చింది. టీమిండియా మంగళవారం పటిష్టమైన ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఆదివారం జరిగిన ఇతర మ్యాచ్‌లలో అర్జంటీనాజట్టు ఐర్లాండ్‌ను 5-3తోనూ, ఆస్ట్రేలియా జట్టు మలేషియా జట్టుపై 3-1 గోల్స్ తేడాతో గెలిచి రెండో విజయాలను నమోదు చేసుకొని పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచాయి.


ప్రజా సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న జగన్

కెసిఆర్, కేంద్రానికి చంద్రబాబు సరెండర్

పెట్రోల్ ధరలతో భారీ దోపిడి

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఇస్తాం

అద్దంకి బహిరంగ సభలో ప్రతిపక్ష నేత జగన్ విమర్శ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

తెలంగాణ సిఎం కెసిఆర్, కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సరెండర్ అయ్యారని ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా ప్రకాశం జిల్లా అద్దంకిలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో జగన్ ప్రసంగించారు. సాగర్ నీరు అడగటానికి కూడా సిఎం చంద్రబాబు కెసిఆర్‌ని చూసి భయపడుతున్నా రన్నారు. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియో టేపులతో అడ్డంగా దొరికి పోవడమే దీనికి కారణమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పెట్రోలు లీటరుకు రూ.7 పెంచి అమ్మకాలు చేస్తున్నారని, ఈ డబ్బు ఎవరి జోబుల్లోకి పోతోందని జగన్ ప్రశ్నించారు. గతంలో రేషన్ షాపుల్లో రూ.185కే అన్ని రకాల వస్తువులు ఇచ్చే పరిస్థితి ఉంటే నేడు బియ్యం తప్పా ఏమి రావడం లేదన్నారు. బియ్యంలోనూ కోత పెడు తున్నారని చెప్పారు. పోలవరం, పట్టిసీమ కాంట్రా క్టులు తీసుకొని ప్రత్యేక హోదా విషయంపై కేంద్రాన్ని ప్రశ్నించకుండా కేంద్రం వద్ద చంద్రబాబు సాగిలా పడ్డారని దుయ్యబట్టారు. చంద్రబాబు తన ఎంపీలతో రాజీనామాలు చేయిస్తే కేంద్రం ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వదని ప్రశ్నించారు. ఆఖరి అస్త్రం పేరుతో ఆంధ్రరాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి నెలకు రూ.10వేల ఫించన్ ఇస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకంలో మార్పులు తెస్తామని, వెయ్యి రూపాయలు దాటిన ఏ జబ్బుకైనా ఆరోగ్యశ్రీలో వైద్యం లభిస్తోందని, నచ్చిన సిటీలలో, నచ్చిన ఆసుపత్రులలో వైద్యం చేయించడమే కాకుండా, విశ్రాంతి సమయంలో ఖర్చులకు డబ్బులిస్తామని చెప్పారు.

కుస్తీలో బంగారు పతకం సాధించి తండ్రి అప్పులు తీర్చేసింది


నవజ్యోత్ కౌర్

చండీగఢ్ : సీనియర్ ఏషియన్ కుస్తీ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించిన నవజ్యోత్ కౌర్ తన బంగారు పతకంతో కుటుంబ భారాన్ని తగ్గించింది. గత దశాబ్దకాలంతో ఆమె తండ్రి సుక్‌చైన్ సింగ్ ఆమె ప్రాక్టీస్ కోసం చేసిన అప్పులను కౌర్ ఈ మెడల్‌తో వచ్చిన డబ్బులతో తీర్చేసింది. కౌర్ ప్రాక్టీస్ కోసం ఆమె తండ్రి దాదాపు 13 లక్షల రూపాయలు అప్పు చేశాడు. ఆమె ప్రాక్టీస్ కోసం ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందలేదని, దీంతో తప్పని పరిస్థితుల్లో అప్పు చేశానని ఆమె తండ్రి సుక్‌చైన్ తెలిపారు. ఇప్పుడు తమ కష్టానికి ప్రతిఫలంగా కౌర్ బంగారు పతకం సాధించడమే కాక.. అప్పుల భారాన్ని కూడా తీర్చేడయం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. 65 కేజీల మహిళల కుస్తీ విభాగంలో కౌర్ జపాన్ రెజ్లర్ మియా ఇమాయిపై 9-1 తేడాతో విజయం సాధించి బంగారు పతకం సాధించిన విషయం తెలిసిందే.

ఏజెన్సీలో అంగన్‌వాడీ కేంద్రాల కొరత

పాడేరులోనే 1306 కేంద్రాలు కావాలి

ప్రతిపాదనలు పంపినా పట్టించుకోని ప్రభుత్వం

పౌష్టికాహార లోపంతో గిరిజనుల్లో రక్తహీనత



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏజెన్సీ ఏరియాల్లో సరిపడా సంఖ్యలో అంగన్‌వాడీ కేంద్రాల్ని ఏర్పాటు చేసి, గిరిజనులకు అంగన్‌వాడీ సేవల్ని అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని ఐటిడిఏలతో పాటు, శ్రీశైలం, నెల్లూరు ఐటిడిఏల పరిధిలోని వేలాది గిరిజన గూడేలలో అంగన్‌వాడీ కేంద్రాల్ని ఏర్పాటు చేయడంలో తాత్సారం చేస్తోంది. ఫలితంగా వేలాది మంది ఆదివాసీలు ఈ సేవలకు దూరమవుతున్నారు. సుమారు 2,526 అంగన్‌వాడీ కేంద్రాలు అవసరమని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వేల కోట్ల రూపాయల మేర గిరిజన ఉపప్రణాళిక నిధులు మిగిలిపోతున్నా, కేంద్రాల్ని ఏర్పాటు చేయడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒక్క పాడేరులోనే 1,306 అంగన్‌వాడీ కేంద్రాలు అవసరమని అధికారులు చెబుతున్నారు. సీతంపేట ఐటిడిఏ పరిధిలో 454, పార్వతీపురంలో 348, రంపచోడవరంలో 360, చింతూరులో 49, శ్రీశైలంలో 9 అంగన్‌వాడీ కేంద్రాలు అవసరమని గుర్తించారు. నెల్లూరు ఐటిడిఏ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు లేని గిరిజన గ్రామాలు సుమారు 515 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇవి కాకుండా ఏయే గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలు అవసరమో గుర్తించి, వాటి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆయా జిల్లా కలెక్టర్లకు కూడా ఆదేశాలు జారీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్ని ఏర్పాటు చేయాలని ఇదివరకే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేదని, ఏర్పాటుపై ఇంత వరకు ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదని చెబుతున్నారు. ప్రభుత్వం ఇదే ధోరణిని కొనసాగిస్తే అంగన్‌వాడీ కేంద్రాల సేవలకు గిరిజనులు శాశ్వతంగా దూరమయ్యే ప్రమాదముందని చెబుతున్నారు.

పౌష్టికాహార లోపాన్ని నివారిం చేందుకు అవసరమైన సేవలు అందించడంలో అంగన్‌వాడీ కేంద్రా లదే ప్రముఖ పాత్ర. గర్భవతులు, బాలింతల నుంచి అప్పడే పుట్టిన శిశువులు, ఆరేళ్ల పసి పిల్లల వరకు ఆహారాన్ని అందించడంలో అంగన్ వాడీ కార్యకర్తలే కీలక పాత్ర పోషిస్తారు. ఇప్పటికే గిరిజన గ్రామాల్లో పౌష్టికాహార లోపంతో వేలాది మంది సతమతమవుతున్నారు. ఫలితంగా చిన్న వయస్సు లోనే కొంత మంది మృత్యువాత పడుతుంటే మరి కొందరు రక్తహీతన వంటి ప్రాణాంతక వ్యాధులతో జీవన్మరణ పోరాటం సాగిస్తున్నారు. దీంతో పాటు మాతా శిశు మరణాలు కూడా సంభవిస్తున్నాయి. వీటి బారి నుంచి తప్పించి, కొంత వరకైనా పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి ఈ అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయి. కానీ ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదు. అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ఆర్థిక పరమైన కారణాల్ని ప్రభుత్వం చెబుతున్నట్లు సమాచారం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, వేల సంఖ్యలో అంగన్‌వాడీ కేంద్రాల్ని ఏర్పాటు చేయడం వల్ల ఇంకా అదనపు ఆర్థిక భారం పడే అవకాశముందని, అందువల్లే ఏర్పాటు చేయడానికి వెనకడుగు వేస్తోందని తెలుస్తోంది.

ఎస్ఎస్‌సి కుంభకోణంపై సిబిఐ దర్యాప్తు


న్యూఢిల్లీలో ఎస్ఎస్‌సి ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

న్యూఢిల్లీ : స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సి) పేపర్ లీకేజ్‌పై సిబిఐతో దర్యాప్తు చేయించేందుకు ఎస్ఎస్‌సి ఛైర్మన్ ఆశిమ్ ఖురానా ఆదివారం అంగీకరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. గతనెల 17 నుంచి 22 వరకు ఎస్ఎస్‌సి సీజీఎల్(టైర్-2) పరీక్షలను నిర్వహించారు. ఇందులో కొన్ని పేపర్లు లీకైనట్లు వార్తలు వచ్చాయి. సమాధానలతో సహా సామాజిక మీడియాలో దర్శనమిచ్చాయి.

దీంతో గత నెల 21వ తేదీ జరగాల్సిన పరీక్షను వాయిదా వేశారు. పేపర్ లీక్ కావడంతోనే పరీక్ష వాయిదా వేసినట్లు వార్తలు రావడంతో అభ్యర్థులు దిల్లీలో గత కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ వివాదంపై దిల్లీ భాజపా ఎంపీ మనోజ్ తివారీ కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. ఎస్ఎస్‌సీ పేపర్ లీకేజ్‌పై సీబీఐ దర్యాప్తు చేయించాల్సిందిగా ఎస్ఎఫ్ఐ, కాంగ్రెస్, అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే సిబిఐ దర్యాప్తు చేయించేందుకు ఎస్ఎస్‌సీ నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగ కొలువులను సాధించాలని ఎంతో కష్టపడి చదువుతున్న యువత భవిష్యత్‌ను ఇలాంటి వివాదాలతో గందరగోళంలోకి పడేసినట్లు అవుతోందని ఎస్ఎఫ్ఐ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది.

ఆఫ్ఘన్‌కు షాక్

స్కాట్లాండ్ చేతిలో ఓటమి

హరారే : ప్రపంచకప్ అర్హత మ్యాచ్‌లలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు తొలిమ్యాచ్‌లోనే ఓటమి పాలైంది. తనకన్నా చిన్న జట్టైన స్కాట్లాండ్ చేతిలో 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్ జట్టు 49.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టులో మహ్మద్ నబీ (92) అత్యధిక పరుగులు చేశాడు. నజిబుల్లా జద్రాన్ 67 పరుగులతో రాణించాడు. అనంతరం ఆ లక్ష్యాన్ని స్కాట్లాండ్ జట్టు 47.2 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి సాధించింది. ఆ జట్టులో కలమ్ మెక్లోడ్ అజేయంగా 157 పరుగులు చేశాడు. ఇతర మ్యాచ్‌లలో జింబాబ్వేజట్టు నేపాల్‌పై 116 పరుగులు తేడాతోనూ, ఐర్లాండ్ జట్టు నెదర్లాండ్‌పై 93 పరుగుల తేడాతో... యుఎఇజట్టు పప్పున్యూగేనియా జట్టుపై 56 పరుగులు తేడాతో విజయాలను నమోదు చేసుకున్నాయి.



ఆసీస్‌కు గెలుపు లాంఛనమే!

స్టార్క్ మ్యాజిక్

డర్బన్ : దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో ఆసీస్‌జట్టు గెలుపు ముంగిట నిలిచింది. ఆదివారం 417 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సఫారీ జట్టు నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది. ఆసీస్ జట్టు మరొక్క వికెట్ సాధిస్తే ఈ టెస్ట్‌మ్యాచ్ గెలవనుండగా... క్రీజ్‌లో వికెట్ కీపర్ డికాక్ (81) ఉన్నాడు. సఫారీజట్టు ఓపెనర్ మార్క్రమ్ 143 పరుగులు చేసి ఐదో వికెట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. అంతకుముందు 9 వికెట్ల నష్టానికి 213 పరుగులతో బ్యాటింగ్‌కు దిగిన కంగారు జట్టు 227 పరుగులకు ఆలౌటైంది. దీంతో సఫారీ జట్టుకు 417 లక్ష్యం నిర్దేశించగలిగింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సఫారీజట్టు ఒక దశలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులతో పటిష్టంగా ఉన్న జట్టును ఆసీస్ ఫాస్ట్ బౌలర్ స్టార్క్ ఒక్క ఓవర్‌లో మూడు వికెట్లు పడగొట్టి మ్యాచ్ స్వరూపం మార్చేశాడు. 80వ ఓవర్‌లో ఫిలాండర్, మహరాజ్, రబాడలను ఔట్‌చేసి మ్యాచ్‌ను ఆసీస్‌వైపు మొగ్గేలా చేశాడు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68